veluturu telugu daily

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ | ఆదివారం 4.10.2026

సంపుటి : 9 | సంచిక : 112

www. veluturu.com

## 22-ఎ సమస్యల పరిష్కారంలో మరో కీలక అడుగు

- నాలా అనుమతి లేకున్నా నివాస వినియోగంలోకి వచ్చిన పట్టా భూముల రిజిష్ట్రేషన్లకు తీపి కబురు
- నాలా రుసుము చెల్లింపుతో అర్హత ఉన్న భూముల రిజిష్ట్రేషన్లకు మార్గం సుగమం.. ఉత్తర్వులు జారీ

2

## అంత్యక్రియల ప్రయాణంలో అంతులేని విషాదం

### ప్రైవేట్ బస్సు బోల్తా.. ఐదుగురు మృతి

- ఆరుగురి పరిస్థితి విషమం.. 40 మందికి తీవ్ర గాయాలు
- మృతులంతా సంగారెడ్డి జిల్లాకు చెందిన వాసులు
- అంత్యక్రియల కోసం వస్తుండగా ఘటన
- క్షేత్ర గాత్రులను మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలింపు
- సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశాలు జారీ

**వికారాబాద్, వెలుతురు:**

వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అంత్యక్రియల కోసం వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సు అనంతగిరి హిల్స్ మూల మలుపులో బోల్తాపడడంతో బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురు మృతి చెందగా 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా ధరూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన నారాయణరెడ్డి బతుకుదెరువు కోసం పటాన్ చెరువులోని ఇస్నాపూర్‌లో నివాసముంటు జీవనోపాధి గడుపుతున్నా డు. ఆయన ఆకస్మికంగా మృతి చెందడంతో స్వగ్రామమైన చింతకుంటలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఈ అంత్యక్రియల కోసం జిల్లా శంకర్ పల్లి మండలం కేసారం గ్రామానికి చెందిన బంధువులు దాదాపు ఈ 55 మంది ఒక ప్రైవేట్ బస్సులో అంత్యక్రియల కోసం చింతకుంట గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో వికారాబాద్ అనంతగిరి హిల్స్ మూలమలుపు దగ్గరకు రాగానే ప్రైవేట్ బస్సు బ్రేకులు పనిచేయకపోవడంతో మూలమలుపులో నిలోయలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వాళ్ల కాళ్లు చేతులు విరిగి తలలు పగడం పగలడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని పెద్ద ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలియగానే వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి జిల్లా ఎస్పీ స్నేహమే హ్రా హుటా హుటిన

- మిగతా 2 లో..

# ఆటో కార్మికుల సంక్షేమానికి త్వరలో బోర్డు

## మానవీయ కోణంలో సమస్యల పరిష్కారం..

- ఆటో ఛార్జీని కిలోమీటర్‌కు రూ.14కు పెంచాం
- 2014 తర్వాత ఆటో డ్రైవర్ల సమస్యలను పట్టించుకోలేదు..
- ఉద్యమాలు చేసినా నాటి పాలకులు స్పందించలేదు
- ప్రజల అజెండాతో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రజా భవన్‌లో ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులకు ఆత్మీయ విందు ఇచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ఆటో కార్మికులు, వారి కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆటో డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలన్నింటినీ మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలనే అజెండాగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. శనివారం రాత్రి ప్రజాభవన్‌లో హైదరాబాద్ నగర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆత్మీయ విందు ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆటో సంఘాల నాయకులతో భోజనం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడారు.**

**హైదరాబాద్, వెలుతురు:**

ఆటో డ్రైవర్ల సమస్యలను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లోతుగా అధ్యయనం చేసి కేబినెట్ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఆటో ఛార్జీల పెంపుపై డ్రైవర్లు చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం.. కేబినెట్‌లో చర్చించి కిలోమీటర్‌కు రూ.11గా ఉన్న ఛార్జీని రూ.14కు పెంచుతూ జీఓ జారీ చేసిందన్నారు. 2014లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలోనే ఆటో ఛార్జీని కిలోమీటర్‌కు రూ.11గా నిర్ణయించిందని గుర్తుచేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లపాటు అధికారంలో ఉన్న పాలకులు ఆటో డ్రైవర్ల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. డ్రైవర్లు అనేక ఉద్యమాలు చేసినప్పటికీ వారిని పిలిచి మాట్లాడటం, వారి సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించడం జరగలేదన్నారు.

### సంక్షేమ బోర్డుపై కేబినెట్‌లో చర్చ..

రవాణా రంగంలో దాదాపు 20 లక్షల కార్మిక కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. వారి సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్న అంశంపై ఇప్పటికే కేబినెట్‌లో చర్చించామని చెప్పారు. చట్టసభల్లో చర్చించి, అవసరమైన నిధులు కేటాయించే ప్రక్రియను పూర్తి చేసి త్వరలోనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆటో డ్రైవర్లు కోరుతున్న ఇతర అంశాలపైనా కొంత సమయం తీసుకుని న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో ప్రస్తుతం పెంచిన రూ.14 ఛార్జీ సరిపోతుందా అనే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందన్నారు.

### ప్రజల అజెండాతో ప్రజా ప్రభుత్వం

కేవలం జీఓలు జారీ చేసి ప్రచారం చేసుకోవడం తమ ప్రభుత్వ ఉద్దేశం కాదని అన్నారు. ప్రజాభవన్‌కు ఆటో డ్రైవర్ల సంఘాల నాయకులను ఆహ్వానించి, వారితో కలిసి భోజనం చేస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే ఈ సమావేశం ఉద్దేశమన్నారు. ప్రభుత్వం తమది, ప్రజలదే అనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు.

- మిగతా 2 లో..

## గౌరవెల్లి భూసేకరణకు వేగం

- పనులు ముందుకు తీసుకెళ్లాలని మంత్రుల ఆదేశం
- భూసేకరణ, ఆర్అండ్ఆర్, అనుమతులపై సమీక్ష
- ఎకరాకు రూ.17 లక్షల పరిహారం
- కాలువల పనులకు అడ్డంకులు లేకుండా చర్యలు
- సవరించిన అంచనాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు

11

## ఈవీఎంలపై ఆరోపణలు చేస్తే.. బ్యాలెట్‌తో ఎన్నికలకు సిద్ధమా?

- కాంగ్రెస్ సీఎంలారా.. రాజీనామా చేసి రండి
- కేరళ, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌లో గెలిచింది ఈవీఎంలతో కాదా
- జ్ఞానేశ్ కుమార్‌కు, బీజేపీకి ఏం సంబంధం
- సీఈసీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ
- ఇండీ కూటమికి జనాదరణ లేదు
- మచ్చార్ ధైర్య సాహసాలపై స్పందించని వాళ్లంతా దేశద్రోహులే

2

# అక్టోబర్ వానలపై ఆశలు..!

## ఐఎండీ తాజా అంచనాలతో "లోటు"కు తెరపడేనా

- నైరుతి సీజన్‌లో 17 శాతం లోటు.. 18 జిల్లాల్లో లోటు వర్షపాతం
- ముందస్తు చర్యల్లో ప్రభుత్వం..
- రూ.802.92 కోట్ల కంటింజెన్సీ ప్రణాళిక

**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 3:** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల్లో ఎదురైన వర్షపాతం లోటుకు అక్టోబర్ వర్షాలు తెరదించనున్నాయా ప్రస్తుతం తెలంగాణలో ఇదే ఆసక్తికరమైన ప్రశ్న. నైరుతి సీజన్ ముగిసే నాటికి రాష్ట్రంలో వర్షపాతం లోటుగా నమోదైంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కురిసిన వర్షాలు రాష్ట్ర అవసరాలకు, దీర్ఘకాలిక సగటుతో పోలిస్తే వెనుకబడ్డాయి. అయితే అక్టోబర్ ప్రారంభంలో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు కనిపిస్తుండటంతో ఈ లోటు కొంత మేర పూడే అవకాశం ఉందా అన్న చర్చ మొదలైంది.

నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసినప్పటికీ.. వర్షాల సీజన్ పూర్తిగా ముగిసిపోలేదనే సంకేతాలను భారత వాతావరణ శాఖ తాజా అంచనాలు ఇస్తున్నాయి. అక్టోబర్ 3న జారీ చేసిన హెచ్చరికల ప్రకారం అక్టోబర్ 6, 7 తేదీల్లో తెలంగాణలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 3, 4, 5 తేదీలకు ఎలాంటి హెచ్చరిక లేదని, 8, 9 తేదీల్లోనూ ప్రత్యేక హెచ్చరిక లేదని ఐఎండీ పేర్కొంది. అయితే ఈ ఏడాది వర్షపాతం లోటు నేపథ్యంలో ఎల్‌నినోపై చర్చ మరింత పెరిగింది. పసిఫిక్ మహాసముద్రంలోని సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, వాతావరణ ప్రసరణలో మార్పులతో ఏర్పడే ఎల్‌నినో భారత నైరుతి రుతుపవనాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితుల ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం కూడా ఇందుకు సంకేతమే.

### రైతులకు కీలకమైన అక్టోబర్ వర్షాలు

నైరుతి సీజన్‌లో ఏర్పడిన వర్షపాతం లోటు నేపథ్యంలో రబీ సాగుకు అక్టోబర్ వర్షాలు కీలకంగా మారాయి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లో నేలలో తేమ పెరగడం, చెరువులు-కుంటల్లో నీటి నిల్వలు పెరగడం, భూగర్భ జలాల రీచార్జి జరగడం రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. అయితే భారీ వర్షం కంటే విస్తృతంగా, సమతుల్యంగా కురిసే వర్షాలే వ్యవసాయానికి ఎక్కువ ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. తక్కువ వ్యవధిలో అత్యధిక వర్షపాతం కురిసి.. ఆ తర్వాత సుదీర్ఘంగా పొడి వాతావరణం కొనసాగితే నేలలో తేమ నిల్వ, పంటల అవసరాలకు అనుగుణంగా నీటి లభ్యతపై ఆశించిన ప్రయోజనం ఉండకపోవచ్చు. అందుకే అక్టోబర్‌లో కురిసే ప్రతి వర్షాన్ని రైతులు, వ్యవసాయ అధికారులు, నీటిపారుదల శాఖ నిశితంగా గమనించాల్సి ఉంటుంది. వర్షపాతం పరిమాణంతో పాటు దాని విస్తృతి, వ్యవధి, నీటి వనరులపై ప్రభావం కూడా కీలకంగా మారనుంది.

### ముందస్తు చర్యల్లో ప్రభుత్వం

ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు

- మిగతా 2 లో..

## ఓటర్ల జాబితాలో అక్రమాలపై ఇండియా కూటమి పోరుబాట

- అక్టోబర్ 6న జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు
- 8న లోక్‌భవన్ ముట్టడి.. నవంబర్ 1న ఛలో ఢిల్లీ
- గాంధీభవన్‌లో వివిధ పార్టీల నేతల సమావేశం

2

# నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదు..
- పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక్కో అభ్యర్థికి రూ.40 వేల విలువైన ఆన్‌లైన్ కోచింగ్ ఉచితం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 03: నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఒక్కో అభ్యర్థికి సుమారు రూ.40 వేల విలువైన ఆన్‌లైన్ కోచింగ్ యాక్సెస్‌ను ఉచితంగా పి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తామని నిరుద్యోగ యువతకు హామీ ఇచ్చారు.

**అడిగిందే తడవుగా..**

ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే ప్రతిభ, పట్టుదల ఉన్నప్పటికీ కోచింగ్, హాస్టల్ ఖర్చులు భరించే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నాం.

కోచింగ్ ఫీజులు, హాస్టల్ ఖర్చులు భరించలేక నాణ్యమైన కోచింగ్‌కు దూరమవుతున్నామని తమ గ్రామాలు, పట్టణాల్లోనే ఉంటూ ప్రముఖ కోచింగ్ సంస్థల నుచి శిక్షణ పొందే అవకాశం కల్పించాలని నిరుద్యోగ జేఏసీ నాయకులు శనివారం నాడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు.

వారి విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రతిభ ఉన్న యువత ఆర్థిక పరిస్థితుల కారణంగా వెనుకబడకూడదనే ఉద్దేశంతో ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు సిద్ధమని ప్రకటించారు.

**రూ.40 వేల విలువైన కోచింగ్.. ఉచితంగా అందుబాటులోకి**

ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థుల్లో మం చి ఆదరణ ఉన్న ఆర్.సి. ఎగ్జామ్స్ కోచింగ్ సంస్థకు చెందిన ఆన్‌లైన్ క్లాసులు, మాక్ టెస్టుల యాక్సె స్‌ను పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచి తంగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కార్యా చరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల28 నుంచి ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసు కువచ్చే దిశగా చర్యలు చేపడతామని వెల్లడించారు.

**ఖమ్మం నుంచి రాష్ట్రవ్యాప్తంగా..**

ఇప్పటికే పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మంలో అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలనే నిరుద్యోగ యువత విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఆన్లైన్ కోర్స్‌లో భాగంగా ఎస్ ఐ, కానిస్టేబుల్, గ్రూప్ 1 ప్రిలిమ్స్, గ్రూప్ 2,3,4, పంచాయతీ సెక్రటరీ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, రైల్వే, ఇతర అన్ని పోటీ పరీక్షలకు జనరల్ స్టడీస్ పేపర్, ప్రాక్టీస్ టెస్టులు అందుబాటులో ఉంటాయి. ఒక సారీ రిజిస్టర్ అయినవారికి సుమారు 5 వేలకు పైగా వీడియో క్లాసులు తెలుగు, ఇంగ్లీష్ మీడియం లో 1సంవత్సరం పాటు అందుబాటులో ఉండే విధంగా డిజిటల్ వేదిక రూపకల్పన. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేసే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి, అవసరమైన కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

**మంత్రి పొంగులేటికి నిరుద్యోగ జేఏసీ కృతజ్ఞతలు**

తమ విజ్ఞప్తిపై వెంటనే స్పందించి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు ముందుకొచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి నిరుద్యోగ జేఏసీ నాయకులు వంశీ, చెర్రీ ప్రవీణ్, తేజావత్ ప్రవీణ్, శిరీష కృతజ్ఞతలు తెలిపారు.

# అంత్యక్రియల ప్రయాణంలో అంతులేని విషాదం

(మొదటిపేజీ తరువాయి..)

సంఘటన స్థలానికి పరిస్థితిని సమీక్షించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ప్రైవేట్ బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స కోసం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సరియైన వసతులు లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం క్షేత్రగాత్రులను నగరంలోని పెద్ద ఆసుపత్రులకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. విషయం తెలుసుకున్న పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యం లోపం వలన బస్సు ప్రమాదం జరిగిందని ఈ ప్రమాదంలో మృతి చెందిన వారికి ట్రావెల్ తరఫున 25 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున 20 లక్షలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున ఎక్స్గ్రేషియా చెల్లించాలని కోరారు. అలాగే చనిపోయిన వారికి గాయపడిన వారికి కేంద్ర ప్రభుత్వం చేయూతనిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతగిరి హిల్స్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం పట్ల సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా మీడియాకు తెలియజేశారు. ప్రమాదం డ్రైవర్ తప్పిదం వల్ల జరిగిందా లేక బ్రేక్ లేమన్న ఫెయిల్ అయి ఉండవచ్చునా విషయమై దర్యాప్తు చేస్తామని అన్నారు. ప్రజల ప్రాణాలు ముఖ్యంగా భావించి వెంటనే సహాయక చర్యలు చేపట్టమని వారందరికీ మెరుగైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలియజేశారు. వికారాబాద్ ఆర్డిఓ వాస్తు చంద్ర ఆధ్వర్యంలో రెవిన్యూ రిస్కుటింగ్ సహాయక చర్యలు చేపట్టింది. విషయం తెలిసిన వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారాసింగ్ తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని క్షేత్రగాత్రులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం బస్సు దుర్ఘటనలో మృతి చెందిన గాయపడిన వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఆటో కార్మికుల సంక్షేమానికి త్వరలో బోర్డు

(మొదటిపేజీ తరువాయి..)

**డీజిల్ ఆటోలకు బదులు బ్యాటరీ ఆటోలు**

హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. నగరంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ వంటి నగరాల్లో కాలుష్యం కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. డీజిల్ ఆటోలను బ్యాటరీ ఆటోలుగా మార్చేందుకు 'రాజీవ్ యువ వికాసం' కార్యక్రమం కింద రూ.200 కోట్లను కేటాయించామని తెలిపారు. ఒక్కో ఆటోకు ప్రభుత్వం తరఫున రూ.1.50 లక్షల సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో సోలార్, బ్యాటరీ, సీఎన్జీ ఆటోలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో మానవతా దృక్పథంతో ముందుకు సాగుతున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను భట్టి విక్రమార్క అభినందించారు.

## 22-ఎ సమస్యల పరిష్కారంలో మరో కీలక అడుగు

**హైదరాబాద్ వెలుతురు, అక్టోబర్ 03** కొన్ని దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

వ్యవసాయ భూములుగా ఉన్న పట్టా భూములు అనంతరం నివాస వినియోగంలోకి వచ్చినప్పటికీ నాలా ప్రక్రియ పూర్తికాక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ శనివారం మెమో జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మెమో నంబర్ 48062/యూఎల్సీ/ఏ1/2026 ద్వారా జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నాలా ప్రక్రియ పూర్తికాకపోవడం వల్ల రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూమిగానే ఉండి, 22-ఎలో ఉన్న నివాస పట్టా భూముల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయా దరఖాస్తులను రెవెన్యూ రికార్డులు, భూమి హక్కులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం నాలా రుసుము, ఇతర ప్రభుత్వ రుసుములను వసూలు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

**రెవెన్యూ అధికారులతో సమీక్ష**

ప్రజలు తమ భూముల రిజిస్ట్రేషన్ల కోసం కార్యాల యాల చుట్టూ తిరగకుండా పారదర్శకంగా, కాలపరిమితిలో ప్రక్రియ పూర్తి చేయాలని, అర్హత ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి ప్రభుత్వానికి అమలు పురోగతిపై నివేదిక సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. ఏళ్ల తరబడి తమ సొంత ప్లాట్లను విక్రయించుకోలేక, రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఈ నిర్ణయం వల్ల ఉపశమనం లభిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. శనివారం రెవెన్యూ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, 22-ఎ సమస్యల పరిష్కారం కోసం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యే విధంగా నిరంతరం మానిటరింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఈవీఎంలపై ఆరోపణలు చేస్తే.. బ్యాలెట్‌తో ఎన్నికలకు సిద్ధమా?

- కాంగ్రెస్ సీఎంలారా.. రాజీనామా చేసి రండి
- కేరళ, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌లో గెలిచింది ఈవీఎంలతో కాదా
- జ్ఞానేశ్ కుమార్‌కు, బీజేపీకి ఏం సంబంధం
- సీఈసీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ
- ఇండీ కూటమికి జనాదరణ లేదు
- మచ్చార్ ధైర్య సాహసాలపై స్పందించని వాళ్లంతా దేశద్రోహులే

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 3: ఈవీఎంలు, కేంద్ర ఎన్నికల సంఘంపై పదేపదే ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. "ఈవీఎంల వల్లే కాంగ్రెస్ పార్టీ కేరళ, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో గెలిచింది కదా మరి ఆ నాలుగు రాష్ట్రాల సీఎంలు రాజీనామా చేసి, కాంగ్రెస్ ప్రభుత్వాలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్లతో మళ్లీ ఎన్నికలకు వెళ్లేం దుకు సిద్ధమా పదేపదే ఈవీఎంలు, సర్ గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు దమ్ముంటే నా సవా ల్‌ను స్వీకరించాలి" అని అన్నారు. శుక్రవారం సా యంత్రం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాల యానికి వచ్చిన బండి సంజయ్ కుమార్.. బీజేపీ నేతలు డాక్టర్ మనోహర్ రెడ్డి, సంగప్ప, శ్రీవర్ధన్ రెడ్డి తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

**ఆలయాలపై దాడులు హేయం**

దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషీమాత ఆలయంలో దాడి హేయమని అన్నారు. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే ఇలాంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. ప్రజలు ప్రశ్నిస్తే దాడి చేసిన వ్యక్తిని పిచ్చివాడిగా చిత్రీకరించడం ప్రభుత్వానికి అలవా టైందని విమర్శించారు. పిచ్చివాడికి మందిరం, మసీదు అనే తేడా తెలియదని, కానీ మందిరాలపైనే ఎందుకు దాడులు జరుగుతున్నాయని ప్రశ్నించారు.

హిందువులు ధీటుగా స్పందించకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం పద్ధతి మార్చుకుని దాడులకు పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే యువత రోడ్లపైకి వచ్చి తిరగబడితే వారిని ఆపే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. ఆలయాలపై దాడుల ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**సీఈసీకి, బీజేపీకి సంబంధమేంటి**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు, బీజేపీకి ఏం సంబంధమని బండి సంజయ్ ప్రశ్నించారు. ఆయన ఎన్డీఏ మంత్రి కాదని, సీఈసీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ అని అన్నారు. ఇండీ కూటమికి జనాదరణ లేదని, వారి ఆందోళన కార్యక్రమాలకు పది మంది కూడా రావడం లేదని వ్యాఖ్యానించారు. ముంబై, ఢిల్లీలో జరిగిన ఆందోళనలకు జనం పెద్దగా రాకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు.

సర్ ప్రక్రియలో భాగంగా సీపీఎం దొంగ ఓట్లను తొలగించడం వల్లే కేరళలో అధికారంలోకి వచ్చామని కాంగ్రెస్ నేత రమేశ్ చెన్నితల చెప్పారని గుర్తు చేశారు. దీనిపై కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**బ్యాలెట్‌తో ఎన్నికలకు రండి**

ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నేతలకు సవాల్ విసురుతున్నానని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలతో రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికలకు రావాలని, బ్యాలెట్ పేపర్లతో ఎన్నికల్లో పోటీ చేద్దామని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెస్ విచారణ జరిపి చర్యలు తీసుకోవడం లేదని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుపై బీఆర్ఎస్ పోరాడటం లేదని ఆరోపించారు. కాంగ్రెస్‌కు నిజాయితీ ఉంటే బీఆర్ఎస్ నేతల అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ఎందుకు ఉద్యమాలు చేయడం లేదన్నారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐకి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబానికి పూర్వమే చింతమడకలో వందల ఎకరాల భూములు ఉన్నాయనడం పెద్ద జోక్ అని అన్నారు. ఆనాడు హైదరాబాద్‌లో అసలు ఇల్లు కూడా లేదని, అధికారంలోకి వచ్చాక ఇన్ని హోటళ్లు, ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు: సంజయ్**

టీచర్లు, గ్రాడ్యుయేట్లు, నిరుద్యోగ యువత అంతా బీజేపీ పక్షాన ఉన్నారని బండి సంజయ్ అన్నారు. గతంలో రెండు ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. గ్రౌండ్ వర్క్ ప్రారంభించామని, ప్రజల్లో బీజేపీకి సానుకూలత ఉందని తెలిపారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లోనూ బీజేపీ గెలుపు తథ్యమని అన్నారు.

**మచ్చార్‌పై స్పందించని వారంతా దేశద్రోహులే**

కెప్టెన్ స్మిత్ మచ్చార్ ధైర్య సాహసాలను ప్రపంచమంతా కొనియాడుతోందని బండి సంజయ్ అన్నారు. ప్రధాని మోదీ నేరుగా వీడియో కాల్ చేసి మచ్చార్‌తో మాట్లాడి అభినందించారని తెలిపారు. రాహుల్ గాంధీకి కనీసం ట్వీట్ చేసే సమయం కూడా లేదా అని ప్రశ్నించారు. మచ్చార్ ధైర్య సాహసాలు తెలిసినా స్పందించని వారంతా తన దృష్టిలో దేశద్రోహులు, దిమాగీ నక్సల్స్ అని వ్యాఖ్యానించారు. మచ్చార్‌ను హత్య చేసేందుకు యత్నించిన కో-పైలట్ సామాజికవర్గానికి చెందిన వారు ఇక్కడ ఉన్నారని అన్నారు. మచ్చార్‌ను అభినందిస్తే ఆ ఓట్లు ఎక్కడ పోతాయోననే భయంతోనే రాహుల్ గాంధీ స్పందించడం లేదని ఆరోపించారు.

**అమిత్ షా పర్యటన వాయిదా..**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం రాత్రి తెలంగాణకు రావాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల ఆయన పర్యటన వాయిదా పడిందని బండి సంజయ్ తెలిపారు.

# అక్టోబర్ వానలపై ఆశలు..!

(మొదటిపేజీ తరువాయి..)

చర్యలపై దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వ్యవసాయం, తాగునీరు, నీటిపారుదల రంగాలపై పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఎల్‌నినో ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ జూలైలో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. రైతుల జీవనోపాధిని కాపాడటం, వ్యవసాయ నష్టాలను తగ్గించడం, తాగునీరు-పశుగ్రాస భద్రత కల్పించడం, అవసరమైన చోట వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించడం వంటి చర్యలను కమిటీ సూచించింది. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగునీటి విధానాలను ప్రోత్సహించడం, కరువు పరిస్థితులను తట్టుకునే పంటలను ప్రోత్సహించడం, శాఖల మధ్య సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టడం వంటి సూచనలు చేసింది. మొత్తం ప్రతిపాదిత కంటింజెన్సీ చర్యలకు సుమారు రూ.802.92 కోట్ల అవసరం ఉంటుందని కమిటీ పేర్కొంది.

**కేంద్ర సాయం వైపు రాష్ట్రం**

వర్షపాతం లోటు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన నష్టాలను అంచనా వేసి కేంద్ర ప్రభుత్వాన్ని సాయం కోరే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అక్టోబర్ 1న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై సూత్రప్రాయ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నష్టాలను అంచనా వేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దీంతో ఇప్పుడు నష్టాల వాస్తవ అంచనా కీలకంగా మారింది. జిల్లాల వారీగా పంటల పరిస్థితి, నీటి వనరుల నిల్వలు, తాగునీటి అవసరాలు, వ్యవసాయంపై ప్రభావం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని నివేదిక సిద్ధం చేసే అవకాశం ఉంది.

**వర్షం వస్తే.. లోటు పూడుతుందా..**

ప్రస్తుతం తెలంగాణ పరిస్థితిని చూస్తే.. ఒకవైపు నైరుతి సీజన్‌లో వర్షపాతం లోటు, మరోవైపు అక్టోబర్‌లో వర్షాల సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో రానున్న రోజుల్లో వాతావరణం కీలకంగా మారనుంది. ఐఎండీ సూచిస్తున్న అక్టోబర్ 6, 7 తేదీల వర్షాలు విస్తృతంగా కురిస్తే నేలలో తేమ పెరగడం, కొన్ని నీటి వనరుల్లో నిల్వలు మెరుగుపడటం, రబీ సాగుకు కొంత ఊరట లభించే అవకాశం ఉంది. కానీ ఆ వర్షాలు పరి మిత ప్రాంతాలకే పరిమితమైతే రాష్ట్రవ్యాప్తంగా ఏర్పడిన లోటును పూడ్చడం కష్టమే. అందుకే ఇప్పుడు తెలంగాణ చూపంతా ఆకాశంపైనే. ఎల్‌నినో ప్రభావం కొనసాగుతున్న వేళ.. ఐఎండీ సూచిస్తున్న వర్షాలు ఎంత విస్తృతంగా కురుస్తాయి నైరుతి సీజన్‌లో ఏర్పడిన లోటులో ఎంత భాగం పూడుతుంది రబీ సాగుకు అవి ఎంతవరకు ఊతమిస్తాయి అన్న ప్రశ్నలకు రాబోయే వర్షాలే సమాధానం చెప్పనున్నాయి.

# ఓటర్ల జాబితాలో అక్రమాలపై ఇండియా కూటమి పోరుబాట

- అక్టోబర్ 6న జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు
- 8న లోక్‌భవన్ ముట్టడి.. నవంబర్ 1న ఛలో ఢిల్లీ
- గాంధీభవన్‌లో వివిధ పార్టీల నేతల సమావేశం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 3 ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హత కలిగిన లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటోందని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వ్యవహారంపై ఇండియా కూటమి తీవ్రంగా ఖండిస్తోందని, ఆయనను పదవి నుంచి తొలగించడంతో పాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం గాంధీభవన్‌లో ఇండియా కూటమి పార్టీల నేతల సమావేశం జరిగింది.

ఓటర్ల జాబితాలో జరుగుతున్న పరిణామాలపై కూటమి ఆధ్వర్యంలో వరుస ఆందోళనలు చేపట్టను న్నట్లు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. అక్టోబర్ 6న అన్ని కూటమి పార్టీల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపడతామని చెప్పారు. అక్టోబర్ 8న లోక్‌భవన్ ముట్టడి, నవంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు.

**ఓట్ల తొలగింపుపై తీవ్ర ఆరోపణలు..**

ఎన్నికల సంఘం పేరుతో నిజమైన ఓట్లను తొలగిస్తు న్నారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని లోబర్చుకుని బీజేపీ చేయకూడని పనులన్నీ చేస్తోందని విమర్శించారు. ఈ కారణం గానే బెంగాల్‌లో మమతా బెనర్జీ ఓడిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రధాన కమిష నర్ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించడమే కాకుండా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఫారం-6 ద్వారా ఓటర్లను చేర్చుకునేందుకు నిబంధనల పేరుతో ఇబ్బందులు కల్పిస్తున్నారని అన్నారు. కొన్ని ఫిర్యాదుల ఆధారంగా ఓట్లను తొలగిస్తున్నారని, తొల గించిన ఓట్లలో అర్హులైన వారిని తిరిగి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో ప్రధాన న్యాయమూర్తిని తొలగించి కేంద్ర హోంమంత్రిని చేర్చడాన్ని ఆయన వ్యతిరేకించారు. అక్టోబర్ 6న కలెక్టర్ కార్యాలయాల ముందు ఆందోళనలు, 8న లోక్‌భవన్ ముట్టడి, నవంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**బీఎల్‌ఓలపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణ**

టీజేఎస్ యువజన విభాగం అధ్యక్షుడు సలీం పాషా మాట్లాడుతూ గత 14 నెలలుగా ఎస్ఐఆర్ అమలు చేస్తున్నారని అన్నారు. గత కొన్నేళ్లుగా ఓటు వేస్తున్న వారిని కూడా ఓటు హక్కుకు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలు వేలాది దరఖాస్తులు నింపి ఇస్తున్నారని, ఒక సమూహం ఓట్లను తొలగించాలం టూ బీఎల్‌ఓలపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు.

ఇండియా కూటమి సమావేశంలో నిర్ణయించిన మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని, రాష్ట్రంలో 90 లక్షలకు పైగా ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని సలీం పాషా ఆరోపించారు.

**ప్రజాస్వామ్యానికి ముప్పు..**

సీపీఐ నేత ఈటీ నర్సింహ మాట్లాడుతూ ఇండియా కూటమి తీసుకున్న నిర్ణయం మేరకు సమావేశమయ్యామని తెలిపారు. దేశంలోని ప్రజాస్వామ్యవాదులంతా ఓటర్ల జాబితాలో జరుగుతున్న పరిణామాలపై ఆలోచించాలని కోరారు. సీఈసీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మోదీకి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేస్తున్న వారిని గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. తల్లిదం డ్రుల వయసు సరిపోలడం లేదంటూ నోటీసులు వచ్చిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు బీజేపీ విధానాలను అర్థం చేసుకుని తమ నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా చాన్స్ ఇవ్వండి

**టీపీసీసీ చీఫ్‌కు ఇందిరాశోభన్ వినతి**

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 03:** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పించాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను ఆ పార్టీ సీనియర్ నాయకురాలు ఇందిరాశోభన్ కోరారు. ఈ మేరకు గాంధీభవన్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ పదవికి తనకు ఉన్న అర్హతలను, పార్టీకి చేసిన సేవలను ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ దృష్టికి ఆమె తీసుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘకాలం పాటు ప్రతిపక్ష పాత్రకే పరిమితమైన కష్టకాలంలో తన గొంతుకను బలంగా వినిపించానన్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా దశాబ్ద కాలంగా పార్టీకి నిస్వార్థంగా సేవలందించిన నాయకులలో తాను ముందు వరుసలో ఉంటానని, తన విధేయతను, కృషినే ఇప్పుడు ప్రధాన అర్హతగా పరిగణించాలని ఇందిరాశోభన్ కోరారు. అధిష్టానం తనకు అప్పగించిన ఏ పనినైనా బాధ్యాతాయుతంగా నిర్వర్తించానని ఆమె తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ పార్టీ చేసిన అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో తాను క్రియాశీలకంగా వ్యవహరించానని, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రత్యక్ష పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నానని ఇందిరాశోభన్ తెలిపారు. అనేకమార్లు అరెస్టులు, పోలీసు కేసులను, నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా ప్రజా పక్షాన నిలబడ్డానన్నారు. అంతేకాకుండా, కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా నిత్యం ప్రధాన వార్తా ఛానెళ్లలో జరిగే టీవీ డిబేట్లలో పాల్గొని అధికార పక్షాన్ని నిలదీశానని, ఇప్పటికీ తమ పార్టీ వాదనను బలంగా వినిపిస్తున్నానన్నారు. సోషల్ మీడియా వేదికగా కూడా కాంగ్రెస్ విధానాలను యావత్ ప్రపంచానికి తెలియజేయడంలో తన వంతు పాత్రను సమర్థవంతంగా పోషిస్తున్నానని ఇందిరాశోభన్ ఆ లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు దిశా ఉద్యమం, ఆర్టీసీ ఉద్యోగుల హక్కులు, మద్యపాన వ్యతిరేక ఉద్యమంలో తాను చురుగ్గా పాల్గొనాన్నని ఇందిరాశోభన్ తెలిపారు. మహిళల హక్కులు, సామాజిక న్యాయం, వెనుకబడిన తరగతులు, దళితులకు సంబంధించిన పలు ఉద్యమాల్లో కూడా నా ప్రజా, రాజకీయ కార్యకలాపాలు ఇమిడి ఉన్నాయని ఆమె చెప్పారు. అంతేకాదు.. ఉన్నత విద్యావంతురాలినై తనకు శాసనమండలిలో అవకాశం కల్పిస్తే.. ప్రజాసేవ చేసేందుకు మరింతగా వీలు కలుగుతుందన్నారు. సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ ప్రధాన సిద్ధాంతమని, దానికి ప్రతీకగా తనకు ఈ సారి తప్పకుండా ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని ఇందిరాశోభన్ కోరారు. తాను అదే వర్గాలకు చెందిన మహిళనని, అణగారిన వర్గాల గొంతుకను చట్టసభలలో మరింత బలంగా వినిపించేందుకు తనకు ఈ పదవి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె పీసీసీ అధ్యక్షులకు వివరించారు. చట్టసభలలో మహిళలకు, అందులోనూ బలహీన వర్గాలకు చెందిన వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా కాంగ్రెస్ ఈ సమాజానికి ఒక స్పష్టమైన, సానుకూల సందేశాన్ని ఇచ్చినట్లు అవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. తన వినతి పట్ల పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించినట్లు ఇందిరాశోభన్ తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానం ఎప్పుడూ కష్టపడే నాయకులను విస్మరించదని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన తనలాంటి వారికి తగిన గుర్తింపు కచ్చితంగా దక్కుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

## అన్యాక్రాంతమైన
# ప్రభుత్వ భూమి పునరుద్ధరణ

**సిద్దిపేట, వెలుతురు అక్టోబర్ 03 :** సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని కాపాడి, తిరిగి స్వాధీనం చేసుకున్న కొండపాక తహసీల్దార్ కి గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కొండపాక మండల కేంద్రంలోని సర్వే నెంబర్లు 731, 733 లలో ఉన్న 2 ఎకరాల 18 గుంటల ప్రభుత్వ భూమి గతంలో కొంతమంది రాజకీయ అండదండలతో కబ్జాకు గురైంది. ఈ భూమిని గ్రామాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఉపయోగపడేలా మార్చేందుకు గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో చదును చేసే పనులు ప్రారంభించగా, కొందరు వ్యక్తులు ఆ పనులను అడ్డుకున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు వెంటనే తహసీల్దార్ కి ఫిర్యాదు చేయగా, ఆయన త్వరితగతిన స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. సదరు స్థలాన్ని ప్రభుత్వ భూమిగా నిర్ధారించి, అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించడానికి లేదా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు అని గట్టిగా హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తిని కాపాడి గ్రామాభివృద్ధికి సహకరించిన తహసీల్దార్ సమయస్ఫూర్తికి, తక్షణ చర్యలకు కొండపాక గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

## విల్లెత్తిన తెలంగాణ బిడ్డ..
# స్వర్ణాలు కొల్లగొట్టింది!

- ఒకేరోజు రెండు పసిడి పతకాలు.. దేశం గర్వించేలా చేసిన చికిత
- గల్లీ నుంచి అంతర్జాతీయ వేదిక దాకా.. తండ్రి ప్రోత్సాహంతో సాగిన ప్రస్థానం
- గడ్డివాముపైనే గురి.. రూ.3.5 లక్షల అప్పుతో కొన్న విల్లు
- ఆర్చరీలో అంచెలంచెలుగా ఎదిగి.. ప్రపంచ యూత్ ఛాంపియన్‌గా రికార్డు
- ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం.. లక్ష్యాన్ని ఛేదిస్తున్న తెలంగాణ అమ్మాయి

**పెద్దపల్లి, వెలుతురు అక్టోబర్ 03 :** ఆటల్లో అమ్మాయిల ప్రాతినిధ్యం పెరుగుతోంది. అందుకు అంతర్జాతీయ అర్చరీ పోటీల్లో రాణిస్తున్న చికిత తానిపర్తి నిదర్శనం. తండ్రి ప్రోత్సాహంతో ఆర్చరీలో ఓనమాలు నేర్చుకుంది. మొక్కవోని దీక్ష, ఏకాగ్రతతో అనతికాలంలోనే విలువిద్యలో ఉత్తమ క్రీడాకారిణిగా ఎదిగింది. ఫలితంగా 2026 ఆసియా క్రీడల్లో విల్లు ఎక్కుపెట్టి బాణాలు సంధించి ఒకేరోజు దేశానికి రెండు స్వర్ణపతకాలు సాధించింది పెట్టింది. దీంతో ఈ యంగ్ ప్లేయర్ పేరు ఇప్పుడు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది.

**గల్లీ నుంచి ఢిల్లీలో శిక్షణ పొందింది**

చికితాది పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్. తండ్రి శ్రీనివాసరావు. తల్లి శ్రీలత. శ్రీనివాసరావుకి మందు నుంచే ఆటలంటే మహాఇష్టం. జాతీయ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉండేది. కొన్ని పరిస్థితుల కారణంగా ఆ కల నేరవేరలేదు. ఐతే కుమార్తె ద్వారా ఆ కల నెరవేర్చుకోవాలనేది అతని ఆకాంక్ష. అందుకు తగ్గట్టుగానే చిన్ననాటి నుంచే చికితారావుని క్రీడలవైపు ప్రోత్సహించారు. మొదట కరాటే సహా ఇతర క్రీడాలపై దృష్టి సారించింది చికిత. కరాటేలో బ్లాక్‌బెల్ట్ కూడా అందుకుంది. ఆ తర్వాత విలువిద్యపై ఆసక్తి పెంచుకుంది. 8వ తరగతిలో ఉన్నప్పుడు కరీంనగర్‌లోని ఓ కోచ్ దగ్గర ఆర్చరీలో శిక్షణకు చేర్పించారు తండ్రి. అలా చికిత అర్చరీ క్రీడా ప్రయాణానికి పునాది పడింది. అక్కడ ఆర్చరీలోని ప్రాథమిక మెళకువలు నేర్చుకుంది. ఆ తర్వాత ఢిల్లీలో ఉండే కోచ్ అభిషేక్ వర్మ గురించి తెలుసుకుని మెరుగైన శిక్షణ కోసం అక్కడికి వెళ్లి 2 వారాల పాటు తర్ఫీదు పొందింది.

**యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా**

అనతికాలంలోనే అర్చరీలోని నైపుణ్యాలు నేర్చుకుని జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆకట్టుకుంది. ఇంటర్‌లో ఉన్నప్పుడే రాష్ట్రస్థాయిలో సబ్-జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో సత్తాచాటింది. రెండేళ్లలోనే జాతీయ స్థాయికి చేరుకుంది. జాతీయ సబ్ జూనియర్ ఆర్చరీలో వ్యక్తిగత విభాగంలో రజతం, మిక్స్‌డ్ టీమ్‌లో కాంస్యం సహా అనేక పతకాలు సొంత చేసుకుంది. 2021లో హరియాణా, సోనేపత్‌లోని స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా-శాయ్ కేంద్రంలో శిక్షణకు ఎంపికై మరింత రాటుదేలింది. ప్రపంచ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడమే కాకుండా ఈ ఘనత సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది.

**లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ 2028కు అర్హత**

ఇక ఆసియా గేమ్స్‌లో ఒకే రోజు 2 పసిడి పతకాలు సాధించడంతో ఈ యువ క్రీడాకారిణి పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. మహిళల కాంపౌండ్ ఆర్చరీ ఫైనల్లో జ్యోతి సురేఖ, ప్రీతికా ప్రదీప్‌తో కలిసి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. ఆ తర్వాత మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీ టీమ్ ఈవెంట్‌లో సాహిల్ రాజేశ్ జాదవ్ కలిసి మరో స్వర్ణం సాధించింది. ఈ విజయంతో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ 2028కు అర్హత సాధించినట్లు చెబుతోందీ యువ సంచలనం.

**ఒలింపిక్స్‌లో పతకం సాధించమే లక్ష్యం**

ఆసియా క్రీడల్లో కుమార్తె రెండు బంగారు పతకాలు సాధించడంపై చికితారావు తల్లింద్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రోత్సహంతో పాటు చికిత పట్టుదలే స్వర్ణపతకాలు సాధించేలా చేసిందని అంటున్నారు. ఇప్పుడు చెప్పుకున్నంత సులువుగా చికిత క్రీడాప్రయాణం ఏమీ ముందుకు సాగలేదు. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ అప్పుచేసి మరి 3.5 లక్షలతో బో కొన్నారు శ్రీనివాసరావు. గడ్డివాము పైనే టార్గెట్ బోర్డ్ ఏర్పాటు చేశారు. అలా ప్రాక్టీసు చేసిన ఈ టాలెంటెడ్ యంగ్ ప్లేయర్ విల్లు చేతపట్టి లక్ష్యానికి ఎక్కుపెట్టింది. ఫలితంగా ఆసియా గేమ్స్ ఒకేరోజు 2 బంగారు పతకాలు సాధించి దేశం గర్వించేలా చేసింది. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న చికిత క్రీడా కథలో తండ్రి ఆశయం, కుమార్తె సంకల్పం.. రెండు ఉన్నాయి. క్రీడల్లోకి రావాలి లేదా పిల్లలను ప్రోత్సహించాలి అనుకునేవారిని ఆలోచింపజేసే మరో స్ఫూర్తిదాయక స్టోరీ ఇది.

# రైతు సంక్షేమం-తెలంగాణ అభివృద్ధికి ప్రాధాన్యం

- సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం
- డా. రేఖ బోయలపల్లి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 03:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమం, ఉద్యోగుల ప్రయోజనాలు, రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి అన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని తీసుకున్న నిర్ణయాన్ని ఆమె స్వాగతించారు. సుమారు 65 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు అవసరమవుతుందన్న అంచనాకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టడం రైతులకు భరోసా కల్పించే చర్య అని పేర్కొన్నారు. వర్షాభావంతో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులను సమీక్షించి, కేంద్ర సహాయం కోరాలని నిర్ణయించడం సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతాయుతమైన నాయకత్వానికి నిదర్శనమన్నారు. రైతు సంఘాలు, నిపుణులు, అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకోవాలన్న నిర్ణయం ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోందని అన్నారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సౌర, పవన విద్యుత్, బ్యాటరీ నిల్వ వ్యవస్థలకు ఆమోదం ఇవ్వడం రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడే నిర్ణయమని తెలిపారు. ఉద్యోగులకు రెండు పెండింగ్ డీఏల విడుదలకు ఆమోదం, కొహెడ సమీకృత పండ్ల మార్కెట్ పనులను వేగవంతం చేయాలన్న నిర్ణయాలను కూడా స్వాగతించారు. రైతుకు అండ, ఉద్యోగికి భరోసా, అభివృద్ధికి ప్రణాళిక అనే ప్రాధాన్యాలతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందని డా. రేఖ బోయలపల్లి పేర్కొన్నారు.

## అనంతగిరి ఘాట్ రోడ్డు
# ప్రమాదంపై సీపీఎం దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి
- క్షతగాత్రులకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 3 :** వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్ రోడ్డులో జరిగిన ప్రైవేటు బస్సు ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు మృతి చెందడం, మరో 15 మందికి పైగా తీవ్రంగా గాయపడటం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం కేసారం గ్రామానికి చెందిన వారు బంధువుల అంత్యక్రియలకు వెళుతుండగా ఈ దుర్ఘటన జరగడం బాధాకరమని పేర్కొంది. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారం అందించాలని కోరారు. తీవ్రంగా గాయపడిన వారికి కూడా అవసరమైన ఆర్థిక సహాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రవాణా, రోడ్ల భద్రతా అధికారులు చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతోపాటు రోడ్డుకిరువైపులా పటిష్టమైన రక్షణ గోడలు నిర్మించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్‌కు
# 2,000కుపైగా ఎంట్రీలు

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 03:** తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ -- సీజన్ 2కు విశేష స్పందన లభించింది. ఎంట్రీల సమర్పణకు విధించిన గడువు అక్టోబర్ 2తో ముగియగా.. ఫిలిం మేకర్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్ల నుంచి 2,000కుపైగా ఎంట్రీలు వచ్చాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో ఎంట్రీలు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు నేతృత్వంలోని యంగ్ ఫిలిం మేకర్స్ బృందాన్ని దిల్ రాజు అభినందించారు. తెలంగాణలోని యువతలో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసేందుకు బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్ వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. యువ ఫిలిం మేకర్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావడం ఈ కార్యక్రమానికి లభించిన ఆదరణకు నిదర్శనమన్నారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్త ఉద్యమం

- కులగణన చేపట్టి చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి
- మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 3:** బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించడంతో పాటు సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఓబీసీ ప్రజాప్రతినిధుల ఫోరం పిలుపు మేరకు హైదరాబాద్ గన్‌పార్క్ వద్ద బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం, బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం కన్వీనర్ చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఓ ప్రతులను చించివేసి నిరసన తెలిపారు. మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు గడిచినా బీసీలకు సామాజిక న్యాయం పూర్తిస్థాయిలో అందలేదన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో బీసీలు ఇప్పటికీ వెనుకబడి ఉన్నారని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే సరైన కులాల గణాంకాలు అవసరమని, సమగ్ర కులగణన లేకపోవడం వల్ల రిజర్వేషన్లకు న్యాయపరమైన సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. 1931లో బ్రిటిష్ ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టిందని, స్వాతంత్ర్యం అనంతరం బీసీల సమగ్ర కులగణనను నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ వర్గాలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా, కులవృత్తులకే పరిమితం చేసి రాజ్యాధికారంలో తగిన వాటా, విద్యా, ఉద్యోగాల్లో సముచిత రిజర్వేషన్లు కల్పించలేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీలకు కూడా సమగ్ర కులగణన చేపట్టాలని, కులగణనలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించినప్పుడే బీసీలకు నిజమైన న్యాయం జరుగుతుందని అన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమం కొనసాగుతోందని, అన్ని రాజకీయ పార్టీలు ఈ డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేందుకు పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ల బిల్లును తీసుకురావాలని, అవసరమైతే పార్లమెంటును స్తంభింపజేసి ఉద్యమించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటులో ప్రశ్నించడంతో పాటు మద్దతు ప్రకటించిందని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తుచేశారు. రాహుల్ గాంధీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ ముందుకు రావాలని అన్నారు. బీజేపీ కూడా సమగ్ర కులగణన చేపట్టి బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకుంటే బీసీలు వారికి మద్దతుగా నిలుస్తారని వి. శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు వట్టే జానయ్య యాదవ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ వైస్ చైర్మన్ ఎస్. దుర్గయ్య గౌడ్, రాష్ట్ర కన్వీనర్లు అయిలి వెంకన్న గౌడ్, ఎర్ర సత్యనారాయణ, బైర శేఖర్, అంబాల నారాయణ గౌడ్, బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షులు దామోదర్ గౌడ్, లింగేష్ యాదవ్, నీరజ గౌడ్, సుదర్శన్ నేత తదితరులు పాల్గొన్నారు.

# కాగితం ఉత్పత్తితో అడవులకు నష్టం లేదు

- తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా
- 'ఎఫ్‌పీటీఏ 65వ వార్షిక సర్వసభ్య సమావేశం, కాన్ఫరెన్స్ 2026' ప్రారంభం

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 3 :** కాగితం ఉత్పత్తితో అడవులకు నష్టం లేదు. కాగితం పరిశ్రమ సహజ అడవులను నాశనం చేయదని, అది గ్రామీణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని తెలంగాణ గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా స్పష్టం చేశారు. ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్స్ (ఎఫ్‌పీటీఏ), తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ (టీపీఎంఏ) ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని నోవాటెల్ హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన 'ఎఫ్‌పీటీఏ 65వ వార్షిక సర్వసభ్య సమావేశం, కాన్ఫరెన్స్ 2026'ను గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. ఈనెల 5వ తేదీ వరకు జరగనున్న ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా కాగిత వ్యాపారులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటలైజేషన్ పెరిగినా భౌతిక కాగితం లేని సమాజం అసాధ్యమన్నారు. జీఎస్టీ వ్యత్యాసాల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి కంటే నిర్మాణాత్మక ప్రాతినిధ్య విధానం మేలని సూచించారు. త్వరితగతిన పంట చేతికి వచ్చేలా ప్రత్యేకంగా సాగు చేసే పాప్లర్ వంటి వ్యవసాయ అటవీ వృక్షాల నుంచే ముడి కలపను సేకరిస్తారన్నారు. 'సేవ్ పేపర్, సేవ్ ట్రీస్' వంటి ప్రచార నినాదాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయన్నారు. కాగితపు ఉత్పత్తి సహజ అటవీ ఆవాసాలను నాశనం చేయదని, గ్రామీణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడుతుందనే వాస్తవాన్ని పరిశ్రమ వర్గాలు సమాజానికి తెలియజేయాలన్నారు. ప్రసార, డిజిటల్ మాధ్యమాలు త్వరగా మరుగునపడే లేదా మళ్లీ రీసైకిల్ అయ్యే వార్తలను అందిస్తుండగా, ముద్రిత దినపత్రికలు మాత్రమే రోజువారీ ఆలోచనలకు, ఏకాగ్రతతో కూడిన పఠనానికి, ప్రజా చర్చకు నమ్మకమైన, ప్రామాణికమైన మాధ్యమంగా నిలుస్తున్నాయని తెలిపారు. డిజిటలైజేషన్ వల్ల 'తక్కువ కాగితం' వాడే పరిస్థితి రావచ్చేమో గానీ, పూర్తిగా 'కాగితం లేని' సమాజం అసాధ్యం అన్నారు. ఎందుకంటే, చరిత్ర, సంస్కృతి, అధికారిక పరిపాలన, వినతులు ఎల్లప్పుడూ భౌతిక కాగితంపైనే ఆధారపడి ఉంటాయన్నారు. కాగితంపై 18 శాతం జీఎస్టీ, నోట్‌బుక్‌లపై 0 శాతం జీఎస్టీ వంటి పన్ను వ్యత్యాసాల పరిష్కారానికి పరిశ్రమ వర్గాలు ఆందోళనల కంటే నిర్మాణాత్మక ప్రాతినిధ్య విధానాన్ని ఎంచుకోవాల్నారు. సుమారు లక్ష కోట్ల పన్ను చెల్లించే రంగంగా, వాణిజ్య సంఘాలు రాష్ట్ర ప్రతినిధులకు, ఆర్థిక మంత్రికి, జీఎస్టీ కౌన్సిల్‌కు స్పష్టమైన, పద్ధతి ప్రకారమైన వినతిపత్రాలను సమర్పించాలన్నారు. సంప్రదింపుల ద్వారా రాష్ట్రాలలో పన్ను సమానత్వాన్ని సాధించాలన్నారు. వాణిజ్య ప్రయోజనాలకు అతీతంగా కాగితాన్ని వృథా చేయకుండా సంరక్షించడాన్ని యువతరానికి నేర్పేలా బాధ్యతాయుత ప్రచారం జరగాలన్నారు. బాల్యంలో పలకల నుంచి మొదలై సంక్లిష్టమైన విద్యా, మేధోపరమైన సాధనల వరకు అభ్యాసకులను నడిపిస్తూ అక్షరాస్యత, ప్రచురణ, సాంస్కృతిక కొనసాగింపునకు కాగితం ప్రాథమిక చోదక శక్తిగా కొనసాగుతుందన్నారు. ప్రాచీన తక్షశిల, నలంద వంటి విద్యా కేంద్రాల నాటి ప్రపంచ జ్ఞాన నాయకత్వ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ భారతదేశపు గొప్ప మేధో సంప్రదాయాన్ని కాగితం పరిరక్షిస్తోందన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచ అగ్రగామిగా ఎదిగే క్రమంలో కాగితపు పరిశ్రమ వాణిజ్యానికి, విద్యకు, జాతీయ ప్రతిష్టకు ఒక కీలకమైన చోదక యంత్రంగా పని చేస్తుందన్నారు.

## రేవంత్ రెడ్డి జీకు హటావో..

# బీసీకు బీటావ్.. రాహుల్ జీ!

మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

**సామాజిక న్యాయం, సమానత్వం, బహుజన రాజ్యాధికారం.. ఇవి భారత రాజకీయాల్లో తరచూ వినిపించే నినాదాలు. ఎన్నికలు సమీపించిన ప్రతిసారీ బీసీలు, ఎంబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీల అభ్యున్నతి, రాజకీయ ప్రాతినిధ్యం, అధికారంలో భాగస్వామ్యం కల్పిస్తామని పార్టీలు హామీలు ఇస్తుంటాయి. అయితే ఎన్నికలు ముగిసి అధికారం చేతికి వచ్చిన తర్వాత ఆ హామీల అమలులో జాప్యం, పదవుల పంపిణీలో సామాజిక అసమానతలు, సంక్షేమ పథకాల అమలులో సమస్యలు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలన దిశగా సాగుతున్న నేపథ్యంలో ఎన్నికల హామీలు, బీసీలకు ఇచ్చిన ప్రాతినిధ్యం, పేదల సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తుపై సమీక్ష అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.కామారెడ్డి వేదికగా ప్రకటించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ డిక్లరేషన్ ద్వారా సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.**

బీసీల జనాభాకు అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం, కులగణన, పాలనలో వెనుకబడిన వర్గాలకు భాగస్వామ్యం వంటి అంశాలను రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో ప్రస్తావించారు. అయితే జాతీయ స్థాయిలో సామాజిక న్యాయంపై వినిపిస్తున్న మాటలకు, తెలంగాణలో కాంగ్రెస్ అనుసరిస్తున్న రాజకీయ విధానాలకు మధ్య ఎంతవరకు అనుసంధానం ఉందన్న ప్రశ్న చర్చనీయాంశమవుతోంది. ముఖ్యంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థుల ఎంపికలో ఇద్దరు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులకు ప్రాధాన్యత కల్పించడంపై బీసీ సంఘాలు, సామాజిక న్యాయవాదులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మేధావుల సమస్యలను శాసనమండలిలో వినిపించే కీలక వేదికలు. ఇలాంటి స్థానాల్లో రాజకీయ అనుభవం, అర్హతలతో పాటు సామాజిక ప్రాతినిధ్యానికీ ప్రాధాన్యం ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. ఒకరిద్దరు బీసీ నాయకులకు పార్టీ పదవులు ఇవ్వడం, మొత్తం బీసీ సమాజానికి నిర్ణయాధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించడం ఒకటి కాదని బీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్ గౌడ్‌కు అవకాశం కల్పించిన అంశాన్ని ప్రస్తావిస్తున్నప్పటికీ, బీసీలకు అన్ని స్థాయుల్లో నాయకత్వ అవకాశాలు కల్పించే దీర్ఘకాలిక విధానం అవసరమనే వాదన వినిపిస్తోంది. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలకు కాలపరిమితితో కూడిన కార్యాచరణను ప్రకటించి, ఇప్పటివరకు అమలు చేసిన హామీలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఆరు గ్యారెంటీల అమలుపై ప్రశ్నలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధానంగా ప్రచారం చేసిన ఆరు గ్యారెంటీలు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి, పేదలకు గృహాలు, విద్యార్థులకు భరోసా వంటి అంశాల అమలుపైనా ప్రశ్నలు వస్తున్నాయి. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ప్రభుత్వం కొన్ని పథకాలను ప్రారంభించి, మరికొన్నింటిని అమలు చేస్తున్నప్పటికీ అన్ని హామీలు పూర్తిస్థాయిలో అమలయ్యాయా? అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందుతున్నాయా? అన్నదానిపై స్పష్టమైన వివరాలు అవసరం. ప్రచార కార్యక్రమాల కంటే హామీల అమలు స్థితిగతులపై పారదర్శక నివేదిక ప్రజలకు అందించడం ముఖ్యం. రైతు భరోసా పథకం అమలులో అర్హతలు, నిధుల విడుదల, లబ్ధిదారుల ఎంపికపై రైతులు స్పష్టత కోరుతున్నారు. సంపూర్ణ రుణమాఫీ అమలుపైనా రైతు సంఘాలు, ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. కౌలు రైతులకు ఎకరాకు సుమారు రూ.15 వేల సాయం, రైతు కూలీలకు వార్షిక ఆర్థిక సాయం వంటి హామీల అమలు స్థితిపైనా ప్రభుత్వం వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ హామీలను బడ్జెట్ ప్రకటనలతో కాకుండా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయిన నిధులు, పరిష్కరించిన సమస్యల ఆధారంగా అంచనా వేయాలన్న డిమాండ్ ఉంది.

**పేదలు, విద్యార్థుల పరిస్థితిపై దృష్టి**

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు, నిర్మాణ నిధుల విడుదల, పనుల పురోగతిపై పారదర్శకత అవసరం. మరోవైపు మూసీ ప్రక్షాళన, సుందరీకరణ, హైడ్రా చర్యల నేపథ్యంలో నివాసాలు కోల్పోతున్న పేద కుటుంబాల పునరావాసం, పరిహారం, చట్టబద్ధ హక్కులపై చర్చ కొనసాగుతోంది. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రభావిత కుటుంబాలకు ముందస్తు సమాచారం, న్యాయమైన పరిహారం, ప్రత్యామ్నాయ నివాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిల సమస్య అత్యంత కీలకంగా మారింది. రాష్ట్రంలో సుమారు 14 లక్షల మంది విద్యార్థులకు వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని విద్యార్థి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ గణాంకాలపై ప్రభుత్వం సమగ్ర వివరాలు వెల్లడించి, వాస్తవ బకాయిలు ఎంత, ఏ విద్యాసంస్థలకు ఎంత చెల్లించాల్సి ఉంది, ఎప్పటిలోగా చెల్లింపులు పూర్తవుతాయో ప్రకటించాలి. బకాయిల కారణంగా విద్యార్థులపై కళాశాలల ఒత్తిడి, సర్టిఫికెట్ల నిలిపివేత వంటి సమస్యలు తలెత్తితే పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఇబ్బందులు ఎదురవుతాయి. విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డులు, విద్యార్థినులకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు, పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి వంటి హామీల అమలుపైనా స్పష్టత రావాలి. ప్రభుత్వ పాఠశాలల విలీనం లేదా మూసివేతపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల పేద పిల్లలకు విద్యా అవకాశాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయుల నియామకం, తరగతి గదులు, డిజిటల్ సదుపాయాలు, నాణ్యమైన బోధన, పోషకాహారంపై దృష్టి పెట్టాలి. యువతకు ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ. 4 వేల భృతి వంటి హామీలపైనా స్పష్టత అవసరం. ఉద్యోగ నోటిఫికేషన్లు, పరీక్షలు, నియామకాలు కొనసాగుతున్నప్పటికీ ఖాళీల సంఖ్య, భర్తీ ప్రక్రియ దశలు, భవిష్యత్తు నియామకాల క్యాలెండర్‌ను ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రకటిస్తే నిరుద్యోగుల్లో అనిశ్చితి తగ్గుతుంది. నిరుద్యోగ భృతి హామీ అమలు స్థితినీ వెల్లడించాలి.

**సామాజిక న్యాయంపై కార్యాచరణ ఏది?**

కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ప్రకటిస్తున్న కులగణన, జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలు తెలంగాణలో రాజకీయ పదవుల పంపిణీ, సంక్షేమ విధానాలు, బడ్జెట్ కేటాయింపుల్లో ఎంతవరకు ప్రతిబింబిస్తున్నాయన్న ప్రశ్నలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలన్న డిమాండ్ ఉంది. బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగ, ఆర్థిక అవకాశాలపై ప్రభుత్వం తన విధానాన్ని ప్రజలకు వివరించాలి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల విమర్శలు, ప్రజా సంఘాల నిరసనలు, విద్యార్థుల ఆందోళనలు ప్రభుత్వానికి ప్రజల ఆకాంక్షలను తెలియజేసే ప్రక్రియలో భాగం. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం బీసీ సంఘాలు, హామీల అమలుపై రైతులు ప్రశ్నలు లేవనెత్తుతున్నప్పుడు వాటిని కేవలం రాజకీయ విమర్శలుగా కాకుండా వాస్తవ సమస్యలుగా పరిగణించి పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలను అధికారిక గణాంకాలు, అమలు నివేదికల ఆధారంగా పరిశీలించాలి. ఎన్నికల హామీలు రాజకీయ పార్టీలు ప్రజలకు ఇచ్చే వాగ్దానాలు. వాటి అమలును లబ్ధిదారుల సంఖ్య, ఖర్చు చేసిన నిధులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న హామీల ఆధారంగా అంచనా వేయాలి. ప్రభుత్వం ప్రతి హామీకి సంబంధించి అమలు స్థితి, నిధుల కేటాయింపు, పూర్తయ్యే గడువుతో కూడిన సమగ్ర నివేదిక విడుదల చేయాలి. ముఖ్యంగా బీసీ డిక్లరేషన్, ఆరు గ్యారెంటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు సంక్షేమం, తులం బంగారం, మహిళల ఆర్థిక సాధికారత, యువత ఉపాధి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. సామాజిక న్యాయం ఒక పార్టీకి మాత్రమే సంబంధించిన అంశం కాదు. రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వ సూత్రాలకు, ప్రజాస్వామ్య విలువలకు సంబంధించినది. బీసీలకు అధికారంలో వాటా కల్పించడం ఒకటి రెండు పదవులతో ముగిసే అంశం కాదు. పాలనలో భాగస్వామ్యం, వనరుల పంపిణీలో న్యాయం, విద్య, ఉపాధి అవకాశాల విస్తరణ, ఆర్థిక సాధికారతతో అది ముడిపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో బీసీలకు సమగ్ర సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, విద్యా, ఉద్యోగ, ఆర్థిక అవకాశాలు కల్పించడంలో విఫలమైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీసీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని నాయకత్వం అధికారంలో కొనసాగడం ఎంతవరకు సమంజసమో కాంగ్రెస్ అధిష్ఠానం ఆలోచించాలని వారు కోరుతున్నారు. రాహుల్ గాంధీ బీసీల ఆకాంక్షలను గుర్తించి, వారికి న్యాయం జరిగేలా చొరవ తీసుకోవాలని, బీసీల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని బీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

### సంక్షేమం, ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం?

**ఆసరా పింఛన్ల పెంపు, బీసీ బంధు, దళిత బంధు, ఇతర వర్గాలకు ప్రకటించిన ప్రోత్సాహకాలపై సమీక్ష అవసరం. గత ప్రభుత్వ హయాంలో అమలైన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, గురుకుల విద్యాసంస్థల నిర్వహణ వంటి పథకాల కొనసాగింపును కూడా రాజకీయాలకు అతీతంగా పరిశీలించాలి. ప్రభుత్వం మారినంత మాత్రాన ప్రజలకు ఉపయోగపడే పథకాలు నిర్లక్ష్యానికి గురికాకూడదు. పథకాల కొనసాగింపు, మార్పులు ప్రజలకు కలిగే ప్రయోజనం, ఆర్థిక సాధ్యత, అమలు సామర్థ్యాల ఆధారంగా ఉండాలి. సంక్షేమ పథకాల అమలుకు నిధుల కొరత ఉందని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా పారదర్శక చర్చ అవసరం. పన్నుల ఆదాయం, కేంద్ర నిధులు, భూముల విక్రయాల ఆదాయం, తీసుకున్న రుణాలు, ప్రభుత్వ వ్యయాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. రాష్ట్రానికి వచ్చిన ఆదాయం, అభివృద్ధి ప్రాజెక్టులకు చేసిన ఖర్చు, సంక్షేమానికి కేటాయించిన నిధులు, పెండింగ్ బకాయిలపై శ్వేతపత్రం విడుదల చేస్తే ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యతలపై స్పష్టత ఏర్పడుతుంది. ముఖ్యంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, పింఛన్లు, రైతు సంక్షేమానికి నిధుల కేటాయింపులో జాప్యానికి కారణాలు వెల్లడించాలి.**

---

### అంతరిక్ష రంగంలో

# యువత ప్రతిభ చాటాలి !

**ప్రపంచవ్యాప్తంగా 04 నుంచి 10 అక్టోబర్ వరకు "ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు" లేదా "వరల్డ్ స్పేస్ వీక్" వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్న శుభ సందర్భంగా ప్రపంచ మానవాళి, ముఖ్యంగా విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, యువతరం రేపటి అంతరిక్ష ఘన చరిత్రకు నేడు గట్టి పునాదులు వేయడానికి యువత పూనుకోవాలి. 04 అక్టోబర్ 1957 రోజున మానవ నిర్మిత తొలి ఉపగ్రహం 'స్పుత్నిక్-1' అంతరిక్ష కక్షలోకి ప్రవేశపెట్టబడింది. అదే విధంగా 10 అక్టోబర్ 1967 రోజున ఐరాస చొరవతో అంతరిక్ష పరిశోధనలతో శాంతి స్థాపనకు మాత్రమే కృషి చేయాలని తీర్మానం చేయడం జరిగింది.**

**(04 – 10 అక్టోబర్ "ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు" సందర్భంగా)**

ఈ రెండు చారిత్రాత్మక అంతరిక్ష ఘటనలకు గుర్తుగా 04 నుంచి 10 అక్టోబర్ వరకు ఈ వారోత్సవాలు పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా భారతదేశ వ్యాప్తంగా డాక్టర్ సచిన్ బాంబా నేతృత్వంలో విద్యాలయాల్లో యువతకు అంతరిక్ష శాస్త్రం పట్ల అవగాహన కలిపిస్తూ భవిష్యత్తులో వారు అంతరిక్ష రంగాన్ని కెరీర్‌గా తీసుకునే విధంగా ప్రేరణ కల్పించడానికి కృషి జరుగుతున్నది.

**ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు :**

ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల వేదికగా మన ఇస్రో సాధించిన ఘనకార్యాలను నేటి యువతకు వివరించడం, భారత అంతరిక్ష టెక్నాలజీలో వస్తున్న పెను ఆధుధునిక మార్పులను ఎక్కువుగా పెట్టడం, నేటి యువ తరాన్ని అంతరిక్ష రంగం వైపుకు ఆకర్షించడం, అంతరిక్ష రంగంలో వస్తున్న టెక్నాలజీ మార్పులను ఆసక్తికరంగా ప్రయోగ పూర్వకంగా వివరించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఉచితంగా ఉంటుంది. భారతీయ యువతను 'స్టెమ్' కోర్సుల వైపు ఆకర్షించడానికి "స్పేస్ ఆన్ వీల్స్", "స్పేస్ ట్యూటర్స్"లను వినియోగించడం, అంతరిక్ష ఆవిష్కరణ గూర్చి విడమర్చా తెలుపడం, జాతీయ అభివృద్ధితో పాటు సమైక్యతను సాధించడం, విద్యాలయాల్లో అంతరిక్ష అంశాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటివి నిర్వహించాలి.

**ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు–2026 ఇతివృత్తం:**

2026 ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ఇతివృత్తంగా "రాకెట్ ఉద్యమం (రాకెట్ రెవొల్యూషన్)" అనబడే అంశాన్ని తీసుకొని వివరించడం కొనసాగుతున్నది. సాంప్రదాయ ఖగోళ శాస్త్రంతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేస్తూ ముందుకు సాగడం ముఖ్యమని కూడా అవగాహన కల్పించడం జరుగుతోంది. అంతరిక్ష శాస్త్రం పట్ల యువత దృష్టిని ఆకర్షిస్తూ, వారిని అంతరిక్ష కోర్సుల వైపు మరల్చడం అనే ప్రధాన ఉద్దేశంతో పలు కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించడం నేటి అవస రంగా భావించాలి. ఇస్రో శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ప్లానిటోరి యం సందర్శనం, శాస్త్రజ్ఞులతో ప్రసంగాలు, అంతరిక్ష అంశాల్లో పోటీలు, శుభాంశ్ శుక్లా లాంటి వ్యోమగాములతో ప్రసంగాలు లాంటివని ఏర్పాటు చేయడం వల్ల మంచి ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయని నమ్మాలి. మన ప్రతిష్టాత్మక ఇస్రో విభాగం మన జాతి గౌరవవేతనం చిహ్నంగా ప్రస్తుతించాలి. భారత అంతరిక్ష పరిశోధనలతో మానవాళికి ఎనలేని ప్రయోజనాలు ఒనగూరుతాయని తెలుసుకోవాలి. కమ్యునికేషన్స్, వాతావరణ మార్పులు, విపత్తుల ముందస్తు అంచనాలు, టెలివిజన్ ప్రసారాలు, వ్యవసాయరంగ ప్రయోజనాలు, విపత్తు నివారణ చర్యలకు ఉపక్రమించడం, దేశ ఆర్థికాభివృద్ధి, జీవన ప్రమాణాలు పెరగడం, స్మార్ట్‌ఫోన్,/ఆన్‌లైన్ లాంటి అనువర్తనాలను కలిగిస్తున్న ఇస్రో సేవలకు కృతజ్ఞతలు తెలియజేద్దాం, అంతరిక్ష శాస్త్రవేత్తలకు సలాం కొడదాం.

– కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

---

### బీజేవైఎం జిల్లా

## అధికార ప్రతినిధిగా రాజేశ్వర్ రెడ్డి

**జనగామ జిల్లా వెలుతురు అక్టోబర్ 3:** జనగామ జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధిగా తౌటి రెడ్డి రాజేశ్వర్ రెడ్డిని నియమిస్తూ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు అల్లబోయిన హరీష్ నియామక పత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అందించినట్టి గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. బిజెపి సంస్థగత నిర్మాణంలో తన వంతు పాత్రను సహాయ శక్తుల నిర్వర్తిస్తానన్నారు. తన దృష్టికి వచ్చిన ఎలాంటి సమస్య పైన అయినా తప్పకుండా స్పందిస్తూ పార్టీ బలోపేతనికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన జనగామ జిల్లా బిజెపి అధ్యక్షులు సౌడ రమేష్, రాష్ట్ర బీజేవైఎం అధికార ప్రతినిధి సంతోష్ యాదవ్, బొజ్జపల్లి సుభాష్, రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ కో కన్వీనర్ దాస్యం అభినవ్ భాస్కర్, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, స్టేషన్ ఘన్పూర్ మండల అధ్యక్షులు వెంకటరమణ గౌడ్, గాజుల సంపత్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

---

### ప్రజా సేవలో మేటి...

# రారెవరూ రత్నాకరునికి సాటి

అక్టోబర్ 4...
జువ్వాడి రత్నాకర్ రావు జయంతి

ఆరుపదుల రాజకీయ ప్రస్థానంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకుని, 90 కి పైగా వసంతాలను చూసిన, కరీంనగర్ కాంగ్రెస్ దిగ్గజం, రాజకీయ కురువృద్ధుడు, మాజీ అమాత్యులు రత్నాకర్ రావు ప్రజాసేవలో మేటిగా పేరు గడించారు . ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామం లో 1928 అక్టోబర్ 4వ తేదీన జన్మించిన జువ్వాడి రత్నాకర్ రావు, చిరకాలం తిమ్మాపూర్ సర్పంచ్‌గా, జగిత్యాల పంచాయతీ సమితి అధ్యక్షులుగా, ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలకవర్గం సభ్యులుగా, ధర్మపురి దేవస్థానం చైర్మన్ గా, ధర్మ పురి ప్రాచ్య డిగ్రీ కళాశాల పాలక వర్గ అధ్యక్షు లుగా, బుగ్గారం నియోజకవర్గానికి మూడు సార్లు శాసన సభ్యులుగా, పీసీసీ కార్యనిర్వా హక కార్యదర్శిగా ఏఐసిసి సభ్యుడిగా, రాష్ట్ర దేవాదాయ స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా పనిచేసి, చేపట్టిన అన్ని పదవులకు వన్నె తెచ్చి, అవిశ్రాంత ప్రజా సేవకునిగా జన హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారు. 1989 జరిగిన ఎన్నికల్లో టిడిపి, కాంగ్రెస్ ను, కాదని బుగ్గారం నియోజకవర్గ ఓటర్లు స్వతంత్ర అభ్యర్థిగా జువ్వాడి రత్నాకర్ రావును గెలిపించి రాష్ట్రంలో సంచలనం సృష్టించారు. 1994లో మినహాయించి రత్నాకర్రావు 1999లో మరియు 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఘన విజయాలు సాధించారు. చివరిసారిగా రాజశేఖర్ రెడ్డి హయాంలో రత్నాకర్ రావు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

**"జిల్లా రాజకీయాలలో చెరగని ముద్ర"**

అర్థ శతాబ్దికి పైగా రాజకీయ యవనికపై ప్రత్యేక పాత్రధారిగా నిలిచిన రత్నాకర్ రావు, అవిభక్త కరీంనగర్ జిల్లా రాజకీయా లపై చెరగని ముద్ర వేశారు. కాంగ్రెస్ అధిష్టానంతో సన్నిహిత సంబంధాలు కలిగి, తలపండిన రాజకీయ

నేతగా, రాష్ట్ర ముఖ్య మంత్రులకు సన్నిహితంగా ఉంటూ, జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక పాత్ర పోషించారు. కరీంనగర్ ఎం.పి లుగా రమాపతిరావు, చొక్కారావు, సత్యనారాయణ రావు తదితరుల ఎన్నికలలో ఈ ప్రాంతం నుండి మెజారిటీ ఓట్లు అందించి, విజయాలకు ఎంతో కృషి జరిపారు. తనకు ముఖ్య అనుచరులైన ఆది శ్రీనివాస్ ను వేములవాడ దేవస్థానం చైర్మన్ గా, కొండూరి రవీందర్రావును జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా , తన మద్దతు కోరిన రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్‌గా పొన్నం ప్రభాకర్ తదితరుల నియామకాలలో, ఎన్నికలలో తెరవెనుక ప్రధాన సూత్రధారిగా ఉండి, తన కుమారుడైన నర్సింగరావు ఏపీఐఐసి డైరెక్టర్ గా ఉన్న స్థితిలో, పలు క్యాంపుల నిర్వహణ బాధ్యతలు తనయుడికి అప్పగించి, ఉమ్మడి జిల్లాలో తన బలాన్ని, బలగాన్ని, రాజకీయ కురువృద్ధ పాత్రలో, తన పట్టును నిరూపించుకో గలిగారు. అలాగే దశాబ్దాల కాలం రాజకీయ రంగంలో తనను వెన్నంటి ఉండి కష్ట సుఖాలలో విడవకుండా ఉన్న సారంగాపూర్ మండలానికి చెందిన వరిష్ఠ నేత కొండ మల్లారెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదాధికారిని చేయడంలో రాజకీయం నెరపి, ఇతర శాసన సభ్యుల ఆమోదం ముద్రలతో, విజయం సాధించ గలిగారు. ధర్మపురి మండలం దోనూర్ వాసి న్యాయవాది లక్ష్మణ్ ను జనరల్ స్థానంలో ఎంపీటీసీగా గెలిపించి ధర్మపురి మండల అధ్యక్షుడిగా చేశారు. తనను విశ్వసించిన, పార్టీకి సేవలందించిన వ్యక్తులకు అవకాశాలను బట్టి వివిధ పదవులను ఇప్పించడంలో సఫలీకృతులయ్యారు.

–రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

### "అవినీతికి దూరం... నిజాయితీ బలం"

**సర్పంచ్ నుండి రాష్ట్ర అమాత్య పదవులు పొందడం వెనక అవినీతి రహిత, రత్నాకర్ రావు మచ్చ లేని, నిజాయితీకి ప్రతిరూపమైన, ఆయన వ్యక్తిత్వమే కారణం. పార్టీ టికెట్ రాని నేపథ్యంలో, 1989లో స్వతంత్ర అభ్యర్థిగా జువ్వాడి రత్నాకర్ నామినేషన్ దాఖలు చేయాలని శ్రేయోభిలాషులు పట్టు బట్టిన సమయంలో "ప్రస్తుతం డిపాజిట్ డబ్బులు లేవు కదా" అనడాన్ని బట్టి ఆయన పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. (ఇక్కడ పార్టీ టికెట్ వస్తే పార్టీ ఫండ్ తో పాటు, అభిమానుల చందాలు వస్తాయని భావం). జగిత్యాల పంచాయితీ సమితి అధ్యక్షునిగా పదవీ విరమణ చేసిన సందర్భంలో, కోండ్ర మల్లారెడ్డి నేతృత్వంలో, 90 మందికి పైగా సర్పంచులు స్వచ్ఛందంగా భాగస్వాములై, ఒక కొత్త అంబాసిడర్ కారు కొని, బహూకరించిన వేళ..."నాకు ముందే ఎందుకు చెప్పలేదు. కారు కొనిచ్చినా, రేపటి నుండి పెట్రోల్ ఎలా పోసుకోవాలి, ప్రేమతో ఇస్తున్న కానుకను ఉపయోగించ లేను. విక్రయించనూ లేను" అని బాధను వ్యక్తం చేయడం ద్వారా రత్నాకర్ రావు అపూర్వ, అనితర, స్ఫూర్తి దాయక, ఆదర్శ వ్యక్తిత్వం ద్యోతకమవుతుంది.**

---

# పర్యావరణ సమతుల్యతకు జీవ వైవిధ్యం కీలకం

**(04 అక్టోబర్ "ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం" సందర్భంగా)**

**పాతరాతి యుగం నుంచి నేటి వరకు కూడా ప్రపంచ మానవాళి ఆహారం, ఔషధాలు, గృహనిర్మాణం, ఇంధనం, వస్త్రాల కోసం వనాలపై లేదా అటవీ వృక్ష జంతుజాలాలపై ఆధారపడి ఉంటున్నాడు. ప్రకృతి సహజ అందాల విందులు ఆరబోస్తున్న అటవీ సంపద పర్యావరణ వ్యవస్థను కాపాడడం జరుగుతున్నప్పటికీ మానవ తప్పిదాలతో జంతువుల సంఖ్య తగ్గడం, జీవ వైవిధ్యానికి విఘాతం కలగడం జరుగుతున్నది. అన్ని రకాల వృక్ష జంతు జాతులతో మనిషి కలిసి స్నేహంగా జీవితాలను గడపని యెడల రాబోయే తరాలు భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు**

### 2026 ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం ఇతివృత్తం

నేటి జీవజాతుల్లో దాదాపు ఒక్క మిలియన్ వరకు అంతరించే అంచున ఉన్నాయని భయంకర వాస్తవమే నిజమైతే మానవ శాంతియుత జీవనం బుగ్గిపాలు కావడం తప్పనిసరి. భూమిని, భూగ్రహంపై సహజంగా జీవిస్తున్న జీవరాశులను కాపాడకపోవడం మన కనీస కర్తవ్యం అని తెలుపులతో పాటు జీవవైవిధ్య పరిరక్షణకు అవసర నిధులు కూడా సహకరించడం ప్రధాన అంశమని ఐరాస పేర్కొంటున్నది. ప్రపంచ సగం జిడిపీ ప్రకృతి సంపద మీదనే ఆధారపడి ఉంటున్నది. జీవవైవిధ్య పరిరక్షణకు లేవదా పునర్నిర్మాణానికి ప్రతి ఏట 143 బిలియన్ల డాలర్ల నిధులను ప్రపంచ దేశాలు అందిస్తున్నాయని, ఈ సత్కార్య నిర్వహణకు 824 బిలియన్ డాలర్లు అవసరం అవుతాయని, కనీసం ఏడాదికి 500 బిలియన్ డాలర్లు అయినా ప్రపంచ దేశాలు వెచ్చించాలని ఐరాస ప్రధాన కార్యదర్శి పేర్కొనడం విశేషం. "ఇంటర్నేషన్ ట్రేడ్ ఇన్ ఎండేంజర్డ్ స్పీసీస్ ఆఫ్ వైల్డ్ ఫానా అండ్ ఫ్లోరా" అనే సంస్థ 50వ వర్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో జంతు సంక్షేమ కార్యాలు పటిష్ట పథకాలతో నడవాలి. ప్రపంచ జంతు సంక్షేమ దినం–2026 ఇతివృత్తంగా "వాటి నేత్రాలతో చూద్దాం (సీ ది వరల్డ్ త్రూ దేర్ ఐస్)" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ మానవాళి ఆయురారోగ్యాలకు జీవవైవిధ్యంతో పాటు పర్యావరణ వ్యవస్థల సమతుల్యత అవసరం అవుతాయని, వీటి సాధనకు అవసరమైన ఆర్థిక నిధులు అందించారని ప్రపంచ దేశాలను, ముఖ్యంగా అభివృద్ధి చెందిన దేశాలను కోరడం జరుగుతున్నది.

జంతు సంక్షేమ సమతుల్యత దెబ్బతినకుండా వాటిని రక్షించు కుంటూ, జీవవైవిధ్యానికి పట్టం కట్టవలసిన సమయం ఆసన్నమైనది. భూమిపై సహజంగా జీవితాలను గడుపుతున్న అనేక రకాల జీవరా సులను పరిరక్షించుకోని యెడల పలు జాతులు అంతరించే ప్రమాదంతో పాటు మానవ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని అందరం తెలుసుకోవాలి.

**భావితరాల మనుగడకు జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సమతుల్యత:**

మన పిల్లలకు అపార సంపదలను సంపాదించి పెట్టినప్పటికీ తాగడానికి చుక్క శుద్ధ నీరు, పోల్చడానికి పరిశుద్ధ గాలి లేనపుడు మనిషివద్ద ఎన్ని ఉన్నా నిరర్థకమే అవుతాయని తెలుసుకో వాలి. పర్యావరణ వ్యవస్థను కాపాడడం, జీవ వైవిధ్యాలను సంరక్షించడం, సహజ ప్రక్రియలను నియంత్రించడం, మానవ జాతికి కనీస అవసరాలు తీర్చడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరడానికి వన్యప్రాణులు అమూల్య సేవలను అందిస్తున్నాయి. మనిషి అడక ముందే తనకు కావలసిన కనీస అవసరాలైన కూడు, గూడ, గుడ్డను ఇస్తున్న జంతువుల పరిరక్షణ అవసరాల ను ప్రజల్లో ఏకరువు పెట్టడానికి, హెచ్చరికలు చేయడానికి "సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసీ ఫీస్ట్ డే" రోజు ప్రతి ఏట 04 అక్టోబర్ "ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం లేదా వరల్డ్ ఆనిమల్ వెల్ఫేర్ డే" నిర్వహించడం జరుగుతున్నది. అడవుల్లో దాదాపు 60,000 వృక్ష జాతులు, 80 శాంతం ఉభయచర జాతులు, 75 శాతం పక్షి జాతులు ప్రపంచవ్యాప్త 1.6 మిలియన్ల ప్రజలకు నేరుగా నిత్యావసరాలను తీర్చుతున్నాయి.

**ప్రపంచ జంతు సంక్షేమ దినం వేదికగా చేయదగిన కార్యక్రమాలు:**

ప్రపంచ జంతు సంక్షేమ దినం వేదికగా ప్రజలకు అవగాహన కల్పించడం, వన్యప్రాణులను కాపాడే సంస్థలు లేదా వ్యక్తులను గుర్తించడం, ఆర్థిక నిధుల సేకరణ, ప్రభుత్వాల చొరవ, ప్రజల సహకారం, ఎన్జీవోల చొరవ లాంటి వి నిర్వహి స్తేనే వన్యప్రాణుల పరిరక్షణ ఆవశ్యతకతను వివరించే కార్యశాలలు, సెమినార్లు, ఆన్‌లైన్ లేదా ఆఫ్-లైన్ అవగాహనలు, నిధుల సేకరణ కార్యక్రమాలు, ప్రపంచ దేశాల సమన్వయ సహకారాలు, విజ్ఞాన వితరణలు లాంటివి నిర్వహించడం మంచిది. పర్యావరణ సమతుల్య తకు గొడుగు పట్టడం, జీవవైవిధ్యానికి ఊపిరు లూదడం, సహజ అందాలను ఆస్వాదిస్తూ కాపా డుకోవడం లాంటివి నిరంతరం కొనసాగాలి. జీవవైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత, ఔషధాల లభ్యత, శుద్ధ జలాలు/పీల్చే గాలులు, వాతావరణ సానుకూల మార్పులు సమకూరుతాయి. ఈ విషయాలను నేటి మనిషి పెడచెవిన పెట్టి విధ్వంసానికి పాలుపడితే రేపటి తరం మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, మనం కూర్చున్నా కొమ్మను మనమే నరుక్కోవద్దని గుణపాఠం నేర్చుకోవడంతో పాటు జీవవైవిధ్య దీపం ఉండగానే భూగృహాన్ని లేదా ఇల్లును చక్కదిదుకుందాం.

–డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## సెల్ఫ్ అడిట్ రిపోర్ట్లు అందజేస్తాం, రెండు నెలల గడువివ్వండి

### ట్రస్మా అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 03:** బడ్జెట్ ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం స్వయంగా తయారు చేసుకున్న వార్షిక ఆర్థిక ఆడిట్ రిపోర్టులను సమర్పించేందుకు అనుమతి నివ్వాలని తెలంగాణ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల సంఘం ( ట్రస్మా ) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కు ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. బడ్జెట్ పాఠశాలలు ఇప్పటికే ఆర్థికంగా చితికి ఉన్నాయని చార్టెడ్ అకౌంట్ ట్లతో ఆడిట్ రిపోర్ట్ లు చేయించడం మరింత ఆర్థిక భారం అవుతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ సూచనల మేరకు తమ పాఠశాలల ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఆర్థిక భారాన్ని మోయలేని పరిస్థితిలో తాము సెల్ఫ్ ఆడిట్ రిపోర్ట్ ను సబ్మిట్ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇందుకు మరో రెండు నెలల గడువును ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల పై ఫిర్యాదులను కోరుతూ ఆన్లైన్ పోర్టల్ ను తీసుకురావడం కూడా అభ్యంతరకరమన్నారు. పాఠశాలలతో సంబంధం లేని వ్యక్తులు కూడా తప్పుడు ఫిర్యాదులు చేసే అవకాశం ఉందని వాపోయారు. ఇబ్బందులు కలిగించే విధంగా ఉన్నటువంటి అంశాలపై సమగ్రంగా మరోసారి చర్చించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## శ్రీ పద్మ హ్యాండ్లూమ్స్ ఎగ్జిబిషన్ సేల్ ఘన ప్రారంభం

**రంగారెడ్డి జిల్లా, వెలుతురు అక్టోబర్ 3 :** కొత్తపేట గ్రీన్ హిల్స్ కాలనీలో శ్రీ పద్మ హ్యాండ్లూమ్స్ ఆధ్వర్యంలో దసరా - దీపావళి ప్రత్యేక ఎగ్జిబిషన్ సేల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు సురేష్ మాట్లాడుతూ తక్కువ ధరలకే నాణ్యమైన చేనేత వస్త్రాలను అందిస్తున్నామని, చేనేత వస్త్రాలకు నిదర్శనంగా మా ఎగ్జిబిషన్ నిలుస్తుందని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ లో మహిళల కోసం కంచి, బనారస్, ఉప్పాడ, మంగళగిరి, పోచంపల్లి వంటి అనేక రకాల డిజైనర్ శారీస్, డ్రెస్ మెటీరియల్స్, హ్యాండ్లూమ్ కాటన్ చీరలు ప్రత్యేక డిస్కౌంట్ ధరల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దసరా, దీపావళి పండుగల సందర్భంగా ఈ ప్రాంత ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నాణ్యమైన చేనేత వస్త్రాలను సరసమైన ధరలకే కొనుగోలు చేయాలని కోరారు.

## రెడ్ క్రాస్ ఎన్నికలు తదుపరి ఉత్తర్వుల వరకు వాయిదా

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 03:** రంగారెడ్డి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వాయిదా వేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి తెలిపారు.జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ జారీ చేసిన లేఖ నం. ఎ2/741/2026, తేదీ: 03-10-2026 లోని ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.రెడ్ క్రాస్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి 04-10-2026న నిర్వహించాల్సిన ఎన్నికల ప్రక్రియను వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు.తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు, తదుపరి ఎన్నికల షెడ్యూల్‌ను సంబంధిత ఆదేశాల అనంతరం ప్రకటిస్తామని తెలిపారు.

## మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో ఏఆర్టి, సరోగసీ బోర్డు సమావేశం

**మేడ్చల్ వెలుతురు అక్టోబర్ 03:** మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఏఆర్టి / సరోగసీ బోర్డు సమావేశం నిర్వహించారు. సరోగసీ ప్రక్రియలో వైద్యపరమైన అవసరం, చట్టబద్ధత, పారదర్శకత, నైతిక ప్రమాణాలు, భవిష్యత్ తల్లి--శిశు సంక్షేమం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించారు. గర్భధారణకు సంబంధించిన వైద్యపరమైన సమస్యలు, గర్భస్థ శిశువును మోసే సామర్థ్యం, ఇతర ప్రత్యామ్నాయ చికిత్సల అవకాశాలు తదితర అంశాలపై నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవీలత, శిశు వైద్య నిపుణులు డాక్టర్ శివ కిరణ్ పాల్గొన్నారు. సరోగసీకి సంబంధించిన మొత్తం 5 దరఖాస్తులను బోర్డు పరిశీలించింది. సరోగసీ (నియంత్రణ) చట్టం, 2021లోని నిబంధనలు, నిర్దేశిత వైద్య ప్రమాణాలు, దరఖాస్తుదారుల అర్హతలు, సంబంధిత పత్రాల ఆధారంగా 3 దరఖాస్తులకు ఆమోదం తెలిపి, వైద్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేసింది.సరోగసీ ప్రక్రియలో అక్రమాలు, దుర్వినియోగం, వాణిజ్య ప్రయోజనాలకు తావులేకుండా చట్టపరమైన నిబంధనలను కఠినంగా అమలు చేయాలని బోర్డు స్పష్టం చేశారు. అర్హత కలిగిన దంపతులు మాత్రమే, పూర్తి వైద్యపరమైన చట్టబద్ధమైన పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయనున్నట్లు డా ఆనంద్ తెలిపారు.

## మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా మైనారిటీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా మహమ్మద్ ఉస్మాన్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 03:** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా మైనారిటీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ గా మహమ్మద్ ఉస్మాన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మహమ్మద్ ఉస్మాన్ మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం హన్మంతన్న మహమ్మద్ ఉస్మాన్ ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, డీసీసీ మైనారిటీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీ సయ్యద్ షఫీ, సీనియర్ నాయకులు సంపంగి వెంకటేష్ , పాషా భాయ్, సయ్యద్ ఆరిఫ్, ఎండీ నసీర్, ఎండీ అజీమ్, ఎండీ సల్మాన్, తదితర మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలకు ప్రభుత్వానికి మధ్య అధికారులే వారధి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- మంచాల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం
- స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**మంచాల వెలుతురు అక్టోబర్ 03:** మంచాల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రతినిధులతో ఇబ్రహీంపట్నం ఎమ్మె ల్యేమల్ రెడ్డి రంగారెడ్డి సమీక్ష సమావేశం ఈసందర్భంగా మాట్లాడుతూ ఒక్కోగ్రామానికి సుమా రుగా రూ3కోట్లకు పైగా నిధులిచ్చామన్న ఎమ్మెల్యేమంచాల మండల రూపురేఖలు మార్చటమే ల క్ష్యమని వెల్లడిప్రభుత్వ పథకాలు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజలకు చేరిన ప్పుడే సర్కార్ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు ఇందుకోసం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అ ధికారులు వారధిగా పనిచేయాలన్నారు శనివారం మంచాల మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతి నిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు ఈసందర్భంగా అ భివృద్ధి కార్యక్రమాల పురోగతి సంక్షేమ పథకాల అమలుతీరును సంబంధిత అధికారులనుఅడి

గితెలుసుకున్నారు అధికారులు హెడ్‌క్వార్టర్ ను వదిలి ప్రజలవద్దకు వెళ్తేనే సమస్యలు తెలుస్తా యన్నారు ఆఫీస్‌కు వచ్చామా వెళ్లిపోయామా అన్నట్టుగా విధి నిర్వహణ ఉండకూడదని ఎమ్మె ల్యే తెలిపారు పంచాయతీ కార్యదర్శులే కీలకం గ్రామాల అభివృద్ధి పేదరికం నిర్మూలనే లక్ష్యం గా ముందుకెళ్తున్న తరుణంలో క్షేత్రస్థాయిలో ఉండే పంచాయతీ కార్యదర్శులే కీలకమని ఎమ్మె ల్యే తెలిపారు గ్రామంలో సమస్యను గుర్తించి సంబంధిత శాఖా ఆధికారికి సమాచారమివ్వాలని చెప్పారు ప్రతీరోజూ ఏయే అధికారి గ్రామంలో పర్యటిస్తున్నారనేది గ్రా మపంచాయతీలో రికార్డు మెయి న్‌టెయిన్ చేయాలని సూచించారు తాగునీరు పారిశుద్ధ్యం వీధిదీ పాలు రోడ్ల పరిస్థితి ప్రభుత్వ పథకాల అమలును నిత్యం పర్యవే క్షించాలన్నారు ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారు లు జీపీవోలతో సమన్వయంతో గ్రామాల అభివృద్ధి సెక్రటరీలు ముందుండి పనిచే యాలన్నారు రూపురేఖలు మార్చుదాం వెనకబడిన ప్రాంతంగా పిలిచే ఈ మండలంలో అత్యున్నత ప్రమాణా లతో ఆరుట్ల టీపీఎస్ ఏర్పాటు చేసి రాష్ట్రానికే దిక్సూచీగా నిలబెట్టామన్న మల్‌రెడ్డి మంచాల కు మరో విద్యాకేంద్రం తెస్తామన్నారు ఇప్పటివరకు రోడ్లు మౌలిక వసతుల కల్పనకు మండలా నికి రూ66కోట్ల నిధులిచ్చామని ఒక్కోగ్రామానికి సుమారుగా మూడు కోట్లు అందినట్లు ఎమ్మె ల్యే తెలిపారు మంచాల మండల రూపురేఖలు మార్చేందుకు చేసే ప్రయత్నంలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు విద్యుత్ సరఫరా పట్ల ప్రత్యేకంగా ఆరాతీ సిన ఎమ్మెల్యే కరెంటు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు ఉండకూడదని స్పష్టం చేశారు అనంతరం మంచాల మండ లం కేంద్రంలోని దండేట్ కార్ ఫంక్షన్ హాలో మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఇ బ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రంగారెడ్డి సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ పథకం పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తుంది అనిఅన్నారు ఆధార్ కార్డు ఎలా గో స్మార్ట్ రేషన్ కార్డు అలాంటిది అని అన్నారు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు సర్పంచు లు కలిసి ప్రతి ఇంటికి వెళ్లి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయాలి అని అన్నారు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది స్మార్ట్ రేషన్ కార్డు ఉన్న ప్రతి పౌరునికి ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుంది అని అన్నారు ఈ కార్యక్ర మంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి మంచాల వ్యవసా య సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి మంచాల మండలం తహసిల్దార్ వెంకటప్రసా ద్ రావు ఎంపీడీవో అధికారి వసంతలక్ష్మి వివిధ శాఖల అధికారులు వివిధ గ్రామాల సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు

## మండలం సమీక్ష సమావేశంలో వివిధ సమస్యలపై సర్పంచ్‌ల ఆందోళన

- గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**మంచాల వెలుతురు అక్టోబర్ 03:** మంచాల మండలం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో పలు సమ స్యలపై వివిధ గ్రామాల బిఆర్ఎస్ పార్టీ సిపిఎం పార్టీ సర్పంచ్ లు ఆందోళన చేస్తూ నిరసనవ్య క్తం చేశారు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో గ్రామ సర్పంచ్ లను సంప్రదించకుండా ఇందిర మ్మ ఇండ్లు సెలక్షన్ చేస్తున్నారని ప్రభుత్వం నుండి ఎలాంటి సంక్షేమ పథకాలు అమలైన సర్పంచ్ లను సంప్రదించకుండా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారువిద్యుత్ సమస్య అధికంగా ఉన్నది అని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి విద్యుత్ అధికారులకు చెప్పి ఎక్కడ విద్యుత్ సమస్య ఉన్నవెంటనే పరిష్కరించా ల ని ఆదేశించారు తిప్పాయిగూడ గ్రామంలో గత నెల రోజుల నుండి తాగునీటి సమస్య ఉన్నది అని గ్రామ సర్పంచ్ అధి కారుల దృష్టికి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు వెంటనే ఎమ్మెల్యే గారు వాటర్ బోర్డు అధికారులకు చె ప్పి గ్రామాల్లో త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాల ని సూచించారు గ్రామాల్లో ఎలాంటి సంక్షేమ పథకాలు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల విషయం లో రేషన్ కార్డుల పంపిణీ విషయంలో సర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు అందరూ కలిసిక ట్టుగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే గారు సూచించారు ఈ కార్యక్ర మంలో వివిధ గ్రామాల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు

## సంక్షేమమే లక్ష్యం.. అభివృద్ధియే సాక్ష్యం

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి అక్టోబర్ 03:** ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా చేపడుతున్న అభివృద్ధిలో భాగంగా శనివారం 277 - మహాదేవపురం డివిజన్ లోని షిరిడి హిల్స్లో దాదాపు 82.50 లక్షల వ్యయంతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు, బీటీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మహదేవపురం డివిజన్లోని షిర్డీ హిల్స్ కాలనీ లో సీసీ రోడ్లు, బిటీ రోడ్లు, పార్కుల అభివృద్ధికి, డివైడర్ల ఏర్పాటు వంటి మౌలిక వసతుల అభివృద్ధితో 80 శాతం పనులు పూర్తి చేశామని, మిగిలి పోయిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు.డివిజన్ లోని అన్ని కాలనీలలో మౌలిక వసతులను అభివృద్ధిలో భాగంగా గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి త్రాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంతో ఎంతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా మహదేవపురం డివిజన్ లోని అన్ని కాలనీలలో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి సత్య బాబు, కోశాధికారి బాలకిషన్, సలహాదారులు పీవీఆర్ యశస్వి, మధుసూదన్, ఉపాధ్యక్షులు బ్రహ్మా రెడ్డి, వేణుగోపాల్ చారి, రాజేష్, సభ్యులు శివ, రవి, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి అక్టోబర్ 03:** సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధి భౌరంపేట్ లక్ష్మీ నగర్ కాలనీలో విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించేందుకు నూతనంగా నాలుగు నాలుగు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయగా, మాజీ కౌన్సిలర్ మురళీ యాదవ్ ఆధ్వర్యంలోశనివారం నిర్వహించిన ట్రాన్స్ఫార్మర్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ విచ్చేసి ట్రాన్స్ఫార్మర్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ద్వారా అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని, గత 12 ఏళ్ల కాలంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పాటు దుండిగల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ప్రసూన, పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, ధర్మా రెడ్డి, కాలనీ వాసులు తిరుపతి రెడ్డి, దిలీప్, సూరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన సర్పంచ్ మాలుగు శ్రీను

**మునుగోడు, అక్టోబర్ 3 (వెలుతురు):** మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శని వారం అత్యంత ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ మాలుగు శ్రీను ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు ఈ నూతన కార్డులను స్వహస్తాలతో అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాలుగు శ్రీను మాట్లా డుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని కొనియాడారు. పాతకార్డుల స్థానంలో వచ్చిన ఈ సరికొత్త కార్డుల ద్వారా రేషన్ పంపిణీలో మరింత పారదర్శకత పెరుగు తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథ కాలు నేరుగా అందుతాయని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు. కార్డులు పొందిన లబ్ధి దారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభు త్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రభుత్వ అధికారులు ,గ్రామ స్థులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం

### సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహగౌడ్.

**మునుగోడు,అక్టోబరు 3 (వెలుతురు ):** గ్రామంలో మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యం ఇస్తూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహగౌడ్ తెలిపారు.ఇటీవల ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మునుగోడులో మార్నింగ్ వాక్ సందర్భంగా పలు వార్డుల్లో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా మొదటి వార్డులోని మార్కెట్‌యార్డు వద్ద ప్రధాన డ్రైనేజీలో నీరు నిలిచిపోవడం,పిచ్చి చెట్లు పెరిగి అపరిశు భ్రంగా ఉండటాన్ని గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు శనివారం సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది జేసీబీతో ప్రధాన డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికను తొలగించి నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. మార్కెట్‌యార్డు పరిసరాల్లో పెరిగిన పిచ్చి చెట్లను సైతం తొలగించారు.మునుగోడును పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం చర్యలు చేపడతామని, గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని సర్పంచ్ కోరారు.ఈ కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, పందుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోదాడకు వైద్య వరం.. రూ.26 కోట్లతో ఆధునిక ఆసుపత్రి నిర్మాణ పనులు

కోదాడ: కోదాడ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కీలక ముందడుగు పడింది. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన ఇన్‌పేషెంట్ విభాగం అందుబాటులోకి వచ్చిందని. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహతో కలిసి నూతన ఇన్‌పేషెంట్ విభాగాన్ని శనివారంప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం కోదాడ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినట్లు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి తెలిపారు. నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు.యుద్ధప్రాతిపదికన పనులు ఆసుపత్రి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి.. రెనోవేషన్ పనులతో పాటు నూతనంగా నిర్మించిన ఎగ్జిస్టింగ్ బ్లాక్, ఇన్‌పేషెంట్ విభాగం పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందే రోగులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు.నేటి నుంచే అన్ని సేవలు

నూతన ఇన్‌పేషెంట్ విభాగం ప్రారంభంతో నేటి నుంచి ఆసుపత్రిలో అన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కోదాడ నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన, నాణ్యమైన వైద్యం అందేలా వైద్యులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం 100 పడకల సామర్థ్యంతో ప్రభుత్వ ఆసుపత్రి సేవలు విస్తరించడంతో కోదాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయోజనం కలగనుంది. వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం ఏర్పడింది. ప్రభుత్వ ఆసుపత్రిని దశలవారీగా మరింత అభివృద్ధి చేసి ప్రజలకు అవసరమైన వైద్య సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ బాబు, డీఎంహెచ్‌ఓ పెండెం వెంకటరమణ, డీసీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ, డాక్టర్ సుబ్బారావు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్పర్సన్ దేవరపల్లి మల్లేశ్వరి, ఆర్డీవో సూర్యనారాయణ తహసిల్దార్ సంతోష్, కిరణ్, స్థానిక కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, అధికారులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై కాంగ్రెస్ సర్కార్ కక్షసాధింపు: మాజీ ఎంపీపీ

భూదాన్ పోచంపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతాంగాన్ని పూర్తిగా విస్మరించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. శనివారం భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని జలాల్పూర్ గ్రామంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ ను బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ముట్టడిం చారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై బైఠాయించి దాదాపు గంటన్నర పాటు రాస్తారోకో చేపట్టారు. అనంతరం మాజీ ఎంపీపీ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.కేసీఆర్ హయాంలో అన్నదాతలకు 24 గంటల పాటు నిరంతరాయంగా, ఉచితంగా నాణ్యమైన కరెంటు అందించి వ్యవసాయాన్ని పండుగలా మార్చారని గుర్తుచేశారు.

## విద్యార్థులకు దివీస్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 03:** చౌటుప్పల్ మండలంలోని కైతాపురం ఎల్లగిరి ప్రభుత్వ పాఠశాలల్లో మరియు మల్కాపురంలోని అనాథ పిల్లల కోసం నెలకొల్పిన జోసఫ్ లేబర్ హైస్కూల్లో విద్యార్థులకు దివీస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు శనివారం

నిర్వహించారు. డాక్టర్ నగేష్ డాక్టర్ జయంత్ కుమార్ లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు దివిస్ సమకూర్చిన ఔషధాలను స్థానికులను పంపిణీ చేశారు. దివీస్ విద్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ మూడు పాఠశాల ల్లోని విద్యార్థులకు రూ. 1,66.088 విలువైన నోట్ బుక్స్ ను విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఏపిపిసి చైర్మన్లు సుమలత, అలివేలు, పంచాయతీ కార్యదర్శి బ్రాహ్మణి, ప్రధానోపాధ్యాయులు విజయమ్మ, అనిత, కోటేశ్వరరావు, దివీస్ ప్రతినిధులు గోపి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

## పిల్లల ఎదుగుదల లోపాలను తల్లులు గుర్తించాలి

### అంగన్‌వాడీ సూపర్‌వైజర్ యాక్ పాషా బేగం

**గుండాల, అక్టోబర్ 3 (వెలుతురు):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం మరిపడిగా గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ మహమ్మద్ యాక్ పాషా బేగం మాట్లాడుతూ... పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలలో ఏర్పడే లోపాలను తల్లులు తొలిదశలోనే గుర్తించాలని సూచించారు. తల్లులు పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల విషయంలో పూర్తి అవగాహనతో వ్యవహరించాలని ఆమె అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద గర్భిణులు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే

అవకాశం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సూచించిన పరిమాణంలో తీసుకోవడంతో పాటు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సుఖ ప్రసవాలు, తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. తల్లీబిడ్డలు అనారోగ్యానికి గురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుల సలహాలు తీసుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని పాషా బేగం సూచించారు. ముఖ్యంగా 0--3 సంవత్సరాల వయస్సు గల పిల్లల అభివృద్ధి మైలురాళ్లను అంగన్‌వాడీ సిబ్బంది క్రమం తప్పకుండా నమోదు చేయాలని తెలిపారు. పిల్లల్లో ఎదుగుదల ఆలస్యం, మానసిక లేదా శారీరక అభివృద్ధికి సంబంధించిన సమస్యలను తొలిదశలోనే గుర్తించి, అవసరమైన పిల్లలకు ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధు, ఏఎన్‌ఎం సంగి రేణుక, అంగన్‌వాడీ టీచర్లు కలమ్మ, స్వరూప, ఆశా వర్కర్లు భాగ్యమ్మ, కళమ్మతో పాటు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## బిజెపి ప్రభుత్వంతోనే దేశానికి రక్ష

- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్ణాటక సహ ఇన్చార్జి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు
- యాదగిరిగుట్టలో పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ ఆధ్వర్యంలో విస్తృతంగా
- పర్యటించిన డాక్టర్ కాసం

**యాదగిరిగుట్ట, అక్టోబర్ 3 వెలుతురు** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తోనే దేశానికి రక్షణ అని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కర్ణాటక బిజెపి నూతన సహ ప్రభారీగా నియమితులైన సందర్భంగా డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక బిజెపి నాయకులు డోలు డప్పులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి పాదాల వరకు ర్యాలీ నిర్వహించి ఇటీవల విమాన ప్రమాదంలో ఉగ్రదాడికి గురైన పైలట్ స్మిత్ మచ్చర్ ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని స్వామివారి పాదాల వద్ద పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. తరువాత కొండపైన స్వామివారిని దర్శించుకుని ఖమ్మం నల్గొండ వరంగల్ పట్టబద్రుల ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 175 మందిని కాపాడినటువంటి ఒక ఇండియన్ పైలెట్ కు కనీసం మద్దతు ఇవ్వలేని స్థితిలో ఉంది. వీళ్లు కేవలం మతాల ఆధారంగా రాజకీయం చేస్తున్నారు. దేశంలోని ఎన్నోసార్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎస్ఐఆర్ నిర్వహించారు. కానీ దాని తర్వాత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. ఎప్పుడు లేని విధంగా ఎస్ఐఆర్ పై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుంది కాంగ్రెస్ వాళ్లే. ఎస్ఐఆర్ అన్నిసార్లు నిర్వహించి లేని తప్పు ఇప్పుడు మా హయాంలో సర్ నిర్వహిస్తే వచ్చే ఇబ్బంది ఏంటి అని ప్రశ్నించారు. ఎలక్షన్ కమిషన్ అనేది ఒక స్వతంత్ర సంస్థ గతంలో ఎలక్షన్ కమిషన్ లో పనిచేసినటువంటి కమిషనర్లు ఎంతోమంది పదవి విరమణ తర్వాత కాంగ్రెస్ పార్టీ తమ మంత్రివర్గంలో స్థానం కల్పించింది కానీ ఈరోజు కాంగ్రెస్ వారు మాట్లాడే మాటలు అర్థం లేనివి గా ఉన్నాయని ఆయన విమర్శించారు. అలాగే వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్సీలు ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని పట్టబద్ధులను కోరారు. అలాగే యాదగిరిగుట్ట మున్సిపల్లో జరుగుతున్నటు వంటి అవినీతి విషయం మీద ఈమధ్య మా బిజెపి కౌన్సిలర్లు అద్భుతమైన పోరాటం చేస్తున్నారు. తక్షణం మున్సిపాలిటీ ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో ముందు ముందు భారీ పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి పలువురి గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేసుకునే కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ , జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్ జిల్లా సెక్రెటరీ కృష్ణ , మాయ దశరథ , అచ్చయ్య, పట్టణ కౌన్సిలర్లు బోడరాధ ,కర్రె మాధవి ప్రవీణ్, మహేశ్వరి, దయ్యాల కుమార్ ,కిసాన్ జిల్లా అధ్యక్షులు పక్కి రాజేందర్ రెడ్డి ,బిజెపి జిల్లా సెక్రెటరీ లక్ష్మీనారాయణ ,జిల్లా కార్యవర్గ సభ్యులు బండారపు మల్లేష్ ,బోనగిరి శ్యామ్ ,అశోక్ ,జిల్లా ఓబీసీ సెక్రెటరీ దొమ్మాట ప్రభాకర్ , జిల్లా కౌన్సిల్ నెంబర్ ఆకుల చంద్ర మౌళి,పట్టణ ప్రధాన కార్యదర్శిలు నరేష్ ,సురేష్ , బోడ బుచ్చిబాబు సీనియర్ నాయకులు రంగసత్యం ,నల్ల వెంకటరెడ్డి, సుదగాని శివకుమార్ ,బోడ సురేష్ ,ఆవుల సత్యనారాయణ ,శివరాత్రి శ్రీశైలం ,వంశీ ,నరేష్ ,జిగిని నవీన్ ,నల్ల వాసుదేవ రెడ్డి, శ్యామ్ ,లక్ష్మయ్య ,శరత్ రెడ్డి ,ప్రశాంత్ ,శివాజీ , పాల్గొన్నారు.

## రూఫ్‌టాప్ సోలార్‌పై చౌటుప్పల్ విద్యుత్ డిఈ కార్యాలయంలో వినియోగదారులకు అవగాహన సదస్సు

**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 03:** మప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనలో సొంతంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి, వినియోగంచుకోవడంతోపాటు ఆదాయాన్ని పొందాలని విద్యుత్ టీజీఎస్పీడీసీఎల్ చౌటుప్పల్ డీఈ మల్లికార్జున్ సూచించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనలో భాగంగా శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని తంగల్‌పల్లి రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయం, వినియోగదారుల సేవా కేంద్రం, డీఈ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ, బ్యాంకు ఆర్థిక సహాయం, సోలార్ ఏర్పాటు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏడి పద్మ, ఏ ఈ సతీష్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, కెనరా బ్యాంకు, ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్లతో పాటు, సోలార్ వెండర్లు అవ్వరు సోలార్ ఎనర్జీ సిస్టం ప్రతినిధి అవ్వారు చేతన్‌కుమార్, నేచర్ సోలార్ సిస్టం ప్రతినిధి చిప్పలపల్లి విన్ను, నేతిగర్ రెన్యువల్స్ ప్రతినిధి సతీష్, సి.ఆర్ ఎనర్జీ ప్రతినిధి పబ్బు అనురాగ్, ట్రూజోన్ సోలార్ ప్రతినిధి శ్యామ్ కుమార్, పాల్గొన్నారు.

## అంగన్వాడీలో పోషకాహార అవగాహన కార్యక్రమం

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 03:**
కరీంనగర్ పట్టణం అశోక్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవంలో భాగంగా శనివారం రోజున పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రామ్ సందర్భంగా వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల ప్రదర్శన ఏర్పాటు చేసి, పోషకాహారంపై అవగాహన కల్పించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలనిఐసిడిఎస్ సూపర్వైజర్ రేణుక కోరారు. ఈ

కార్యక్రమంలో కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి వెంకటరమణ , అంగన్వాడీ టీచర్ జమీన, తల్లులు, ఏఎన్ఎం స్వరూప, ఆశ, ఆయా తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం

**అధ్యక్షత వహించిన ఎంఈఓ బాల్ రాజు**

**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 3:**
మండల కేంద్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల స్థాయి సమావేశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ బాల్ రాజు మాట్లాడుతూ అన్ని పాఠశాలలలో సమ్మేటివ్ అసైన్మెంట్-1 (SA-1) ఎగ్జామ్స్ జరుగుతున్నందున పిల్లలందరూ కూడా 100% హాజరై ఎగ్జామ్స్ ను మంచిగా

రాసే విధంగా చూడాలని మరియు అన్ని పాఠశాలల్లో విద్యార్థుల మరియు ఉపాధ్యాయుల అటెండెన్స్ను రోజు తప్పనిసరిగా తీసుకునేటట్లు చూడాలని చెప్పారు. ఎగ్జామ్స్ కంప్లీట్ కాగానే పిల్లలందరి మార్కులను ఆన్లైన్లో ఎంట్రీ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలితా దేవి, మండల ఆర్పీలు రమేష్, మహిపాల్, నవాజుద్దీన్, మల్లేశం, అన్ని పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు , సిఆర్పిలు పాల్గొన్నారు.

## మండల స్థాయిలో ఏర్పాటు చేసిన ఎక్స్టర్నల్ ఎవల్యూషన్ సెంటర్

**ఎవల్యూషన్ సెంటర్ను ఓపెన్ చేసిన మండల విద్యాధికారి బాల్ రాజు**

**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 3:**
విద్యాశాఖ ఆదేశానుసారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎక్స్టర్నల్ ఎవల్యూషన్ సెంటర్ ను మండల విద్యాధికారి బాల్ రాజు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ కు మండలంలోని అన్ని ఉన్నత, రెసిడెన్షియల్ పాఠశాలలలో చదువుతున్న 9వ తరగతి పిల్లల సమ్మేటివ్ అసెస్మెంట్ (SA -1) పేపర్లను ఎగ్జామ్స్ ముగియగానే వాటిని సీల్ చేసి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎవల్యూషన్ సెంటర్కు పంపించాలని వాటిని మండలంలోని ఆ ఆ సబ్జెక్టు ఉపాధ్యాయులు అందరూ కలిసి ఒకరి స్కూల్ పేపర్లను వేరొక

స్కూలు ఉపాధ్యాయులచే ఎవల్యూషన్ చేయించడం జరుగుతుందని తెలిపారు. వీటిని మండల స్థాయిలో మూడు నుండి ఐదు రోజుల మధ్యలో ఎవల్యూషన్ చేయించి మార్కులను వెంటనే ఆన్లైన్ చేయించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఎవల్యూషన్ ప్రక్రియ అంతా కూడా చాలా పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆ ఆ సబ్జెక్టుల ఉపాధ్యాయులు, ఎవల్యూటర్స్ పాల్గొన్నారు.

## సంతోషిమాత ఆలయంపై దాడిని తీవ్రంగా ఖండించిన బీజేపీ

- **నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి...**
- **బీజేపీ న్యాల్కల్ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్...**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 03:**
దిల్సుఖ్నగర్లోని సంతోషిమాత ఆలయంపై దాడి జరిగినట్లు వస్తున్న వార్తలను సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్ మండల బీజేపీ అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సాయంత్రం న్యాల్కల్ మండలం గంగ్వార్ చౌరస్తా వద్ద ఆయన ఈ ఘటనపై స్పందించారు. ఈ సందర్భంగా మల్లేష్ గంగ్వార్ మాట్లాడుతూ.. ఆలయంపై దాడి ఘటన భక్తుల మనోభావాలను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆలయాలపై దాడులు, ప్రజల మత విశ్వాసాలను కించపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని అన్నారు. ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన వారిని ఆధారాలతో గుర్తించి, సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. నిందితులకు న్యాయస్థానం ద్వారా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను డిమాండ్ చేశారు. అలాగే ఆలయానికి, భక్తులకు తగిన భద్రత కల్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మతపరమైన ప్రదేశాల వద్ద పోలీసు భద్రతను పెంచాలని కోరారు. మతపరమైన ప్రదేశాలపై దాడులను ప్రభుత్వం, పోలీసు శాఖ తీవ్రంగా పరిగణించాలని మల్లేష్ గంగ్వార్ అన్నారు. ప్రజలు ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా శాంతియుతంగా నిరసన తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సీఎం , డిప్యూటీ సీఎంకు ఉద్యోగుల కృతజ్ఞతలు

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 03:**
క్యాబినెట్ మీటింగ్ లో ఉద్యోగులు రావలసిన రెండు డిఎ ను ఆమోదం తెలిపినందుకు గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారిని. మరియు ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారికి టీజీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంబి కృష్ణ యాదవ్. కార్యదర్శి ఏమే ఖాదర్ కృతజ్ఞతలు తెలిపారు

# కరీంనగర్ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 03:**
కరీంనగర్ నగరపాలక సంస్థను తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు తమ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.

29వ డివిజన్ కిసాన్ నగర్, మింగని వాడ ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్తో కలిసి యూఐడీఎఫ్ నిధులు రూ.70 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. 28, 29వ డివిజన్ల పరిధిలోని హనుమాన్ దేవాలయం సమీపంలోలి15వ ఆర్థిక సంఘం నిధులు రూ.56 లక్షలతో ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా కోసం చేపట్టనున్న మంచినీటి పైప్లైన్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ

నగరంలోని ప్రతి డివిజన్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు.నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ప్రజాప్రతినిధులు--అధికారుల సమన్వయంతో కరీంనగర్ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు కార్పొరేటర్లు ఏపీపీ చంద్ర, గాజా రమా శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో ఘనంగా ఆరుద్రాష్టమి వ్రతం

- **వ్రత క్రతువుకు హాజరైన జగ్గారెడ్డి,నిర్మలా జగ్గారెడ్డి**
- **2700 మంది మహిళలతో సామూహిక వ్రతం**

**సంగారెడ్డి, వెలుతురు,అక్టోబర్ 03**
సంగారెడ్డి జిల్లా ఫసల్వాడిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో పీఠాధిపతి మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణ లో ఆరుద్రాష్టమి వ్రత క్రతువు కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొన్నారు. అరుద్రాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. 2700 మంది మహిళలతో సామూహిక

ఆరుద్రాష్టమి వ్రతాన్ని నిర్వహించారు. నిర్మలా జగ్గారెడ్డి సైతం ఈ వ్రతం లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆరుద్రాష్టమి మహత్యం, అమ్మవారి విశిష్టత, పూజా విధానాలను నిర్వాహకులు భక్తులకు వివరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఫసల్వాది జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగేరి శ్రీహరి, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు

## 365 రోజులు రోడ్డుపైనే మురికి.. మున్సిపల్ కార్యాలయం ఉన్నది దేనికి?

- **వందకు పైగా పారిశుద్ధ్య కార్మికులున్నా పట్టించుకోరా?**
- **మురుగు నీరు, చెత్తకుప్పలతో ప్రజలకు తప్పని అవస్థలు**
- **అధికారులూ, ప్రజాప్రతినిధులూ ప్రతిరోజూ చూస్తున్నా చర్యలు శూన్యం...**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 03:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితులు రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నాయని జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి. రాములు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై మురుగునీరు నిలిచిపోవడం, చెత్తకుప్పలు పేరుకుపోవడం, మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు .పట్టణంలోని మోహన్ థియేటర్ సమీపంలో ప్రతిరోజూ కనిపిస్తున్న పారిశుద్ధ్య దుస్థితిని ఆయన ఉదాహరణగా చూపించారు. రహదారిపై మురుగునీరు నిలిచిపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, మురికిని తప్పించుకునే క్రమంలో కొన్నిసార్లు ప్రమాదాలకు గురై గాయపడుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీలో వందకు పైగా పారిశుద్ధ్య కార్మికులు ఉన్నప్పటికీ పట్టణంలో అనేక ప్రాంతాల్లో చెత్తకుప్పలు, చితు కాగితాలు, వీధి పశువులు, వీధి కుక్కలు కనిపిస్తున్నాయని రాములు విమర్శించారు. మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దోమల సమస్య పెరిగిందని, దీనివల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధుల భయం ప్రజలను

వెంటాడుతోందన్నారు. ముఖ్యంగా చిన్నారులు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు.
మోహన్ థియేటర్ సమీపంలోని ఈ పరిస్థితిని వార్డు సభ్యుల నుంచి ఎమ్మెల్యే వరకు, మున్సిపల్ సిబ్బంది నుంచి కమిషనర్ వరకు అనేకమంది ప్రతిరోజూ చూస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. పట్టణంలో కోట్ల రూపాయల జనరల్ ఫండ్ నిధులు ఉన్నప్పటికీ కనీస పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించలేకపోవడం ఆందోళనకరమన్నారు. ఈ మార్గం గుండా విద్యార్థులు, ఉపాధ్యాయులు, కళాశాల సిబ్బంది, ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని, దుర్వాసనతో పాటు అనారోగ్య పరిస్థితులను వారు భరిస్తున్నారని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రోడ్లపై నిలిచిన మురుగునీటిని తొలగించి, మురుగు కాలువలను శుభ్రం చేసి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టాలని జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి. రాములు కోరారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఘన సన్మానం

**మూడేళ్ల పదవీకాలం పూర్తి సందర్భంగా**

**అభినందన సభ. సావనీర్ పుస్తక ఆవిష్కరణ**

**బషీర్ బాగ్ : అక్టోబర్ 03 ( వెలుతురు )**
ఎస్సీ, ఎస్టీ ల ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ప్రధాన భూమిక పోషిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో సాంఘిక సంక్షేమశాఖ కూడా తనవంతు కృషి చేస్తోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ లు ఎదుర్కుంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ గా బక్కి వెంకటయ్య మూడేళ్ల కాలంలో మంచి సేవలు అందించారని మంత్రి కొనియాడారు. శనివారం బషీర్ బాగ్ లోని పరిశ్రమల భవన్ లో ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో బక్కి వెంకటయ్య అభినంద సభ, సావనీర్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమానత్వం సాధనలో కమిషన్ బాధ్యతలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. బక్కి వెంకటయ్య తన మూడేళ్ల పదవీకాలంలో నిర్వహించిన సేవలను మంత్రి అభినందించారు .అణగారిన వర్గాలకు న్యాయం అందించడం, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, హక్కులపై అవగాహన కల్పించడం వంటి అంశాల్లో నిరంతర కృషి అవసరమని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ , తన హయాంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ కస్టోడియన్ గా పనిచేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ ల పై దాడుల జరిగితే కమిషన్ అండగా నిలిచిందని చెప్పారు. గతంలో పనిచేసిన కమిషన్ లకు భిన్నంగా తన సారథ్యంలో 33 జిల్లాలో పర్యటించి ఎస్సీ, ఎస్టీ ల సంక్షేమం, అభివృద్ధి, రక్షణ కై తగు చర్యలు తీసుకున్నామని, బాధితులకు మనో ధైర్యం కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి , రాంబాబు నాయిక్, కే లక్ష్మి నారాయణ, రేణుగుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్, బిఎంఐ రాష్ట్ర అధ్యక్షుడు సర్వయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణ , దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రైతు రమేష్, ఆశ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు .

## బండి సంపత్ కుమార్కి ప్రాణదాత అవార్డు ప్రధానం

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 03:**
కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన వివేకానంద డిగ్రీ , పి.జి. కళాశాల కంప్యూటర్ విభాగధిపతి , అకాడమిక్ కోఆర్డినేటర్ బండి సంపత్ కుమార్ కు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసరా ప్రాణదాత 2026 అవార్డును ప్రధానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. శ్రీనివాస్ తెలిపారు. సంపత్ కుమార్ కళాశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాలలో విద్యార్థులను రక్తదానం పట్ల ప్రోత్సహిస్తూ, తాను స్వయంగా 25 సార్లు ఆపద సమయంలో రక్తదానం చేసినందుకుగాను జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ ద్వారా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆసరా ప్రాణదాత అవార్డు గ్రహీత బండి సంపత్ కుమార్ ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్
సిహెచ్. శ్రీనివాస్, ఏవో బి. శ్రావణ్ కుమార్, కామర్స్ విభాగాధిపతి మరియు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఆర్. గోపి కృష్ణ అధ్యాపక బృందం అభినందించారు

## ఐఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొత్తూర్ సురేందర్

**నియామక పత్రాన్ని అందించిన జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి...**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 03:**
ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్టీయూసీ)ను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో పలు పదవులను భర్తీ చేశారు. ఇందులో భాగంగా

జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొత్తూర్ సురేందర్ను తెలంగాణ రాష్ట్ర ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి నియామక పత్రాన్ని అందజేశారు. నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఈ సందర్భంగా కొత్తూర్ సురేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, న్యాయ సలహాదారు జంబూల నర్సింహారెడ్డి, జాతీయ ఉపాధ్యక్షుడు మ్యాతారి ప్రవీణ్లకు కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఐఎన్టీయూసీని బలోపేతం చేస్తానన్నారు. త్వరలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## మంచి పనులే సమాజంలో పేరును నిలుపుతాయి

**బెస్త జగదాంబ ద్వితీయ వర్ధంతిలో మాజీ సర్పంచ్ రాజశేఖర్ నివాళులు...**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 03:**
మనిషి జీవితంలో మరణం తప్పదని, అయితే జీవించిన కాలంలో నలుగురికి ఉపయోగపడే మంచి పనులు చేస్తే అవే సమాజంలో చిరస్థాయిగా నిలిచిపోతాయని బీఆర్ఎస్ నాయకులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.శనివారం కోహీర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన బెస్త జగదాంబ ద్వితీయ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి మాజీ సర్పంచ్ కావంపల్లి రాజశేఖర్ జగదాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బెస్త నర్సింలు, శ్రావణి, పూజ, మహేష్, జగదాంబ, ఈశ్వరమ్మ, జగన్నాథ్, రమేష్తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 4 పీహెచ్‌సీలలో ఆకస్మిక తనిఖీ

**రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 03:** రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. స్వర్ణకుమారి గారు శనివారం రోజున జిల్లాలోని పీహెచ్‌సీ ఆరుట్ల, పీహెచ్‌సీ మాడ్గుల, పీహెచ్‌సీ ఇర్విన్ మరియు పీహెచ్‌సీ యాచారం లను ఆకస్మికంగా సందర్శించారు. ఓపి, ఐపీ రిజిస్టర్లు, మందుల నిల్వ, కోల్డ్ చైన్, ల్యాబ్ సేవలు, సిబ్బంది హాజరు, పారిశుధ్యం, ఎన్సీడీ టీబీ, ఇమ్యునైజేషన్ సేవలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలలో హెల్త్ సూపర్‌వైజర్లు, సంబంధిత పీహెచ్‌సీ ల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎం లు, ఆశా మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతులు లేకున్నా పాఠశాలలు నడుపుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

**బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 03:** వేలకు వేల రూపాయలు ఫీజులు దండుకుంటూ ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలు నడుపుతున్న యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ విద్యాశాఖ అధికారులను కోరారు.ఒక స్కూలుకు మాత్రమే అనుమతి తీసుకుని నాలుగైదు బ్రాంచీలు గ్రామర్ టెక్నో ఈ టెక్నో ఒలంపియాడ్ అనే పేరుతో విచ్చలవిడిగా పుట్టగొడుగుల వ్యాపిస్తూ తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని హైదరాబాద్ లాంటి మహానగరంలో ఇలాంటి మోసాలు ఎక్కువ జరుగుతున్నాయని మండల విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్ర విడనాడి కఠినంగా వ్యవహరించాలని లింగం గౌడ్ అన్నారు

# కుట్టేదెప్పుడు.. ఇచ్చేదెప్పుడు?

- స్కూల్ యూనిఫాం పంపిణీలో జాప్యం
- నెలలు గడిచినా అందని రెండో జత దుస్తులు
- పాత బట్టలతోనే పాఠశాలలకు విద్యార్థులు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 03** పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ ఈ ఏడాది పూర్తిగా గాడి తప్పింది. విద్యా సంవత్సరం మొదలై నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు దుస్తులు కుట్టే పనులు పూర్తి కాకపోవడం గమనార్హం. వెంకటాపూర్ మండల వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటివరకు విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫాంలు అందలేదు. కొన్ని స్కూళ్లలో మొక్కుబడిగా ఒక జత చొప్పున ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అందులోనూ కొలతల్లో తేడా ఉండటంతో ఆ ఒక్క జత కూడా విద్యార్థులకు ఉపయోగ పడటం లేదు. కొలతలు తీసుకోవడంలో జరిగిన జాప్యం, కుట్టు పనులు నత్తనడకన సాగుతుండటంతో విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో పాత, చినిగిన బట్టలతోనే బడికి వెళ్తున్నారు.

**డిజైన్ల మార్పుతో ఆలస్యమవుతున్న సరఫరా**

ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం యూనిఫాం రంగులు, డిజైన్లలో మార్పులు చేసింది. బాలురకు లేత నీలం చొక్కా, ముదురు నీలం నిక్కరు లేదా ప్యాంటు, అదేవిధంగా బాలికలకు లేత నీలం టాప్, ముదురు నీలం బాటమ్, సల్వార్ కమీజ్ తో పాటు తరగతుల వారీగా వేస్ట్ కోట్లను అందించాలని నిర్ణయించింది. అయితే డిజైన్ ఖరారైనప్పటికీ, క్లాత్ సరఫరా ఆలస్యం కావడంతో పూర్తిస్థాయిలో యూనిఫాంలు ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. మహిళా సంఘాలకు వస్త్రాలను అందజేసినా, కుట్టు పనులు పూర్తయిన తర్వాత కూడా పాఠశాలలకు సకాలంలో చేరడం లేదు. అధికారులు మాత్రం రెండో జత దుస్తులు ఈ నెలాఖరులోగా పంపిణీ చేస్తామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ఆ హామీ అమలుకు నోచుకోవడం లేదు.

**నాణ్యతలేమి కుట్లతో ఊడిపోతున్న గుండీలు**

ఇప్పటివరకు పంపిణీ చేసిన దుస్తుల నాణ్యత అధ్వాన్నంగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుట్టు సరిగా లేకపోవడంతో గుండీలు ఊడిపోతున్నాయి. దుస్తుల కొలతలు సరిగా లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మహిళా సంఘాలను ప్రశ్నిస్తే ప్రభుత్వం ఇస్తున్న రూ. 60 కూలీకి ఇలా కాకుండా ఇంకెలా కుడతారని సమాధానం ఇస్తుండటం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి దసరా లోగా దుస్తుల పంపిణీ పూర్తి చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## మేడ్చల్-మల్కాజిగిరిలో మూడు సర్రోగసీ దరఖాస్తులకు కమిటీ ఆమోదం

- జిల్లా స్థాయి సర్రోగసీ బోర్డు సమావేశం

**మేడ్చల్, అక్టోబర్ 3(వెలుతురు):** జిల్లా సర్రోగసీ బోర్డు సమావేశంలో 'సర్రోగసీ (క్రమబద్ధీకరణ) చట్టం-2021' కింద పరిశీలనకు వచ్చిన ఐదు పిటిషన్లను అధికారులు వివరంగా సమీక్షించారు. ఇందులో అర్హత కలిగిన మూడు జంటలకు క్లినికల్, వైద్య ఆధారాల ప్రాతిపదికన 'మెడికల్ ఇండికేషన్ సర్టిఫికెట్లు' మంజూరు చేశారు.

**చట్టబద్ధత, సమగ్ర వైద్య పరిశీలన**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఐవీూ) డాక్టర్ కె. ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గర్భధారణ సంబంధిత సమస్యలు, మహిళ ఆరోగ్య పరిస్థితి, ప్రత్యామ్నాయ చికిత్సల అందుబాటును

నిపుణులు సమగ్రంగా పరిశీలించారు. సర్రోగసీ ప్రక్రియ పారదర్శకత, నైతిక ప్రమాణాలు, చట్టబద్ధతతో పాటు తల్లి మరియు శిశువు భవిష్యత్తు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకు న్నారు. ఈ సమావేశంలో స్త్రీ వైద్య నిపుణు రాలు డాక్టర్ మాధవీలత, పీడియాట్రిక్ నిపుణులు డాక్టర్ శివకిరణ్ పాల్గొని తమ సలహాలు ఇచ్చారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

అభ్యర్థుల పత్రాలు, అర్హతా ప్రమాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే ఆమోదం తెలిపినట్లు డాక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సర్రోగసీ విధానాన్ని వ్యాపారాత్మకంగా మార్చడం, దుర్వినియోగానికి పాల్పడటం లేదా ఎలాంటి అక్రమాలకు చోటు ఇవ్వడం సహించేది లేదని స్పష్టం చేశారు. చట్ట నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బోర్డు హెచ్చరించింది.

# అక్టోబర్ 14న కల్లుగీత వృత్తి - ఆధునీకరణపై రాష్ట్ర సదస్సు

**పోస్టర్ ఆవిష్కరణ: ముఖ్య అతిథి చెరుపల్లి సీతారాములు, మాజీ శాసనమండలి సభ్యులు**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 03:** కల్లుగీత కార్మిక సంఘం ఏర్పడి 69 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా హైదరాబాదులోని సుందరయ్య కళా నిలయంలో ఉత్సవాలు, వృత్తిలో ఆధునీకరణ అంశంపై రాష్ట్ర సదస్సు అక్టోబర్ 14న జరుగుతుందని. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయవలసిందిగా చెరుపల్లి సీతారాములు గీత కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శనివారం రోజున సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులు రాష్ట్రంలో 37వేల 381 మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు వీరందరికీ ఎటువంటి షరతులు లేకుండా పెన్షన్ ఇవ్వాలని, వృత్తి చేసే వారందరికీ కంఠమయ్య రక్షణ కవచం ఇవ్వాలని కోరారు.ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లు గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనాలు ఇస్తామని, వృత్తిలో ఆధునీకరణ పద్ధతులు తీసుకువస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ గారు చెప్పిన దానిని ఆచరణలో అమలు చేసి చూపాలి. చెట్ల పెంపకానికి సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, నందనం లోని నీరా తాటి ఈత ఉత్పత్తుల ప్రాజెక్టు వెంటనే ప్రారంభించాలని, పెన్షన్ 4వేలు, ఎక్స్‌గ్రేషియా పది లక్షలకు పెంచాలని, ఏజెన్సీ ఏరియాలో సొసైటీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇంకా రాష్ట్రంలోని గీత కార్మికుల సమస్యలు, వృత్తిలో ఆధునీకరణ గురించి చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు రాష్ట్ర సదస్సు 14వ తేదీన సుందరయ్య కళానిలయంలో నిర్వహిస్తున్నాము. దీనికి సొసైటీ అధ్యక్షులు, టి ఎఫ్ టి బాధ్యులు, గౌడ, గీత కార్మికులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో ఘాఖ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు,కేజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉష్ణగోని వెంకట నరసయ్య,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వర్కాల బాలరాజు గౌడ్,హైదరాబాద్ జిల్లా కన్వీనర్ కృష్ణ స్వామి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కార్యదర్శి కప్పల లింగం గౌడ్, బిసి సంఘం రాష్ట్ర నాయకులు కోలా జనార్ధన్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సురుగు రాజేష్ గౌడ్,సంఘం నాయకులు క్రాంతి,రేవంత్ గౌడ్,నవీన్,చంద్రయ్య, పొన్నం రాజయ్య పాల్గొన్నారు.

# ఆతిథ్య రంగంలో క్రికెట్ జోష్

**వెస్టిన్ చేతికి 'ఆర్పీఎల్' ట్రోఫీ**

**హైదరాబాద్, వెలుతురుఅక్టోబర్ 03 :** ప్రముఖ హాస్పిటాలిటీ విద్యా సంస్థల మధ్య క్రీడా స్ఫూర్తిని, ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో 'రీజెన్సీ కాలేజ్ ఆఫ్ కలినరీ ఆర్ట్స్ & హోటల్ మేనేజ్మెంట్' నిర్వహించిన మూడు రోజుల ఇంటర్ కాలేజియేట్ క్రికెట్ టోర్నమెంట్ 'ఆర్పీఎల్ 6.0' (రీజెన్సీ ప్రీమియర్ లీగ్) నాగోల్లోని బీఎస్ఆర్ గ్రౌండ్స్లో ఈరోజు ముగిసింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో వెస్టిన్ హోటల్ మేనేజ్మెంట్ కాలేజ్ ఛాంపియన్గా నిలిచింది. ట్రోఫీని కైవసం చేసుకుంది. అద్భుత ప్రదర్శన కనబరిచిన వెస్టిన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్కు చెందిన ఉజైర్ ఫయాజ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు కైవసం చేసుకున్నారు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు కింద హిల్టన్ హోటల్స్ నుంచి జ్ఞాపికతో పాటు లంచ్ కూపన్, 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డు కింద ఐబిస్ హోటల్ నుంచి కాంప్లిమెంటరీ బ్రేక్ఫాస్ట్తో కూడిన ఇద్దరు వ్యక్తులకు ఒక రోజు బస ఓచర్ను అందించారు. ఈ సందర్భంగా రీజెన్సీ కాలేజ్ ఆఫ్ కలినరీ ఆర్ట్స్ & హోటల్ మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ పీ రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆర్పీఎల్ 6.0 అనేది కేవలం ఒక క్రీడా టోర్నమెంట్ మాత్రమే కాదని, భవిష్యత్తు హాస్పిటాలిటీ నిపుణులలో ఐక్యత, భాగస్వామ్యం, శ్రేష్టతను ప్రతిబింబించే అద్భుత వేదిక అన్నారు. ఈ స్ఫూర్తిని కొనసాగిస్తున్నందుకు రీజెన్సీ గర్వపడుతుందన్నారు. ఐక్యత, ఉత్సాహం, నైపుణ్యాలను ఎప్పుడూ ప్రోత్సహిస్తూనే ఉంటామన్నారు. కాలేజీలోని కోర్ క్లబ్లు, చివరి సంవత్సరం విద్యార్థులు కనబరిచిన జట్టు స్ఫూర్తే ఈ ఆరో ఎడిషన్ను ఇంతటి ఘన విజయం తెచ్చి పెట్టిందన్నారు. హోటల్ మేనేజ్మెంట్ రంగానికే ఒక చిరస్మరణీయ వేడుకగా తీర్చిదిద్దాయన్నారు. ఇంకా భారీ స్థాయిలో జరగబోయే 'ఆర్పీఎల్ 7.0'లో మీ అందరికీ స్వాగతం పలకడానికి ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నామన్నారు.

## నాలుగు ఎకరాల ఆలయ భూమిని కాపాడే వరకు విశ్రమించేది లేదు

- ఒత్తిళ్లకు తలొగ్గి వెనక్కి తగ్గిన అధికారులు.. సైబరాబాద్ సీపీ సజ్జనార్‌తో మాట్లాడిన ఎంపీ
- స్థానిక నాయకులు, హిందూ బంధువుల తీవ్ర నిరసన

**వెలుతురు చింతల్మెట్ / రాజేంద్రనగర్ అక్టోబర్ 03:** చింతల్మెట్, ఉప్పరపల్లి పరిధిలోని ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీ అస్తాల ఈరన్న గుట్ట దేవస్థానానికి చెందిన కోనేరు మరియు పరిసర భూములను కొందరు మైనారిటీ నాయకులు అక్రమంగా ప్రహరీ గోడ నిర్మించి కబ్జా చేయడానికి యత్నించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ (దేవాదాయ శాఖ) సర్వే చేసి ఈ భూమి దేవాలయానికి చెందిన 4 ఎకరాల స్థలమని స్పష్టమైన ఆధారాలతో లేఖ ఇచ్చినప్పటికీ, గత కొద్ది రోజులుగా ఇక్కడ అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, శనివారం రోజున అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు మున్సిపల్, ఎమ్మార్వో మరియు జీహెచ్ఎంసీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే, సమాచారం అందుకున్న ఎంఐఎం ఎమ్మెల్యే మరియు ఇతర ప్రజాప్రతినిధులు అక్కడికి వచ్చి అధికారులపై ఒత్తిడి తెచ్చి కూల్చివేతలను అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం పని చేయాల్సిన అధికారులు, ఎంఐఎం నేతల బెదిరింపులు, ఫోన్ కాల్స్‌కు భయపడి చర్యలు తీసుకోకుండా వెనక్కి తగ్గడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అధికారుల తీరుపై ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఆగ్రహం:**

విషయం తెలిసిన వెంటనే చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి గారు, రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ గారు మరియు స్థానిక ముఖ్యాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను, కబ్జాకు గురవుతున్న కోనేరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి గారు సైబరాబాద్ సీపీ సజ్జనార్‌తో ఫోన్లో మాట్లాడి అధికారుల వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మరియు ఎమ్మెల్యే మాట్లాడుతూ "ఎండోమెంట్, జీహెచ్ఎంసీ, ఎమ్మార్వో ఇచ్చి న స్పష్టమైన నివేదికలు ఉన్నప్పటికీ, హైడ్రా (న్ణ=ూ) మరియు మున్సిపల్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వెనక్కి తగ్గడం దారుణం. ఒకప్పుడు 4 ఎకరాల విస్తీర్ణంలో అలరారిన అస్తాల ఈరన్న గుట్ట దేవాలయ భూమి, నేడు అక్రమ ఆక్రమణల వల్ల ఎకరం కూడా మిగల్లేదు. పవిత్రమైన కోనేరును కప్పివేసి అక్రమ నిర్మాణాలు చేస్తుంటే అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం ఏంటి?" అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**కార్యక్రమంలో భారీగా పాల్గొన్న నాయకులు & స్థానిక హిందూ బంధువులు:**

ఆలయ భూముల పరిరక్షణ కోసం చేపట్టిన ఈ పోరాటంలో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌లతో పాటు ప్రముఖ నాయకులు రాజ్ గోపాల్ గౌడ్, బొక్క బాల్ రెడ్డి, వై. శ్రీధర్, తోకల శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, కొమరయ్య, మల్లేష్ యాదవ్, నర్సింగ్ యాదవ్, బాబురావు, విఠల్, కృష్ణ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి ఈశ్వర్ గౌడ్, పవన్ ఇంద్రపాల్ రెడ్డి, రాజు, నరేందర్, భూపాల్, మహేందర్ గౌడ్, సురేష్ గౌడ్, సందీప్, వెంకటేశ్, విజయ్, మరియు చింతల్మెట్, ఉప్పరపల్లి ప్రాంతాలకు చెందిన స్థానిక హిందూ బంధువులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు

## బాధిత కుటుంబానికి పరామర్శ

**కేసముద్రం వెలుతురు అక్టోబర్ 03:** కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన క్రీస్తు శేషులు వంగ రామనర్సమ్మ దశ దిన కర్మ కార్యక్రమానికి కేసముద్రం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమ్మయ్య గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామనర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి బాధను పంచుకుంటూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ.. కుటుంబంలో పెద్దను కోల్పోవడం తీరని లోటని, ఆ బాధను మాటల్లో చెప్పలేమని అన్నారు. రామనర్సమ్మ కుటుంబ సభ్యులు ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని, కష్టసమయంలో కుటుంబ సభ్యులకు అండగా నిలబడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షులు నరేటి కొమురయ్య, వంగ చిన్న వెంకట్రాం నర్సయ్య, సమ్మెట వెంకన్న, నరేటి సత్తయ్య, మొగులాగని సుధాకర్, బోయిని ఉప్పలయ్య, గొర్రె వెంకన్న, పెదగాని చిన్న కోమరయ్య, రామరాజు రవీందర్, శ్రీలం రాములు, యాకన్నా, గండు పరమేష్, మెంచు వెంకన్న, వంగ సంపత్, బోయిని రమేష్, దొంతరబోయిన రమేష్, కండె నాగన్న, వల్లాల రాజేందర్, దొంతరబోయిన ఈశ్వర్, మెంచు వంశీ తదితరులు పాల్గొన్నారు..

### ప్రజల పక్షాన పనిచేసే
# జర్నలిజం అవసరం



**నల్లగొండ, వెలుతురు అక్టోబర్ 3:** ప్రజల పక్షాన పనిచేసే జర్నలిజం వ్యవస్థ అవసరమని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి అన్నారు. జర్నలిస్టులు వృత్తి గౌరవాన్ని కాపాడేలా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సామాజిక మాధ్యమాలపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని మెరుగైన జర్నలిజాన్ని ప్రజలకు అందించడంతో పాటు, జర్నలిస్టుల వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఏఐ, సోషల్ మీడియా ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, నల్లగొండ డివిజన్ పరిధిలోని జర్నలిస్టుల కోసం ఈ వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 12న నాగార్జునసాగర్‌లో పరిసర ప్రాంతాల జర్నలిస్టులకు ఏఐ, సోషల్ మీడియాపై శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం జర్నలిజంపై ఏఐ, సోషల్ మీడియా ప్రభావం గణనీయంగా ఉందని, వాటిని బాధ్యతాయుతంగా, సక్రమంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పత్రికా స్వేచ్ఛ, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్, డిజిటల్ మీడియా విస్తృతార్థాలు, వర్కింగ్ జర్నలిస్టుల విధులు, జర్నలిస్టులు తెలుసుకోవాల్సిన ప్రధాన చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఏఐ వచ్చిన తర్వాత ప్రతి పౌరుడు జర్నలిస్టులా వ్యవహరించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి సమయంలో వార్తల్లో నిజం, అబద్ధాన్ని గుర్తించి ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. ఏఐ, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన జర్నలిస్టులకు మరింత అవసరమని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో ఏఐపై టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటర్ ఇన్వెస్టిగేషన్ ఉడుముల సుధాకర్ రెడ్డి, సోషల్ మీడియాపై నరసింహస్వామి జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చారు.

# ఫోన్ లేకుంటే ఆగమాగం!

- పిల్లల నుంచి పెద్దలదాకా 'నోమోఫోబియా'.. రోజుకు ఐదారు గంటలు ఫోన్‌తోనే
- ఫోన్ కనిపించకపోయినా.. బ్యాటరీ అయిపోయినా టెన్షన్
- మితిమీరితే ఆందోళన, ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 03:** ఒకప్పుడు నిద్రలేవగానే దేవుడి పటమో.. లేదంటే అమ్మానాన్నల ముఖమో చూసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కళ్లు తెరిచిన వెంటనే చేతికి మొబైల్ రావాల్సిందే. ఉదయం లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకు ఫోన్ చేతిలో ఉండాల్సిందే. బ్రష్ చేస్తున్నా.. భోజనం చేస్తున్నా.. ప్రయాణిస్తున్నా.. చివరికి నిద్రకు ఉపక్రమించే సమయంలోనూ ఫోన్ చూడటం చాలామందికి నిత్యకృత్యంగా మారింది. ఫోన్ కాసేపు కనిపించకపోతేనే ఆందోళన. బ్యాటరీ ఛార్జింగ్ అయిపోతున్నా టెన్షన్. ఇంటర్నెట్ కొన్ని నిమిషాలు నిలిచిపోయినా అసహనం. మెసేజ్ వచ్చిందా? నోటిఫికేషన్ ఏదైనా మిస్ అయ్యిందా? అంటూ పదేపదే స్క్రీన్ చెక్ చేయడం. ఈ తరహా భయాన్ని, ఆందోళనను నోమోఫోబియా'గా నిపుణులు పేర్కొంటున్నారు.

**పిల్లల నుంచి పెద్దల వరకు..**

స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరుగుతున్న కొద్దీ ఈ సమస్య వయసుతో సంబంధం లేకుండా కనిపిస్తోందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, యువతలో సోషల్ మీడియా, గేమ్స్, షార్ట్ వీడియోలు, చాటింగ్ వంటి వాటి కారణంగా ఫోన్ వినియోగ సమయం పెరుగుతోంది. పెద్దల్లోనూ వాట్సాప్, యూట్యూబ్, వార్తలు, ఆన్‌లైన్ లావాదేవీలు తదితర అవసరాల పేరుతో ఫోన్ వినియోగం అధికమవుతోంది.

**రోజుకు ఐదారు గంటలు ఫోన్‌తోనే..**

డిజిటల్ వినియోగం పెరగడంతో స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు అవసరమైన సాధనం నుంచి నిత్యజీవితంలో విడదీయలేని వస్తువుగా మారింది. చాలామంది రోజులో ఐదారు గంటలు లేదా అంతకంటే ఎక్కువ సమయం ఫోన్ స్క్రీన్‌పైనే గడుపుతున్నారు. అవసరానికి మించి వినియోగిస్తూ.. మధ్యలో కొద్దిసేపు కూడా ఫోన్‌కు దూరంగా ఉండలేకపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది.

**ఫోన్ కనిపించకపోతే టెన్షన్..**

ఫోన్ ఎక్కడ పెట్టామో గుర్తు రాకపోతే వెంటనే వెతకడం, ఫోన్ ఇంట్లోనే ఉన్నప్పటికీ పదేపదే చెక్ చేయడం, ఛార్జర్ లేకపోతే అసహనానికి గురికావడం, నెట్‌వర్క్ లేకపోతే చిరాకు పడటం వంటి లక్షణాలు కొందరిలో కనిపిస్తున్నాయి. ఫోన్‌కు దూరంగా ఉన్న సమయంలో అ సహనం, ఆందో ళన పెరిగితే అది అలవాటును మించి సమస్యగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఆరోగ్యంపై ప్రభావం**

మొబైల్ వినియోగం మితిమీరితే నిద్రకు భంగం కలగడం, కళ్లపై ఒత్తిడి, మెడ--భుజాల నొప్పులు, ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. రాత్రివేళల్లో ఎక్కువసేపు స్క్రీన్ చూడటం వల్ల నిద్ర సమయం తగ్గడం, ఉదయం అలసటగా ఉండటం కూడా సాధారణంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఆందోళన లేదా ఒత్తిడితో బాధపడుతున్నవారిలో అధిక ఫోన్ వినియోగం పరిస్థితిని మరింత ఇబ్బందికరంగా మార్చే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

**2008లోనే గుర్తింపు**

'నోమోఫోబియా' అనే పదం 2008లో ప్రాచుర్యంలోకి వచ్చింది. మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజల్లో కలిగే ఆందోళనపై బ్రిటన్‌లో నిర్వహించిన అధ్యయనాల నేపథ్యంలో ఈ పదాన్ని ఉపయోగించారు. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, వేగవంతమైన ఇంటర్నెట్, సోషల్ మీడియా విస్తరణతో ఫోన్ వినియోగం భారీగా పెరిగింది.

**ఫోన్‌ను పూర్తిగా వదలాల్సిన అవసరం లేదు..**

మొబైల్ ఫోన్ నేటి జీవితంలో అవసరమైన సాధనమే. అయితే అవసరానికి మించి వినియోగించకుండా పరిమితులు పెట్టుకోవడం ముఖ్యం. భోజన సమయంలో, కుటుంబ సభ్యులతో మాట్లాడే సమయంలో, చదువుకునే సమయంలో ఫోన్‌ను పక్కన పెట్టడం.. నిద్రకు ముందు స్క్రీన్ సమయాన్ని తగ్గించడం.. అవసరం లేని నోటిఫికేషన్లను ఆఫ్ చేయడం వంటి చిన్నచిన్న మార్పులు ఉపయోగపడతాయి. 'ఫోన్ మన చేతిలో ఉండాలి.. మనం ఫోన్ చేతిలో ఉండకూడదు' అనే అవగాహనతో వినియోగాన్ని నియంత్రించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలకు తల్లిదండ్రులు స్వయంగా ఆదర్శంగా నిలిచి, ఇంట్లో కొంత సమయాన్ని 'ఫోన్ ఫ్రీ టైమ్'గా పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయని చెబుతున్నారు.

## కొండాపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఐదు గ్రామాలకు బస్సు సౌకర్యం ప్రారంభం
- ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చడంతో గ్రామంలో హర్షాతిరేకాలు

**కేటీ దొడ్డి వెలుతురు అక్టోబర్ 03:** జోగులాంబ గద్వాల జిల్లా, కేటీ దొడ్డి మండల ఈకార్యక్రమానికి కేటీ దొడ్డి మండలంలోని పలువురు సర్పంచులు, ప్రజాప్రతి నిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కొండాపురం సర్పంచ్ ఎస్. పవన్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మండల అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, కొండాపురం గ్రామ ప్రజలకు పేరుపేరున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి భవిష్యత్తులోనూ ప్రతి ఒక్కరూ ఇదే విధంగా సహకరించాలని కోరారు. ఐదు గ్రామాలకు బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడం, అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల అభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడనున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మరో ముందడుగుగా నిలిచింది.

## కొండాపురంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

-ఐదు గ్రామాలకు బస్సు సౌకర్యం ప్రారంభం
-ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చడంతో గ్రామంలో హర్షాతిరేకాలు

**కేటీ దొడ్డి వెలుతురు అక్టోబర్ 03:** జోగులాంబ గద్వాల జిల్లా, కేటీ దొడ్డి మండల ఈకార్యక్రమానికి కేటీ దొడ్డి మండలంలోని పలువురు సర్పంచులు, ప్రజాప్రతి నిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కొండాపురం సర్పంచ్ ఎస్. పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మండల అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, కొండాపురం గ్రామ ప్రజలకు పేరుపేరున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి భవిష్యత్తులోనూ ప్రతి ఒక్కరూ ఇదే విధంగా సహకరించాలని కోరారు. ఐదు గ్రామాలకు బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడం, అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామాల అభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడనున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మరో ముందడుగుగా నిలిచింది.

### ఎస్ఐఆర్‌ను రద్దు చేసి
# ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలి

- ఓటు హక్కును కాపాడేందుకు ప్రజలు శాంతియుతంగా ఉద్యమించాలి
- సినీ నటుడు ప్రకాశ్ రాజ్

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 03 :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేసి, గతంలో ఉన్న ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలని నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్ ఐ ఆర్ అంశం, ప్రస్తుత రాజకీయ పరిణామాలు అనే అంశంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు మాజీ జస్టిస్ చంద్రకుమార్, సీనియర్ నాయకులు ప్రతాపరెడ్డి, తెలంగాణ డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటదాస్, తెలంగాణ డెమొక్రటిక్ ఫోరం వినాయక్ రెడ్డి తదితరులు కలిసి ఆయన మాట్లాడారు..కర్ణాటకలోని 23 జిల్లాల్లో 100 పోలింగ్ బూత్‌లను పరిశీలించి, ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న మార్పులను అధ్యయనం చేసినట్లు తెలిపారు. అర్హత ఉన్న పలువురి పేర్లు జాబితా నుంచి తొలగించబడినట్లు తమ పరిశీలనలో గుర్తించామని చెప్పారు. ఈ వివరాలను ప్రజల నుంచి సేకరించిన సమాచారంతో సహా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించే విషయంలో స్పష్టమైన విధానం, పారదర్శకత అవసరమని ఆయన అన్నారు. ఉపాధి, ఇతర కారణాలతో వలస వెళ్లిన వారు కొంతకాలం తమ నివాసంలో లేకపోతే వారి ఓటు హక్కును తొలగించడం సరికాదని అన్నారు. పేదలు, ఆదివాసీలు, మహిళలు తదితర వర్గాలు ఈ ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌కు ముందు కూడా ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతుండేదని, ఇప్పుడు చేపట్టిన ప్రత్యేక సవరణలో అర్హత కలిగిన ఓటర్లు తమ అర్హతను మళ్లీ నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రకాశ్ రాజ్ ప్రశ్నించారు. అక్రమ వలసదారుల సమస్య ఉంటే ఇంతకాలం కేంద్ర ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందో స్పష్టం చేయాలని కోరారు. 2023 నుంచి ఎన్నికల సంఘానికి సంబంధించిన కీలక ఫైళ్లన్నింటినీ సుప్రీంకోర్టు తెప్పించుకుని పరిశీలించాలని ఆయన కోరారు. ఎన్నికల సంఘం వ్యవస్థకు సంబంధించిన 2023 చట్టపరమైన మార్పులను, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు కల్పించిన న్యాయపరమైన రక్షణను కూడా పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని కూడా ప్రకాశ్ రాజ్ డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని అన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమైన ప్రాథమిక హక్కు అన్నారు. ఏ ఒక్క రాజకీయ పార్టీకి మద్దతుగా కాకుండా ప్రజల హక్కుల పరిరక్షణ కోసం శాంతియుతంగా ప్రజా ఉద్యమం సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ప్రజలు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### హౌస్‌ఫెడ్ ఎన్నికల్లో విజయం సాధించిన
# డైరెక్టర్లకు మంత్రి అభినందనలు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 3:** తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ (టీ ఎస్‌హెచ్‌ఎఫ్‌ఎల్) ఎన్నికల్లో విజయం సాధించిన నూతన డైరెక్టర్లను బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన టీ ఎస్‌హెచ్‌ఎఫ్‌ఎల్ ఎన్నికల్లో అధికార పార్టీ బలపరిచిన ప్యానెల్ విజయం సాధించడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లు ముదిగంటి శ్రీనివాస్ రెడ్డి, బ్రహ్మాండభేరి గోపరాజు, పట్లోళ్ళ శంకర్ రెడ్డి, అంకినేడు ప్రసాద్లను సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీస్ ఫెడరేషన్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీల అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం ఫెడరేషన్ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఫెడరేషన్ అభివృద్ధికి, హౌసింగ్ సొసైటీల సంక్షేమానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ప్రభుత్వ సహకారంతో ఫెడరేషన్‌ను మరింత అభివృద్ధి చేసి, కోఆపరేటివ్ హౌసింగ్ రంగానికి కొత్త దిశ చూపేలా నూతన డైరెక్టర్లు కృషి చేయాలని కోరారు. తాను కూడా కోఆపరేటివ్ రంగం నుంచి తన రాజకీయ ప్రస్థానం కొనసాగి ఎంపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగానని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సహకార సమాఖ్యలను బలోపేతం చేయడం ద్వారా సభ్యులకు మరిన్ని ప్రయోజనాలు అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ పాల్గొన్నారు.

# విద్యార్థిని అభినందించిన సంక్షేమ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబర్ 03(వెలుతురు):** సంకల్పం.. క్రమశిక్షణ.. పట్టుదల ఉంటే ఎంతటి ఎత్తయిన లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని తెలంగాణ గిరిజన గురుకుల విద్యార్థి ఇస్లావత్ బన్నీ నిరూపించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని 6,027 మీటర్ల (19,774 అడుగుల) ఎత్తైన మౌంట్ తరంగ్-2 శిఖరాన్ని అధిరోహించి చారిత్రక ఘనత సాధించారు. తెలంగాణగిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల), కామారెడ్డిలో బీకాం చివరి సంవత్సరం చదువుతున్న బన్నీ ఈ నెల 22న అధిరోహించారు. సెప్టెంబరు 30న తిరిగి తిరిగి సురక్షితంగా వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శనివారం సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ..బన్నీని శాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థి సాధించిన ఘనతను మంత్రి ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "బన్నీ సాధించిన విజయం ఒక్క విద్యార్థి విజయమే కాదు.. తెలంగాణలోని ప్రతి గురుకుల విద్యార్థికి స్ఫూర్తినిచ్చే ఘనత. చదువుతో పాటు క్రీడలు, సాహస క్రీడలు, ఇతర రంగాల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకోవాలి. లక్ష్యం ఎంత ఎత్తులో ఉన్నా దాన్ని చేరుకోవాలనే పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఉంటే విజయాన్ని సాధించవచ్చు" అని అన్నారు. "ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు వెనక్కి తగ్గకుండా ముందుకు సాగడమే నిజమైన క్రీడాస్ఫూర్తి. గెలుపు మాత్రమే కాదు.. సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే మనస్తత్వాన్ని కూడా క్రీడలు, సాహస కార్యక్రమాలు పెంపొందిస్తాయి. బన్నీ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది గురుకుల విద్యార్థులు క్రీడలు, సాహస రంగాల్లో ముందుకు రావాలి" అని మంత్రి ఆకాంక్షించారు. గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం, గురుకుల సంస్థలు అవసరమైన ప్రోత్సాహాన్ని అందిస్తాయని మంత్రి తెలిపారు. "మన విద్యార్థులు చదువులోనే కాదు.. క్రీడలు, సాహస కార్యక్రమాలు, పరిశోధన, కళలు తదితర అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకునేలా అవకాశాలు కల్పించాలి. ఒక విద్యార్థి విజయం మరెంతో మంది విద్యార్థులకు దారిచూపాలి" అని పేర్కొన్నారు. మౌంట్ తరంగ్-2 శిఖరం సముద్రమట్టానికి 6,027 మీటర్ల ఎత్తులో ఉంది. అత్యంత క్లిష్టమైన పర్వతారోహణలో పాల్గొన్న భారతీయ బృందంలో బన్నీ భాగస్వామిగా నిలిచారు. సెప్టెంబరు 22న శిఖరాన్ని అధిరోహించి భారతీయ పర్వతారోహణ రంగంలో తనదైన ముద్ర వేశారు. సొసైటీ కార్యదర్శి కె. సీతాలక్ష్మి బన్నీని అభినందిస్తూ.. మౌంట్ తరంగ్-2ను అధిరోహించిన తొలి భారతీయ బృందంలో బన్నీ భాగస్వామిగా నిలవడం గిరిజన గురుకుల సొసైటీకి గర్వకారణమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా, సాహస ప్రతిభను వెలికితీసేందుకు సొసైటీ నుంచి అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందిస్తామని తెలిపారు. బన్నీ విజయంపై అధికారులు, కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సాహస స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు కార్యదర్శి నటరాజ్, జాయింట్ సెక్రటరీ డి.ఎస్. వెంకన్న, డిప్యూటీ సెక్రటరీలు వేణుగోపాల్‌రావు, సూర్యప్రకాశ్‌రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ రవి కుమార్ తదితరులు బన్నీని అభినందించారు.

## చిన్న వయసులో
# అరుదైన వరల్డ్ రికార్డ్

- 6వేల మీటర్ల ఎత్తైన పర్వతాన్ని అధిరోహించిన తొమ్మిదేళ్ల బాలుడు
- లాహౌల్-స్పితిలోని మౌంట్ యూనమ్‌ను విజయవంతంగా అధిరోహించిన విహాన్
- ఆక్సిజన్ కొరత, తీవ్ర చలి, ఉప్పొంగిన నదిని దాటుతూ సాహసం

**షిమ్లా, వెలుతురు అక్టోబర్ 03 :** తొమ్మిదేళ్ల బాలుడు అరుదైన ఘనత సాధించాడు. హిమాచల్ ప్రదేశ్‌లోని 6,111 మీటర్ల ఎత్తున్న మౌంట్ యూనమ్‌ను విజయవంతంగా అధిరోహించాడు. లాహౌల్-స్పితి ప్రాంతంలో ఉన్న ఆ పర్వతాన్ని అధిరోహించేందుకు విహాన్ ఎంతో కఠినమైన శిక్షణ తీసుకున్నాడు. పర్వతంపైకి వెళ్లే కొద్దీ ఎదురైన ఆక్సిజన్ కొరత, అలసట, తీవ్రమైన చలి, నది ప్రవాహం వంటి సవాళ్లను అధిగమించాడు. ఆ ఘనతతో 6,000 మీటర్లకు పైగా ఎత్తున్న శిఖరాన్ని అధిరోహించిన ప్రపంచంలోని రెండో అతి చిన్న బాలుడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు.

**తల్లిదండ్రుల నుంచే ట్రెక్కింగ్‌పై ఆసక్తి**

గుజరాత్‌లోని జామ్నగర్ జిల్లాలో ప్రభుత్వ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఉమేశ్ చేతరియా దంతవైద్యుడిగా పనిచేస్తున్నారు. ఆయనకు, ఆయన భార్యకు ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టం. దీంతో ఆ ఆసక్తిని తమ కుమారుడు విహాన్‌కు కూడా పరిచయం చేశారు. చిన్నతనం నుంచే తల్లిదండ్రులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లడం ప్రారంభించిన విహాన్, ఆ అనుభవాలను ఎంతగానో ఆస్వాదించేవాడని ఉమేశ్ తెలిపారు. విహాన్ తొలిసారిగా తన తండ్రితో కలిసి హంప్టా పాస్ ట్రెక్కింగ్ చేశాడు. ఆ ప్రయాణం అతడికి ఎంతో నచ్చింది. ట్రెక్కింగ్ అనుభవం బాగా నచ్చడంతో మరిన్ని పర్వతాలను అధిరోహించాలని తన తండ్రిని కోరాడు. కుమారుడికి పర్వతారోహణపై ఉన్న ఆసక్తిని గమనించిన ఉమేశ్ అతడిని మరింత ఎత్తైన ప్రాంతాలకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు.

**5 వేల మీటర్ల ఎత్తులో ఫ్రెండ్షిప్ పీక్**

మొదటగా విహాన్‌ను 5,000 మీటర్ల ఎత్తులో ఉన్న ఫ్రెండ్షిప్ పీక్‌కు తీసుకెళ్లారు. విహాన్ ఆ పర్వతాన్ని కూడా విజయవంతంగా అధిరోహించాడు. దీంతో అతడిలో మరింత ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆ తర్వాత 6,111 మీటర్ల ఎత్తున్న మౌంట్ యూనమ్ ను అధిరోహించేందుకు సన్నాహాలు ప్రారంభించాడు. యూనమ్ పర్వతారోహణ సాధారణ ట్రెక్కింగ్‌కు భిన్నంగా సవాలుతో కూడుకున్నది. ఎత్తు పెరిగే కొద్దీ ఆక్సిజన్ స్థాయిలు తగ్గుతాయి. దీంతో శరీరంపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు విహాన్ ముందుగానే కఠినమైన శిక్షణ తీసుకున్నాడు. ప్రతిరోజు జిమ్‌కు వెళ్లడంతో పాటు పర్వతారోహణకు అవసరమైన శారీరక సాధన చేశాడని అతడి తండ్రి ఉమేశ్ తెలిపారు.

**ఎత్తుకు వెళ్లేకొద్దీ ఆక్సిజన్ కొరత**

మౌంట్ యూనమ్‌ను అధిరోహించే సమయంలో ఎదురైన అనుభవాలను విహాన్ పంచుకున్నాడు. పర్వతంపైకి వెళ్లేకొద్దీ ఆక్సిజన్ స్థాయిలు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపాడు. ఆక్సిజన్ కొరత కారణంగా కొద్దిదూరం నడిచిన తర్వాతే అలసట వచ్చేదని చెప్పాడు. దీంతో వేగంగా నడవడం సాధ్యం కాలేదని, చాలా నెమ్మదిగా ముందుకు సాగాల్సి వచ్చిందని వివరించాడు. ఎత్తు పెరిగేకొద్దీ ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ ప్రయాణాన్ని కొనసాగించాడని తెలిపాడు. పర్వతాన్ని అధిరోహించే సమయంలోనే కాకుండా కిందికి దిగుతున్న సమయంలోనూ అతడికి మరో సవాలు ఎదురైందని చెప్పాడు.

# ఉపాధి లక్ష్యమే ఉన్నత విద్య పరమార్ధం కావాలి

**హైదరాబాద్, అక్టోబర్ 03(వెలుతురు):** తరగతి గదికి, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యా సంస్థలకు పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థ యువతలో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాకుండా, వారిలో నైపుణ్యాలను అందించేలా వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపేలా సిద్ధం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) ఆధ్వర్యంలో శనివారం కుకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన 'రీచ్--2026' (రిసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ అడ్వాన్స్‌మెంట్) సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తరగతి గది నుంచి భవిష్యత్ కెరీర్ వైపు, విద్య నుంచి నైపుణ్యాల వైపు, పరిశోధన నుంచి పారిశ్రామిక రంగానికి నిరంతర అనుసంధానం ఉండాలని మంత్రి పేర్కొన్నారు. మన విద్యా వ్యవస్థ కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు అందించే విధానం నుంచి, విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించే దిశగా మారాలన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థి ఉద్యోగానికి అర్హత సాధించాలని, పట్టా చేతికి వచ్చే సమయానికే ఆ స్థాయి సన్నద్ధత ఉండాలని పునరుద్ఘాటించారు. విద్యార్థులు, పరిశోధకులు తమ ఆలోచనలను స్టార్టప్‌లుగా, నూతన ఉత్పత్తులుగా మలచడానికి వీలుగా ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కరికులమ్ రూపకల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్ట్‌లు, పరిశోధనల్లో పరిశ్రమలు భాగస్వామ్యమవ్వాలని విజ్ఞప్తి చేశారు. "ఒక చేతిలో డిగ్రీ.. మరో చేతిలో నైపుణ్యం" ఉండటమే ప్రామాణికం కావాలన్నారు.

## వాయుసేనకు ప్రతి ఏటా
# 36- 40 విమానాలు అవసరం

- ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్
- ఫైటర్ స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గిపోవడంపై ఆందోళన
- దేశ సైనిక బలం విషయంలో వాయుసేన చాలా కీలకమని వెల్లడి
- ఏఐ ద్వారా ఎయిర్‌ఫోర్స్‌ను బలోపేతం చేస్తామని ప్రకటన

**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 03 :** సైనిక బలం విషయంలో వాయుసేన చాలా కీలకమని భారత వైమానికదళ అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ తెలిపారు. దేశానికి ప్రతి ఏటా 36-40 విమానాలు అవసరమని అన్నారు. ప్రణాళిక ప్రకారం పనులు జరిగితే ఈ ఆర్థిక సంవత్సరంలోనే మల్టీరోల్ ఫైటర్ జెట్ ఒప్పందం ఖరారు కావొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ధరల చర్చలు, ఇతర కీలక అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని వివరించారు. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రోగ్రామ్‌లో జాప్యం జరిగితే వైమానిక దళం మరో ప్లాట్‌ఫామ్‌ను కొనుగోలు చేయాల్సి రావొచ్చని అభిప్రాయపడ్డారు. దిల్లీలో జరిగిన ఐఏఎఫ్ వార్షిక మీడియా సమావేశంలో ఏపీ ఏపీ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**స్మిత్ మచ్చర్‌పై ప్రశంసలు**

ఫ్లైదుబాయ్ హీరో కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై ఏపీ సింగ్ ప్రశంసలు కురిపించారు. విమానంలో స్మిత్ మచ్చర్ అసాధారణమైన శారీరక, మానసిక ధైర్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. ప్రత్యేక డ్రోన్ దళాన్ని ఏర్పాటు చేయాలని తాము ఇంకా నిర్ణయించలేదని ప్రకటించారు. భారత వైమానిక దళం విషయంలో డ్రోన్లు అనేవి విప్లవాత్మక మార్పును తెచ్చేవి కావని, అవి క్రమంగా జరుగుతున్న పరిణామంలో భాగం మాత్రమేనని చెప్పారు. తాము డ్రోన్లు, లోయిటరింగ్ మ్యునిషన్స్ (లక్ష్యం వద్ద వేచి ఉండి దాడి చేయగల ఆయుధాలు) సంఖ్యను వైమానిక దళంలో పెంచుతున్నామని వివరించారు. వీటికి ప్రత్యేకమైన డ్రోన్ దళం అవసరమని తాను భావించడం లేదన్నారు. ఆధునిక సైనిక కార్యకలాపాల్లో మానవ రహిత వైమానిక వ్యవస్థలు, లోయిటరింగ్ మ్యునిషన్స్ వినియోగం పెరుగుతున్న తరుణంలో ఐఏఎఫ్ చీఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# మమతా బెనర్జీకి మరో షాక్

- రెండు పార్లమెంటరీ కమిటీల చైర్మన్ పదవులను కోల్పోయిన టీఎంసీ
- వారి స్థానంలో బీజేపీ, తృణమూల్ తిరుగుబాటు ఎంపీకి బాధ్యతలు
- మమత నేతృత్వంలోని టీఎంసీకి వరుస ఎదురుదెబ్బలు

**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 03 :** బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. పార్టీలో చీలిక, అగ్రనేతలపై దాడులు, అలాగే కీలక నేతల రాజీనామాలతో సతమతమవుతున్న తృణమూల్‌కు తాజాగా మరో ఎదురుదెబ్బ తగిలింది. రెండు కీలక పార్లమెంటరీ కమిటీల చైర్మన్ పదవులను తృణమూల్ కాంగ్రెస్ కోల్పోయింది. రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం నాడు వివిధ శాఖలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను పునర్వ్యవస్థీకరించడంతో ఈ ఎదురుదెబ్బ మమతా పార్టీకి తగిలింది. వాణిజ్య వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ చైర్మన్‌గా టీఎంసీకి చెందిన డోలా సేన్ స్థానంలో బీజేపీ నేత సుధాన్షు త్రివేది నియమితులయ్యారు. అలాగే రసాయనాలు, ఎరువుల కమిటీ చైర్మన్‌గా టీఎంసీలోని అసమ్మతి వర్గానికి చెందిన కకోలి ఘోష్ దస్తీదార్ ఎంపికయ్యారు. టీఎంసీ నేత కీర్తి ఆజాద్ స్థానంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. పరిశ్రమల కమిటీకి తిరుచి శివ (డీఎంకే), ఆహారం, వినియోగదారుల వ్యవహారాలు, ప్రజా పంపిణీ కమిటీకి కె. కనిమొళి (డీఎంకే) మరోసారి చైర్మన్లుగా నియమితులయ్యారు. బీజేపీ మిత్రపక్షాలైన జేడీయూ, శివసేన, తెదేపాలకు చెందిన నాయకులు కూడా వివిధ పార్లమెంటరీ కమిటీల అధిపతులుగా కొనసాగుతున్నారు.

# ఆసియా క్రీడల్లో భారత్ పసిడి జోరు

- ఒకే రోజు క్రికెట్, హాకీ, ఆర్చరీ, గోల్ఫ్‌లో స్వర్ణాలు
- మొత్తం 21 పసిడి పతకాలతో భారత్ ఘన ప్రదర్శన

**నాగోయా, వెలుతురు అక్టోబర్ 3 :** ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు పసిడి పతకాలతో సత్తా చాటారు. పోటీల చివరి రోజు భారత్ పతకాల వేటలో దూసుకెళ్లింది. క్రికెట్, హాకీ, ఆర్చరీ, గోల్ఫ్ తదితర విభాగాల్లో స్వర్ణాలు సాధించి పతకాల సంఖ్యను గణనీయంగా పెంచుకుంది. అక్టోబర్ 3 నాటికి భారత్ మొత్తం 85 పతకాలు సాధించగా.. ఇందులో 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్య పతకాలు ఉన్నాయి.

**ఆర్చరీలో కుమ్కుమ్ మెరుపు**

మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో 17 ఏళ్ల కుమ్కుమ్ అనిల్ మొహద్ స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించింది. దక్షిణ కొరియాకు చెందిన ఓ యెజిన్‌ను షూట్‌ఆఫ్‌లో 6--5తో ఓడించి పసిడి సొంతం చేసుకుంది. ఆసియా క్రీడల్లో వ్యక్తిగత రికర్వ్‌లో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళగా నిలిచింది.

**గోల్ఫ్‌లో ప్రణవి చారిత్రక విజయం**

మహిళల వ్యక్తిగత గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్ స్వర్ణం సాధించింది. ఆసియా క్రీడల వ్యక్తిగత గోల్ఫ్‌లో స్వర్ణం గెలిచిన తొలి భారత మహిళగా రికార్డు నెలకొల్పింది. అదే సమయంలో ప్రణవి ఉర్స్, అదితి అశోక్, దీక్షా దాగర్‌లతో కూడిన భారత మహిళల జట్టు రజత పతకం సాధించింది.

**క్రికెట్‌లో పాకిస్థాన్‌పై పసిడి**

పురుషుల టీ20 క్రికెట్ ఫైనల్లో భారత్ 19 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించి వరుసగా రెండోసారి ఆసియా క్రీడల స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 211 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ 61, తిలక్ వర్మ 51 పరుగులతో రాణించారు. అనంతరం పాకిస్థాన్ 192 పరుగులకే పరిమితమైంది. దీంతో భారత్ పురుషుల క్రికెట్‌లోనూ పసిడి నిలబెట్టుకుంది.

**హాకీలోనూ స్వర్ణమే**

భారత పురుషుల హాకీ జట్టు ఫైనల్లో మలేసియాను 5--1తో ఓడించి స్వర్ణ పతకం సాధించింది. దీంతో ఆసియా క్రీడల్లో భారత్ పసిడి పతకాల సంఖ్య 21కు చేరింది. ఇక పోటీల చివరి దశలో బాక్సింగ్, కుస్తీ, షూటింగ్, అథ్లెటిక్స్, కబడ్డీ తదితర విభాగాల్లోనూ భారత క్రీడాకారులు పతకాలు సాధించారు. మొత్తం 85 పతకాలతో భారత్ ఆసియా క్రీడల ప్రచారాన్ని ఘనంగా ముగించింది.

## పైలట్ స్మిత్ మచ్చర్‌ను పరామర్శించిన
# దుబాయ్ యువరాజు

- ఆత్మీయంగా నుదిటిపై ముద్దు
- స్మిత్ తమ బృందంలో, దేశ చరిత్రలో భాగమన్న యువరాజు
- ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో చికిత్స

**అబుదాబి, వెలుతురు అక్టోబర్ 03 :** ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో కో-పైలట్ దాడిలో తీవ్రంగా గాయపడిన పైలట్ స్మిత్ మచ్చర్ ఆరోగ్యం వేగంగా మెరుగుపడుతోందని యూఏఈ లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ప్రస్తుతం స్మిత్ ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని తెలిపింది. ఆయన కుటుంబసభ్యులు, స్థానిక అధికారులతో సంప్రదింపులు కొనసాగుతున్నట్లు పేర్కొంది. యూఏఈ ప్రభుత్వానికి భారత రాయబార కార్యాలయం కృతజ్ఞతలు తెలిపింది. మరోవైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పైలట్ స్మిత్ మచ్చర్‌ను యూఏఈ ఉప ప్రధాని, దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ అల్ మక్తూమ్ పరామర్శించారు. ఆత్మీయంగా ముద్దు పెట్టారు. ప్రయాణికుల ప్రాణాల కాపాడటానికి అత్యంత ధైర్యసాహసాలు కనబర్చిన స్మిత్‌కు ధైర్యం చెప్పారు. ఆయన తమ బృందంలో, దేశ చరిత్రలో ఓ భాగమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. యూఏఈ ఆశయాలకు ప్రతీకగా నిలబడం తమకు గర్వకారణమని దుబాయ్ యువరాజు అన్నారు.

## కరవుతో అల్లాడుతున్న కర్ణాటకకు
# తక్షణమే సాయం చేయండి

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ
- చిన్న, సన్నకారు రైతులకు తక్షణమే పరిహారం
- అందించాలంటూ 6 అభ్యర్థనలు

**న్యూఢిల్లీ, వెలుతురు, అక్టోబర్ 03 :** వర్షాలు లేక కరవుతో అల్లాడుతున్న కర్ణాటకకు తక్షణమే సాయం అందించాలని విజ్ఞప్తి చేస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఎక్స్లో పోస్ట్ చేసిన ఈ 11 పేజీల ఈ లేఖలో, కర్ణాటకలో తీవ్రంగా నష్టపోయిన చిన్న, సన్నకారు రైతులకు తక్షణమే పరిహారం అందించాలంటూ ఖర్గే 6 కీలక అభ్యర్థనలు చేశారు.

**రైతులకు ఇన్పుట్ సబ్సిడీ**

చిన్న, సన్నకారు రైతులకు రక్షణ కల్పించాలని, అర్హులైన ప్రతి రైతుకు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని ఖర్గే కోరారు. ఇందుకోసం కాలం చెల్లిన 2015-16 వ్యవసాయ గణాంకాల ప్రకారం కాకుండా, కర్ణాటక నవీకరించిన భూమి రికార్డు ఆధారంగా రైతులకు ఇచ్చే ఇన్పుడ్ సబ్సిడీ లెక్కించాలని ఆయన ప్రధాని మోదీని కోరారు. తక్షణమే రాష్ట్రంలోని కరవు జిల్లాలను ప్రకటించాలని, ప్రస్తుతం క్షేత్రస్థాయి పరిశీలనలో ఉన్న 11 అదనపు తాలూకాలను, వాటితోపాటు అర్హత ఉన్న ఇతర తాలూకాలను కూడా ఇందుకోసం పరిగణనలోకి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కావేరి నది సహా జలవిద్యుత్ కేంద్రాల పరీవాహక ప్రాంతాల్లో నీటి మట్టాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో, తాగు నీటి భద్రత కల్పించాలని ఖర్గే కోరారు. కర్ణాటకలో 31 లక్షలకు పైగా రైతు కుటుంబాలు ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని, రాజకీయాలకు అ-తీతంగా అత్యవసరంగా, న్యాయబద్ధంగా సహాయం అందించాలని ఖర్గే ప్రధాని మోదీని కోరారు. ఇది ఒక మానవీయ బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. "భారత ప్రభుత్వం అత్యవసరంగా, మానవతా దృక్పథంతో స్పందించి, కరవు ప్రభావితమైన లక్షలాది మంది పౌరులకు అత్యవసరమైన ఆహారం, నీరు, జీవనోపాధి, పశువులకు పశుగ్రాసం అందించాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను" అని ఖర్గే అన్నారు. ఇదే విషయాన్ని తాను కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు కూడా లేఖ ద్వారా తెలియజేశానని ఆయన పేర్కొన్నారు.

**మా దృష్టి కరవు బాధితులపైనే ఉంది!**

మరోవైపు మహారాష్ట్రలో నెలకొన్న కరవు పరిస్థితులపై నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు తమ పార్టీ దృష్టి పూర్తిగా మహారాష్ట్రలో కరవు బారిన పడిన ప్రజలకు సహాయం చేయడంపైనే ఉందని ఉన్నారు. మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరవు నెలకొంది. వర్షాలు లేక, తాగు, సాగు నీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. అందుకే కరవు ప్రభావిత ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ కూలీలకు, ఇతరులకు తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే శరద్ పవర్ వ్యాఖ్యలు చేశారు. నవంబర్ 3న ప్రధాని మోదీ బారామతిని సందర్శించనున్నారని, తమ ప్రభుత్వం దృష్టి కరవు బాధితులకు సాయం చేయడంపైనే నెలకొని ఉందన్నారు.

**రైతు రుణాలు మాఫీ చేయండి!**

అంతకు ముందు సెప్టెంబర్ 28న ఎన్సీపీ-ఎస్పీ ఎమ్మెల్యే రోహిత్ పవార్ మహారాష్ట్ర కరవు పరిస్థితి, 1972 నాటి కంటే దారుణంగా ఉందని అన్నారు. అందువల్ల రైతులు, వ్యవసాయ కూలీలకు తక్షణ సాయం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సదరు రైతుల నుంచి రుణ వసూళ్లు నిలిపివేయాలని, పూర్తిగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఎటువంటి రాయితీలు కల్పించని పక్షంలో రైతుల విద్యుత్ బిల్లులను పూర్తిగా మాఫీ చేయాలన్నారు. అలాగే కరవు ప్రభావిత ప్రాంతాల్లోని విద్యార్థుల పాఠశాల ఫీజులను రద్దు చేయాలని రోహిత్ పవార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకల మొదలైన పశువులు ఉన్న రైతులకు ప్రత్యక్ష ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ సందర్భంగా రోహిత్ పవార్ మహారాష్ట్ర ప్రభుత్వంపైనా సునిశిత విమర్శలు చేశారు. కరవు సహాయంపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, జలవనరుల శాఖామంత్రి గిరీశ్ మహాజన్ భిన్నమైన ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. తాము వెంటనే సహాయం చేస్తామని సీఎం చెబుతుంటే, ఒక విధానం ప్రకారం సాయం చేస్తామని మంత్రి గిరీశ్ అంటున్నారని ఎద్దేవా చేశారు.

## హసీనా అప్పగింతపై
# నిర్దిష్ట కాలపరిమితిని చెప్పలేం

- భారత హైకమిషనర్ దినేశ్ త్రివేది స్పష్టత
- ఆనాటి క్లిష్ట పరిస్థితుల్లో ఆమెకు ల్యాండింగ్ అనుమతి ఇచ్చినట్టు వెల్లడి

**ఢాకా, వెలుతురు అక్టోబర్ 03 :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా అప్పగింతపై బంగ్లాదేశ్‌లో భారత హైకమిషనర్ దినేశ్ త్రివేది స్పష్టత ఇచ్చారు. షేక్ హసీనా అప్పగింత అభ్యర్థన ప్రస్తుతం భారతదేశంలో చట్టపరమైన ప్రక్రియ పరిశీలనలో ఉందని, ఇందులో కోర్టుల ప్రమేయం ఉన్నందున దీనిపై ఎలాంటి నిర్దిష్ట కాలపరిమితిని చెప్పలేమని స్పష్టం చేశారు. ఢాకాలో శనివారం జరిగిన ఐదో 'బే ఆఫ్ బెంగాల్ కాన్ఫరెన్స్ 2026'లో ఆయన మాట్లాడుతూ, హసీనా తిరిగి రావడంపై ఎవరూ గడువును చెప్పలేరని అన్నారు. బంగ్లాదేశ్‌లో 2024 అక్టోబర్‌లో భారీ ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల నేపథ్యంలో తన ప్రభుత్వం కూలిపోవడంతో ఢాకా విడిచిపెట్టిన 79 ఏళ్ల షేక్ హసీనా అప్పటి నుంచి భారత్‌లోనే ఉంటున్నారు. దీనిపై దినేశ్ త్రివేది మరింత వివరణ ఇస్తూ, షేక్ హసీనాను భారత వైమానిక దళం కానీ భారత సైన్యం కానీ దేశంలోకి తీసుకురాలేదని తెలిపారు. స్వదేశంలో తలెత్తిన తీవ్ర ఉద్రికత పరిస్థితుల నేపథ్యంలో ఆమె స్వయంగా బంగ్లాదేశ్ సైనిక విమానంలో భారత్‌కు చేరుకున్నారని చెప్పారు. ఆమె భారత్‌కు వచ్చే సమయానికి ఇంకా బంగ్లాదేశ్ ప్రధానిగానే ఉన్నారని, పొరుగు దేశంగా ఆనాటి క్లిష్ట పరిస్థితుల్లో ఆమెకు ల్యాండింగ్ అనుమతి ఇవ్వడం మినహా భారతదేశానికి మరో ప్రత్యామ్నాయం లేకపోయిందని అన్నారు.

# దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలే

- ఈవీఎంల పార్తిగా దుర్వినియోగం జరిగింది
- లోక్‌సభ, అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి
- మోదీ, అమిత్ షా అక్రమంగా పదవుల్లో ఉన్నారు
- కేంద్ర ప్రభుత్వంపై మల్లికార్జున ఖర్గే ఆరోపణలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 03(ఆర్ఎన్ఏ):** కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్లేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

# ముున్ముందు ఆర్థిక సవాళ్లు తప్పదు

- అంతా బాగుందనుకుంటే ప్రమాదమే
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి
- ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి
- ప్రపంచ దేశాల మధ్య విభేదాలు తప్పవు
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**న్యూఢిల్లీ, అక్టోబర్ 03(ఆర్ఎన్ఏ):** ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, వాణిజ్య ఆంక్షలు, సరఫరా సమస్యలు, సాంకేతిక మార్పులు, వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక ముప్పుల విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కోవిడ్ తర్వాత ప్రపంచం ఎన్నో ఆర్థిక, ఇతర సంక్షోభాలను ఎదుర్కొందని మల్హోత్రా తెలిపారు. అయినా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వాటిని తట్టుకుని నిలబడిందన్నారు. భారత్‌లోనూ చాలాకాలంగా ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉన్నాయని చెప్పారు. అయితే ఇదే స్థిరత్వం మరో సమస్యకు దారి తీయొచ్చని ఆయన హెచ్చరించారు. చాలాకాలం ఎలాంటి పెద్ద సంక్షోభం రాకపోతే గతంలో ఎదురైన సమస్యలను ప్రజలు, సంస్థలు మర్చిపోతారని అన్నారు. దీంతో ఎక్కువ రిస్క్ తీసుకోవడం, భారీగా అప్పులు చేయడం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. బ్యాంకింగ్, ఆర్థిక రంగాల్లో సమస్యలు ఒక్కసారిగా బయటపడే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. అయితే వాటిని పూర్తిగా పరిష్కరించడానికి మాత్రం చాలా సమయం పడుతుందని చెప్పారు. అందుకే పరిస్థితులు బాగున్న సమయంలోనే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గతంలో నడిపించిన విధానాల్లో ఇప్పుడు మార్పులు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక విభేదాలు పెరుగుతున్నాయని చెప్పారు. వాణిజ్య ఆంక్షలు, సరఫరా అంతరాయాలు కూడా తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ మార్పులన్నీ ఒకదానితో ఒకటి కలిసి ప్రభావం చూపుతున్నాయని మల్హోత్రా అన్నారు. అందువల్ల కేంద్ర బ్యాంకులు కేవలం ద్రవ్యోల్బణం, ఆర్థిక స్థిరత్వంపైనే దృష్టి పెట్టకుండా ప్రపంచ పరిణామాలను కూడా గమనించాలని సూచించారు.

# విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేయాలి

- ప్రతి విశ్వవిద్యాలయంలో అంకుర సంస్థల కేంద్రం ఉండాలి
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 3:** విద్యార్థులను భవిష్యత్ ఉద్యోగ ప్రపంచానికి సిద్ధం చేసే విధంగా విద్యా వ్యవస్థ ఉండాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో తెలంగాణ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన 'రీచ్-2026' సదస్సులో ఆయన మాట్లాడారు.

విద్యాసంస్థల్లో బోధించే అంశాలకు, పరిశ్రమల అవసరాలకు మధ్య అంతరం ఉండకూడదని మంత్రి అన్నారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించడం తోపాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసి, వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపించేలా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. తరగతి గది నుంచి ఉద్యోగం వరకు, విద్య నుంచి నైపుణ్యాల వరకు, పరిశోధన నుంచి పరిశ్రమల వరకు నిరంతర మార్గాన్ని తెలంగాణ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యార్థి ఒక కోర్సు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగానికి సిద్ధంగా ఉండాలని, పట్టా పొందిన తర్వాత మరో ఆరు నెలలు శిక్షణ తీసుకోవాల్సిన పరిస్థితి ఉండకూడదని శ్రీధర్‌బాబు అన్నారు. ప్రతి విశ్వవిద్యాలయంలో అంకుర సంస్థల కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులు, పరిశోధకులు, నూతన ఆవిష్కర్తలకు అవసరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. తద్వారా ఆలోచనలు, పరిశోధనలు అంకుర సంస్థలు, ఉత్పత్తులు, వ్యాపార సంస్థలుగా మారేలా ప్రోత్సహించవచ్చన్నారు.

పాఠ్యాంశాల రూపకల్పన, ప్రయోగశాలలు, శిక్షణ, ఉపాధి శిక్షణ, ప్రత్యక్ష ప్రాజెక్టులు, పరిశోధన, ఆవిష్కరణల్లో పరిశ్రమలు విద్యాసంస్థలకు భాగస్వాములుగా మారాలని మంత్రి సూచించారు. ఒక చేతిలో పట్టా, మరో చేతిలో నైపుణ్యం ఉండటం కొత్త ప్రమాణంగా మారాలని అన్నారు.

టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని 65 ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. రోబోటిక్స్, పారిశ్రామిక స్వయంచాలకీకరణ, ఆధునిక తయారీ, పరిశ్రమల 4.0, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

తెలంగాణలో సమాచార సాంకేతికత, అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాలు, జీవశాస్త్రాలు, ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, అంతరిక్ష, రక్షణ, ఆధునిక తయారీ తదితర రంగాల్లో అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్ర యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయి అనేదే కాకుండా, ఆ ఉద్యోగాలకు మన యువత సిద్ధంగా ఉందా అనే అంశాన్ని కూడా ఆలోచించాలన్నారు.

యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటుతో సాంకేతికత, ఉపాధి, యువత ఆకాంక్షలకు అనుసంధానమైన విద్య, నైపుణ్యాల వ్యవస్థను తెలంగాణ నిర్మిస్తోందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల మధ్య మరింత బలమైన భాగస్వామ్యం అవసరమన్నారు. పరిశోధనలు ప్రయోగశాలలకే పరిమితం కాకుండా మార్కెట్‌కు చేరి ఆవిష్కరణలు, అంకుర సంస్థలు, ఉపాధి అవకాశాలకు దోహదపడాలని ఆకాంక్షించారు.

**పరిశోధన-విద్య-అభివృద్ధిపై రీచ్-2026**

ఉన్నత విద్యను ప్రపంచస్థాయి పోటీకి అనుగుణంగా మార్చడం, తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలకు అనుసంధానం చేయడం, పరిశోధనలో నైపుణ్యం, సహకారం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పరిశోధన నుంచి వ్యాపార సంస్థల వరకు ఆవిష్కరణ, వ్యాపార వాతావరణాన్ని నిర్మించడం వంటి అంశాలపై సదస్సులో చర్చించారు.

సైయంట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి. కిషన్‌కుమార్‌రెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎం. కుమార్, ప్రొఫెసర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. సుమారు 60 ప్రభుత్వ, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల ఉపకులపతులు, ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు.

రీచ్ సదస్సు విజయాన్ని కేవలం చర్చలతో కాకుండా విశ్వవిద్యాలయాలు-పరిశ్రమల మధ్య కొత్త భాగస్వామ్యాలు, సంయుక్త పరిశోధన ప్రాజెక్టులు, విద్యార్థులకు పరిశ్రమల అనుభవం, సాంకేతిక పరిజ్ఞాన బదలాయింపు, అంకుర సంస్థలు, ఉద్యోగానికి సిద్ధమైన పట్టభద్రుల సంఖ్యతో కొలవాలని సదస్సులో అభిప్రాయం వ్యక్తమైంది. అంతరాన్ని చర్చించడమే కాకుండా దాన్ని తొలగించేందుకు కృషి చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు

- అక్బరుద్దీన్ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 03** పాతబస్తీ రాజకీయాల్లో కీలక నేతగా గుర్తింపు పొందిన ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు తెరలేపాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానో లేదో తెలియదని, ప్రస్తుతానికి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన కూడా లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. 'నేను ముసలోడిని అయిపోయాను. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు. అసలు పోటీ చేయాలనే ఆలోచన కూడా లేదు' అని అన్నారు.

**సుదీర్ఘకాలం రాజకీయాల్లో కొనసాగుతూ..**

అక్బరుద్దీన్ ఒవైసీ ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) పార్టీ శాసనసభాపక్షనేత. చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన వరుసగా శాసనసభ్యుడిగా ఎన్నికవుతున్నారు. 1999లో చాంద్రాయణగుట్ట నుంచి తొలిసారి శాసనసభకు ఎన్నికైన ఆయన 2004, 2009,2014, 2018, 2023 ఎన్నికల్లో విజయం సాధించారు. సుదీర్ఘకాలం పాటు రాజకీయాల్లో కొనసాగిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# బీసీ రిజర్వేషన్లపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

**అమరావతి వెలుతురు అక్టోబర్ 03:** వైసీపీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని ఆయన ధ్వజమెత్తారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోవిందరావుతో కలిసి 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన,పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

# జ్ఞానేష్ కుమార్ బీజేపీ కార్యకర్త.. మోదీ ఏజెంట్

- సీఈసీ రాజీనామా చేయాలి.. లేదంటే తొలగించాలి: వైఎస్ షర్మిల
- 13 కోట్ల ఓట్ల తొలగింపు దుర్మార్గం.. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**విజయవాడ, వెలుతురు అక్టోబర్ 3 :** దేశంలో ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ బీజేపీ కార్యకర్తలా, ప్రధాని మోదీ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని ఆమె విమర్శించారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, లేకుంటే ఆయనను తొలగించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఓటు విషయంలో పేద, ధనిక అనే తేడా ఉండదని షర్మిల అన్నారు. అవసరమైనప్పుడు దొంగ ఓట్లు సృష్టించడం, అవసరం లేదనుకున్నప్పుడు ఓట్లను తొలగించడం జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటివరకు 13 కోట్ల ఓట్లను తొలగించారని, ఇది దేశంలోని ఓటర్లలో సుమారు 14 శాతానికి సమానమని ఆమె పేర్కొన్నారు.

ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తిని మోదీ ప్రభుత్వం దెబ్బతీసిందని షర్మిల ఆరోపించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించడం, ప్రజలకు తమ నాయకుడిని స్వేచ్ఛగా ఎన్నుకునే అవకాశం కల్పించడం ఎన్నికల సంఘం బాధ్యత అని అన్నారు. అలాంటి సంస్థే ఓట్ల తొలగింపునకు పాల్పడుతోందని విమర్శించారు.

**14 సార్లు అభ్యంతరాలు**

ముగ్గురు సభ్యులతో కూడిన ఎన్నికల సంఘంలో నిర్ణయాలు సమష్టిగా తీసుకోవాల్సి ఉన్నప్పటికీ సీఈసీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని షర్మిల ఆరోపించారు. గత పది నెలల్లో సీఈసీ తీసుకున్న పలు నిర్ణయాలపై మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఇటీవల వచ్చిన నివేదికలను ఆమె ప్రస్తావించారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం భిన్నాభిప్రాయాలు నిర్ణయ ప్రక్రియలో సాధారణమేనని, గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే ఉన్నాయని స్పష్టం చేసింది.

సీఈసీ నియామక ప్రక్రియపైనా షర్మిల విమర్శలు చేశారు. ప్రస్తుత చట్టం ప్రకారం ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేతతో కూడిన ఎంపిక కమిటీ జ్ఞానేష్ కుమార్‌ను సీఈసీగా ఎంపిక చేసిందని అన్నారు. 2025లో ఆయన నియామక సమయంలో ఇదే ఎంపిక ప్రక్రియ అమల్లో ఉంది.

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని లేదా ఆయనను సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని షర్మిల తెలిపారు. సీఈసీ చర్యలపై విచారణ జరిపి, తప్పిదం రుజువైతే అరెస్టు చేయాలని కోరారు. తొలగించినట్లు పేర్కొంటున్న 13 కోట్ల ఓట్లను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఓట్ల తొలగింపుకు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా రాజీనామా చేయాలని ఆమె కోరారు.

# గౌరవెల్లి భూసేకరణకు వేగం

- పనులు ముందుకు తీసుకెళ్లాలని మంత్రుల ఆదేశం
- భూసేకరణ, ఆర్అండ్ఆర్, అనుమతులపై సమీక్ష
- ఎకరాకు రూ.17 లక్షల పరిహారం
- కాలువల పనులకు అడ్డంకులు లేకుండా చర్యలు
- సవరించిన అంచనాలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 03** గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు పనుల పురోగతిపై సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం (ఆర్అండ్ఆర్), పర్యావరణ అనుమతులు, సవరించిన అంచనాలు, కాలువల పనులు, నీటి నిల్వలు తదితర అంశాలపై అధికారులు మంత్రులకు వివరించారు.

**2007లో శంకుస్థాపన.. 2013 నాటికి 57 శాతం పనులు**

2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2013 నాటికి సుమారు 57 శాతం పనులు పూర్తయ్యాయి. అనంతరం వివిధ పరిపాలనా కారణాలతో భూసేకరణ ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంది. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించి గణనీయమైన పురోగతి సాధించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన భూసేకరణను వేగవంతం చేసి ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని మంత్రులు ఆదేశించారు.

**ఎకరాకు రూ.17 లక్షల పరిహారం**

గౌరవెల్లి రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.17 లక్షల చొప్పున పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రులు సూచించారు. వివాహిత కుమార్తెలకు పునరావాస ప్రయోజనాలు, పాత, కొత్త ముంపు ప్రాంతాల పరిధిలోని కుటుంబాలకు సంబంధించిన అంశాలను కూడా సమీక్షించారు.

**కాలువల భూసేకరణపై సమీక్ష**

గౌరవెల్లి కాలువలకు సంబంధించిన భూసేకరణ పురోగతిని మంత్రులు సమీక్షించారు. ఇప్పటికే పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసి లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. మిగిలిన భూసేకరణను వేగవంతం చేసి కాలువల పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రులు ఆదేశించారు.

**పర్యావరణ అనుమతులపై చర్యలు**

గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పర్యావరణ అనుమతుల అంశంపై సమావేశంలో చర్చించారు. కేంద్ర సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన తాజా పర్యావరణ అనుమతులు పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయని వివరించారు.

**సవరించిన అంచనాల సమర్పణ**

భూసేకరణ, పునరావాసం, ధరల పెరుగుదల తదితర కారణాలతో గౌరవెల్లి రిజర్వాయర్, కాలువలకు సంబంధించిన సవరించిన అంచనాలను ప్రభుత్వానికి సమర్పించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన పనులకు పరిపాలనా అనుమతులు పొందిన అనంతరం టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎంఎంఆర్ ప్యాకేజీ-3 పనులకు సంబంధించిన సవరించిన అంచనాలు, అదనపు నిర్మాణాల ప్రతిపాదనలు, భవిష్యత్ కార్యాచరణపై కూడా సమీక్ష జరిగింది. అవసరమైన పర్యావరణ, ఇతర ప్రభుత్వ అనుమతులు పొందిన వెంటనే గౌరవెల్లి రిజర్వాయర్ పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, భూసేకరణ-పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఎన్‌సీ జనరల్ రమేష్ బాబు, ఈఎన్‌సీ ఓఅండ్ఎం మధుసూదన్ రావు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్‌తో పాటు మూడు జిల్లాలకు చెందిన అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వనరుల సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- పెట్టుబడుల ఆకర్షణ, ప్రభుత్వ భూముల విలువ పెంపుపై దృష్టి
- పర్యాటక రంగాన్ని కీలక ఆదాయ వనరుగా తీర్చిదిద్దాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సమావేశానికి హాజరురైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 03:** రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. హిల్ట్ పాలసీ అమలు, పర్యాటక రంగంలో పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన వనరుల సమీకరణపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సివిల్ సప్లై, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వ భూములను సమర్థవంతంగా వినియోగించుకోవడం, వాటి విలువను పెంచడం, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం, పర్యాటక రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదనపు ఆదాయ వనరులను గుర్తించడంతోపాటు పెట్టుబడులను ఆకర్షించే ప్రాజెక్టులను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తులు, భూముల ద్వారా గరిష్ఠ ఆర్థిక ప్రయోజనం పొందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

హిల్ట్ పాలసీ లో ఎలాంటి అభ్యంతరాలు లేని పార్కులకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన క్లియరెన్స్ ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. తద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని వేగంగా సమీకరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. హిల్ట్ పాలసీపై పరిశ్రమలకు మరింత అవగాహన కల్పించేందుకు ఆరు పార్కుల్లో మంత్రుల ఆధ్వర్యంలో రోడ్‌షోలు నిర్వహించాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు 70-80 పర్యాటక ప్రాజెక్టులు**

పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేలా ప్రాజెక్టులను సిద్ధం చేయాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గతంలో తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను వివరించినప్పుడు సుమారు రూ.30 వేల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. రాబోయే గ్లోబల్ సమ్మిట్‌లో దేశ, విదేశీ పెట్టుబడిదారులకు తెలంగాణ పర్యాటక రంగంలోని అవకాశాలను సమగ్రంగా ప్రదర్శించేందుకు 70--80 సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఅర్ లు) సిద్ధం చేయాలని సీఎస్ కి సూచించారు. పర్యాటక ప్రాజెక్టులకు అనువైన ప్రాంతాలను గుర్తించి, పెట్టుబడిదారులను ఆకర్షించేలా ప్రతిపాదనలు రూపొందించాలని భట్టి ఆదేశించారు.

**కోటలు, టైగర్ టూరిజంపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలోని చారిత్రక కోటలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు పీపీపీ విధానంలో 11 కోటలకు బిడ్లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు. టైగర్ టూరిజం కార్యక్రమాలను వెంటనే ప్రారంభించాలని భట్టి ఆదేశించారు. నిజాంసాగర్‌లోని నిజాం గెస్ట్‌హౌస్‌ను పర్యాటక అవసరాలకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు.

రాష్ట్రంలో పర్యాటక మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు కారవాన్ పార్కుల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఇందుకోసం గుర్తించిన మూడు జిల్లాల కలెక్టర్ల సహకారంతో ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రధాన పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, ప్రతి ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుంది, ఎప్పటికి పర్యాటకులకు అందుబాటులోకి వస్తుందనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్ ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, వివిధ శాఖల ఉన్నత అధికారులు శశాంక, కృష్ణ భాస్కర్, ఇలంబర్తి, నిఖిల్ చక్రవర్తి, లోకేష్ కుమార్, కృష్ణ ఆదిత్య, సర్ఫరాజ్ అహ్మద్, అధికారులు పాల్గొన్నారు

# కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

- మెట్రో, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం.. మెట్రో-ఆర్టీసీ అనుసంధానానికి శ్రీకారం
- ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 03:** హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మెట్రో రైలు, టీజీఎస్‌ఆర్టీసీ బస్సు సేవలను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రయాణికులకు ఒకే పాస్‌తో మరింత సులభంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం కల్పించింది. ఈ సౌకర్యం అమలు తీరును స్వయంగా పరిశీలించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు.

బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేష్, నవీన్ యాదవ్, అధికారులు కామన్ పాస్‌తో మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలువురు ప్రయాణికులతో నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం ఎలా ఉంది మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా ప్రయాణం సులభమైందా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు.

**ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన**

కామన్ పాస్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు ప్రయాణికులు భట్టికి తెలిపారు. మెట్రోలో ప్రయాణించిన అనంతరం గమ్యస్థానానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల సమయం ఆదా అవుతోందని చెప్పారు. ప్రత్యేకంగా మరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకపోవడం సౌకర్యంగా ఉందన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత ఏ బస్సు ఎక్కాలి, ఏ మార్గంలో వెళ్లాలి అనే విషయంలో గతంలో ఎదురయ్యే అయోమయం కూడా తగ్గిందని ప్రయాణికులు వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో-ఆర్టీసీ సేవలను అనుసంధానం చేయడం వల్ల రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు.

**బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చట**

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి టీజీఎస్‌ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్ వరకు ప్రయాణించారు. బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చటిస్తూ కామన్ పాస్ వినియోగం, ప్రయాణ సౌకర్యం, మెట్రో-బస్సు అనుసంధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

**ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరం: భట్టి**

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ విధానం ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులను సమన్వయంతో వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అయోమయం తగ్గుతాయని తెలిపారు. మెట్రోలో ప్రయాణిస్తున్న మహిళలు, ఇతర ప్రయాణికులతో మాట్లాడగా కామన్ పాస్ విధానం సౌకర్యవంతంగా ఉందని వారు చెప్పారని భట్టి పేర్కొన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత తమ ఇల్లు, కార్యాలయం లేదా ఇతర గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణం మరింత సులభతరం అవుతుందని అన్నారు. ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి ప్రయాణికులకు 'సీమ్‌లెస్' ప్రయాణ అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ప్రస్తుతం మెట్రో-ఆర్టీసీ సేవలను అనుసంధానం చేశామని, భవిష్యత్తులో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్టి కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రజా రవాణాను బలోపేతం చేస్తాం: పొన్నం**

హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే పాస్‌తో ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడం ముఖ్యమైన పరిష్కారమని పేర్కొన్నారు. ప్రజలను వ్యక్తిగత వాహనాల నుంచి ప్రజా రవాణా వైపు ఆకర్షించాలంటే ఆర్టీసీ, మెట్రో సేవలను సమన్వయంతో, సౌకర్యవంతంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు డైలీ పాస్, మంత్లీ పాస్‌తో పాటు కామన్ పాస్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

ప్రయాణికుల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని కామన్ పాస్ సేవలను మరింత మెరుగుపరుస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలకు ఆర్థికంగా అందుబాటులో ఉండేలా మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్ భవిష్యత్తు అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంలో ప్రజా రవాణా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు (అర్బన్ ట్రాన్స్‌పోర్ట్-మెట్రో) ఎన్.వి.ఎస్.రెడ్డి, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలకు
# తాన్లా ఫౌండేషన్ అండ

- సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో రూ.300 కోట్లతో 5,000 ఇళ్ల నిర్మాణం
- దసరా పండుగ రోజున భూమిపూజ
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**సత్తుపల్లి, వెలుతురు అక్టోబర్ 03:** పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ఒకవైపు కృషి చేస్తుండగా.. దాతృత్వ సంస్థలు కూడా ప్రభుత్వంతో చేతులు కలపడం అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని నిరుపేదల కోసం తాన్లా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉదయ్ కుమార్ రెడ్డి సొంత నిధులతో సుమారు రూ. 300 కోట్ల అంచనా వ్యయంతో 5,000 ఇళ్లను ఉచితంగా నిర్మించి ఇవ్వడానికి ముందుకు వచ్చారని తెలిపారు. దసరా పండుగ రోజున ఈ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు.

సత్తుపల్లి మండలం బేతుపల్లి గంగారం గ్రామంలో తాన్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రం, ల్యాబొరేటరీలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా రక్తపరీక్ష చేయించుకున్నారు. అనంతరం వైద్యాధికారులు, రోగులతో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే, తాన్లా ఫౌండేషన్ తరఫున ఉదయ్ కుమార్ రెడ్డి తన సొంత నిధులతో 5,000 ఇళ్లను నిర్మించి ఇస్తానని ముందుకు వచ్చారని తెలిపారు. పేద కుటుంబాలకు కేవలం ఇల్లు మాత్రమే కాకుండా ఆత్మగౌరవంతో జీవించే సొంత చిరునామా కల్పించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన ముందుకు తీసుకెళ్లేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, జారే ఆదినారాయణ సమన్వయంతో అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పేదలకు ఆరోగ్యం.. అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ ఆసుపత్రి నారాయణపురం గ్రామంలో పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు శ్రీ షిరిడి సాయి జనమంగళం ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని మంత్రి తెలిపారు.

## కళ్లెదుట గోదావరి నీళ్లున్నా
# మోటార్లు ఆన్ చేయడం లేదు

- కాంగ్రెస్‌ది కాలం తెచ్చిన కరువు కాదు.. ఆ పార్టీ తెచ్చిన కరువు
- రోడ్ల గుంతలు పూడ్చేందుకు పైసలు లేవు
- ఫ్యూచర్ సిటీకి రూ.10 వేల కోట్లు ఎందుకు..
- ఆరు గ్యారెంటీలను బొందపెట్టి.. గోరీ కట్టారని హరీశ్‌రావు విమర్శ

**మెదక్, అక్టోబర్ 3:** కళ్లెదుట గోదావరి నీళ్లున్నా మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని విమర్శించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని కాగజ్ మద్దూర్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.

**రోడ్లకు పైసలు లేవు..**
**ఫ్యూచర్ సిటీకి రూ.10 వేల కోట్లా?**

కేసీఆర్ హయాంలో వేసిన రోడ్లకు గుంతలు పడినా వాటిని పూడ్చే పరిస్థితి లేదని హరీశ్‌రావు అన్నారు. కాగజ్ మద్దూర్ రోడ్లపై మోకాలి లోతు గుంతలు ఏర్పడి గర్భిణీలు ఆసుపత్రులకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఉందన్నారు. ప్రజల రోడ్ల గుంతలు పూడ్చేందుకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం.. ఫ్యూచర్ సిటీ వద్ద ఆరు వరుసల రోడ్లకు రూ.10 వేల కోట్లు ఖర్చు చేయడం ఎవరి ప్రయోజనం కోసం అని ప్రశ్నించారు. అనుయాయుల భూముల ధరలు పెంచేందుకే ఫ్యూచర్ సిటీ రోడ్లు నిర్మిస్తున్నారా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

ఎన్నికల ముందు 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని బాండ్ పేపర్లు రాసి ఇచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. అవ్వలకు నెలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్నారని, నెలకు రూ.2 వేల చొప్పున లెక్కించినా 34 నెలలకు ఒక్కో అవ్వకు రూ.68 వేల బకాయి పడిందని ఆరోపించారు. రైతుబంధు కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి, కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేలు కూడా ఇవ్వకుండా మూడు సీజన్ల పాటు ఎగ్గొట్టారని అన్నారు.

**కరెంటు కోతలు.. మళ్లీ పాత కష్టాలు**

రామాయంపేట రైతులు కరెంటు లేక పంటలు ఎండిపోతున్నాయని, మోటార్లు కాలిపోతున్నాయని తనకు ఫోన్ చేసి చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. వ్యవసాయానికి ఆరు, ఏడు గంటల కరెంటు కూడా నిరంతరంగా రావడం లేదని, గంటకోసారి ట్రిప్ అవుతుండటంతో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. కేసీఆర్ హయాంలో మండుటెండల్లోనూ 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చామని, వ్యవసాయ కనెక్షన్‌కు రూ.4,500 చెల్లిస్తే కనెక్షన్ ఇచ్చేవారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కనెక్షన్ డిపాజిట్ చార్జీలను రూ.10 వేలకు పెంచిందని, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆరోపించారు. కరెంటు కోతలకు ఎల్‌నినో కారణమని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని, వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించినా బొగ్గు నిల్వలు, ముందస్తు ఒప్పందాలపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. సింగరేణి థర్మల్ ప్లాంట్ నుంచి 800 మెగావాట్ల విద్యుత్‌ను రాజస్థాన్‌కు విక్రయించేందుకు జాయింట్ వెంచర్ చేసుకోవడాన్ని ప్రశ్నిస్తూ, ఆ నిర్ణయాన్ని రద్దు చేసి విద్యుత్‌ను రాష్ట్ర అవసరాలకు వినియోగించాలని తాను లేఖ రాసినట్లు తెలిపారు. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని తాను ఆరు నెలల క్రితమే వెల్లడించానని, దీనిపై వాస్తవాలు చూపించేందుకు రామగుండం, కొత్తగూడెం, భూపాలపల్లి వెళ్లే ప్రయత్నంలో పోలీసులు తనను అరెస్టు చేశారని అన్నారు. బొగ్గు కొరత కారణంగా కొత్తగూడెం, భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్లలో సుమారు 2,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిందని ఆరోపించారు.

**గోదావరి నీళ్లున్నా మోటార్లు ఎందుకు ఆన్ చేయరు?**

కాళేశ్వరం ప్రాజెక్టు కింద కన్నెపల్లిలో మోటార్లు ఆన్ చేస్తే నర్సాపూర్, మంజీరా ప్రాంతాలకు గోదావరి నీళ్లు పుష్కలంగా వస్తాయని హరీశ్‌రావు అన్నారు. అన్నారం, సుందిల్ల బ్యారేజీలు సురక్షితంగా ఉన్నాయని నివేదికలు వచ్చాయని, నీటిని వినియోగించుకోవచ్చని ఎన్‌డీఎస్‌ఏ హైకోర్టుకు తెలిపిందని పేర్కొన్నారు.

శ్రీశైలంలో నీళ్లు నిండుగా ఉన్నా కల్వకుర్తి మోటార్లను ఎనిమిది గంటలే నడుపుతున్నారని, సమ్మక్క బ్యారేజీలో నీళ్లున్నా దేవాదుల మోటార్లను ఎనిమిది గంటలే నడుపుతున్నారని అన్నారు. కళ్లముందు నీళ్లు ఉండి కూడా వాటిని ఎత్తకపోతే దాన్ని కాలం తెచ్చిన కరువు ఎలా అంటారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ఆసుపత్రులను నిర్వీర్యం చేశారని ఆరోపించిన హరీశ్‌రావు.. నర్సాపూర్ ఆసుపత్రిలో అయోడిన్, టీటీ ఇంజెక్షన్, స్టిచ్చింగ్ మెటీరియల్ కూడా అందుబాటులో లేక బయట కొనుక్కోవాల్సి వస్తోందని అన్నారు. ఆడబిడ్డలకు భరోసాగా ఉన్న కేసీఆర్ కిట్‌ను కూడా నిలిపివేశారని విమర్శించారు. కొమురవెల్లి మల్లన్న, భద్రాద్రి రామయ్య, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి, ఏడుపాయల అమ్మవారు, మెదక్ చర్చిపై ప్రమాణాలు చేసి ఆగస్టులోగా రుణమాఫీ చేస్తానని చెప్పి అమలు చేయలేదని హరీశ్‌రావు ఆరోపించారు.

# బొల్లారం ఆయుధాల చోరీ కేసులో కీలక పురోగతి

- మరో ఏడుగురు నిందితుల అరెస్ట్
- ప్రధాన నిందితుడు మల్లేశ్ ఇచ్చిన వివరాలతో మలుపు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 03:** సంచలనంగా మారిన బొల్లారం ఆయుధాల చోరీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఆయుధాల చోరీ కేసులో మరో ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు మల్లేశ్ ఇచ్చిన వివరాలతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన పలు విషయాలను మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు.

**మల్లేశ్ ఇచ్చిన వివరాలతో..**

ఈ కేసులో ప్రధాన నిందితుడు మల్లేశ్ ఇచ్చిన వివరాలతో నిందితులు శేషు, వినోద్, ప్రవీణ్, నిరంజన్, మల్లికార్జున్, బీర్బల్ షా, అవి దెయ్‌ను అరెస్టు చేసినట్లు సీపీ సుమతి వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మల్లేశ్ ఒకేసారి ధనవంతుడు కావాలని దురుద్దేశంతో ఈ నేరానికి పాల్పడ్డాడని సీపీ సుమతి చెప్పారు. నిందితుడు గతంలోనూ అనేక దొంగతనాలకు పాల్పడ్డాడని తెలిపారు. స్నేహితులతో కలిసి మల్లేశ్ ఆయుధాల చోరీకి పాల్పడ్డాడని సీపీ వివరించారు.

**దోపిడీలకు వాడాలని కుట్ర**

ఆయుధాల చోరీ కేసులో ఏ2 శేషు, ఏ3 వినోద్, ఏ4 ప్రవీణ్ ఆర్మీలో పనిచేస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించినట్లు సీపీ సుమతి పేర్కొన్నారు. ఆయుధాలను బ్యాంకులు, జ్యువెల్లరీ షాపుల్లో చోరీలకు వాడాలనుకున్నారని గుర్తించినట్లు వెల్లడించారు. ధనవంతుల బెదిరింపులు, దోపిడీలకు వాడాలని కుట్ర చేసినట్లు తమ దర్యాప్తులో తేలిందని సీపీ సుమతి తెలిపారు.

**ఉగ్రవాద లింకులు లేవని స్పష్టం**

ఆయుధాలు కావాలని ఇద్దరు పశ్చిమ్ బెంగాల్ వాసులు సంప్రదించారని గుర్తించామన్నారు. పిస్టల్‌కు రూ.3 లక్షలు, లాంగ్ వెపన్‌కు రూ.5 లక్షలకు ఒప్పందం జరిగిందని వెల్లడించారు. మల్లేశ్‌పై గతంలో అచ్చంపేట, అబ్రాబాద్ పీఎస్‌లలో చోరీ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయుధాల కేసులో ఉగ్రవాద లింకులు లేవని స్పష్టం చేశారు. ఆయుధాలతో చోరీలకు పాల్పడే ఉద్దేశంతోనే కుట్ర జరిగిందని వివరించారు.

# కోర్టు తీర్పుతో మనస్తాపం

## కూతురిని కాల్చి చంపి తల్లి ఆత్మహత్య
## హ్యూస్టన్‌లో విషాద ఘటన

**హ్యూస్టన్, వెలుతురు అక్టోబర్ 3:** అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం హ్యూస్టన్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. కూతురి కస్టడీకి సంబంధించిన కోర్టు తీర్పుతో మనస్తాపానికి గురైన ఓ తల్లి.. తన కూతురిని కాల్చి చంపి, అనంతరం తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. చైల్డ్ కస్టడీకి సంబంధించి తల్లి సిబెల్లా సెవెల్లా (35), తండ్రి ఆరోన్ సెవెల్లా మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ కేసులో న్యాయస్థానం కూతురు వివియన్ ప్రాథమిక కస్టడీని తండ్రి ఆరోన్ సెవెల్లాకు అప్పగిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే తల్లి సిబెల్లా.. కూతురిని పర్యవేక్షణలో మాత్రమే కలుసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఈ తీర్పుతో తీవ్ర మనోవేదనకు గురైన సిబెల్లా.. తీర్పు వెలువడిన కొన్ని గంటల్లోనే కూతురు వివియన్‌ను తుపాకీతో కాల్చి చంపినట్లు సమాచారం. అనంతరం అదే తుపాకీతో తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# భూసేకరణ అవకతవకలపై మండిపడ్డ రైతులు

## యాచారంలో ఆర్టీసీ రోడ్డుపై బైఠాయింపు, స్తంభించిన రాకపోకలు

**యాచారం, వెలుతురు అక్టోబర్ 03:** యాచారం యాచారం మండలం మొండి గౌరెల్లి గ్రామంలో ఇటీవల చేపట్టిన భూసేకరణ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బాధిత రైతులు శనివారం తీవ్ర ఆందోళనకు దిగారు. గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 19, 68, మరియు 127 ల పరిధిలోని భూముల సేకరణలో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని, రికార్డుల నమోదులో అక్రమాలకు పాల్పడ్డారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన బాధిత రైతులు, అధికారుల నుండి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఆందోళనను తీవ్రతరం చేశారు. అనంతరం నాగార్జునసాగర్ - హైదరాబాద్ ప్రధాన రహదారిపై కుటుంబసమేతంగా బైఠాయించి రాస్తారోకో చేపట్టారు.

ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు మాట్లాడుతూ... సర్వే నంబర్లు 19, 68, 127 పరిధిలో తరతరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు సంబంధించి సరైన పరిహారం చెల్లించకుండా, నోటీసులు లేకుండా ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. స్థానిక ఆర్డీవో, జిల్లా కలెక్టర్ స్వయంగా ఘటనా స్థలానికి వచ్చి తమ సమస్యపై స్పష్టమైన సమాధానం చెప్పే వరకు రహదారిని వదిలిపెట్టేది లేదని భీష్మించుకూర్చున్నారు. రైతుల రాస్తారోకో కారణంతో నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అధికార యంత్రాంగం స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, MdI.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com